# భారత శక్తి®

Published from Hyderabad, Kadapa, Guntur, Kurnool, Khammam, Vijayawada & Warangal

సంపుటి: 20 సంచిక: 159 హైదరాబాద్, 13-12-2025, శనివారం పేజీలు: 12 వెల: 1.00


## మధ్యాహ్న భోజనం తిన్న 44 మంది విద్యార్థులకు అస్వస్థత

హైదరాబాద్: మాదాపూర్ చందానాయక్ తండ ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజనం తిన్న 44 మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. దీంతో విద్యార్థులను కొండాపూర్ ఏరియా ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. వీరిలో ఆరుగురి పరిస్థితి ఆందోళనకరంగా ఉండటంతో ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు.

బాగ్‌లింగంపల్లిలో.. హైదరాబాద్ బాగ్‌లింగంపల్లిలోని మైనార్టీ గురుకుల పాఠశాలలో ఫుడ్ పాయిజన్ అయిన ఏడుగురు విద్యార్థులు నిలోఫర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. రాత్రి భోజనం చేసిన విద్యార్థులు వాంతులు, విరోచనలు, కడుపునొప్పితో బాధపడుతున్నారని, వెంటనే వారిని ప్రభుత్వ ఆసుపత్రులకు తరలించామని గురుకుల పాఠశాల సిబ్బంది తెలిపారు.



# సీఎం రేవంత్‌రెడ్డితో అఖిలేష్ యాదవ్ భేటీ

హైదరాబాద్ డిసెంబర్ 12(భారతశక్తి ప్రతినిధి):

నగరానికి వచ్చిన ఉత్తరప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి అఖిలేష్ యాదవ్‌ను తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. జూబ్లీహిల్స్‌లోని సీఎం నివాసంలో అఖిలేష్ యాదవ్‌తో భేటీ అయ్యారు. వివిధ రాష్ట్రాలు, జాతీయ స్థాయిలో రాజకీయ పరిస్థితులపై ఇరువురు చర్చించారు. రాష్ట్రంలో అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను అఖిలేష్‌కు రేవంత్‌రెడ్డి వివరించారు.

ఈ సమావేశంలో రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్, మాజీ ఎంపీ అంజన్ కుమార్ యాదవ్, రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్, కాంగ్రెస్ నేత రోహిన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పార్టీ నుంచి వెళ్లగొట్టారు.. ఇంకా కళ్లు చల్లబడలేదా?: కవిత

హైదరాబాద్: డిసెంబర్ 12(భారతశక్తి ప్రతినిధి):

కాంగ్రెస్‌తో అంటకాగుతున్నట్లు తనపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత ఆగ్రహం



వ్యక్తం చేశారు. వెకిలి చేష్టలు చేస్తున్న గుంట నక్కలూ.. జాగ్రత్త అని ఆమె హెచ్చరించారు. హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో కవిత మాట్లాడారు. కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు చేసిన వ్యాఖ్యలపై ఆమె స్పందించారు.

క్షమాపణ చెప్పకపోతే కోర్టుకు ఈడుస్తా

"కేసీఆర్‌తో పాటు ఎవరినైనా ఒక్క పనైనా అడిగామా? దమ్ముంటే నా ఆరోపణలకు సమాధానం ఇవ్వండి. నాకు ఎవరితోనూ అవగాహన లేదు.. వ్యాపారాలు లేవు. మాధవరం కృష్ణారావుకు నోటీసులు పంపుతున్నా. వారంలో క్షమాపణ చెప్పకపోతే కోర్టుకు ఈడుస్తాను. ఏవీరెడ్డితో పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డికి భూలావాదేవీలు ఉన్నాయి. శ్రీనివాస్‌రెడ్డి నిరంతరం కేటీఆర్ వద్ద ఉంటారు. ఆయన ఎవరి బినామీనో చెప్పాలి. మాధవరం కృష్ణారావు చాలా చిన్న వ్యక్తి. ఓ గుంట నక్క ఆయన వెనక ఉండి ఆడిస్తోంది. కృష్ణారావు బాధితులు చాలామంది నాకు ఫోన్లు చేస్తున్నారు. ప్రణీత్, ప్రణవ్ కంపెనీల్లో కృష్ణారావు కుమారుడు డైరెక్టర్. ఆ కంపెనీల విల్లాలన్నీ కబ్జాల్లో కట్టినవే. వెంచర్ మధ్యలోని 10 ఎకరాల చెరువు 6 ఎకరాలకు ఎలా తగ్గింది? సీఎం రేవంత్‌రెడ్డి, హైడ్రా ఆ చెరువు సంగతి చూడాలి. కేటీఆర్ మంత్రిగా ఉన్న సమయంలో అభివృద్ధి పేరిట చెరువునే మింగేశారు.




## కేంద్ర కేబినెట్ భేటీ.. సంచలన నిర్ణయాలివే..

ఢిల్లీ: డిసెంబర్ 12(భారతశక్తి ప్రతినిధి):ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన కేంద్ర కేబినెట్ సమావేశంలో సంచలన నిర్ణయాలు తీసుకున్నారు. 2027 జనగణన, మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పేరు మార్పు వంటి పలు కీలక నిర్ణయాలను తీసుకున్నారు. ఈ మేరకు కేంద్ర సమాచార, ప్రసార శాఖ మంత్రి అశ్విన్ వైష్ణవ్ మీడియా సమావేశం నిర్వహించారు. మంత్రివర్గంలో తీసుకున్న అంశాలను వివరించారు.

కీలక నిర్ణయాలు ఇవే..

1. 2027లో రెండు విడతల్లో జరగనున్న జనగణన కోసం రూ.11,718 కోట్ల బడ్జెట్‌ను కేబినెట్ ఆమోదించింది. ఈ జనగణనను డిజిటల్ టెక్నాలజీని ఉపయోగించి నిర్వహించనున్నారు.

2. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పేరు 'పూజ్య బాపు గ్రామీణ రోజ్‌గార్ యోజన' (గా మారుస్తూ నిర్ణయం

3. ఈ పథకం కింద ఒక కుటుంబానికి ఏడాదికి ఉన్న గరిష్ఠ పని దినాలను 100 నుంచి 120 రోజులకు పెంచింది. రోజు కూలీని రూ.240గా నిర్ణయించింది. రూ.1.51 లక్షల కోట్లు కేటాయింపు.

4. బొగ్గు గనుల్లో పలు సంస్కరణలు తీసుకురావడానికి కేబినెట్ ఆమోదం తెలిపింది.

5. పీఎం కిసాన్ సమ్మాన్ యోజన.. ఈ పథకం కింద అందించే మొత్తాన్ని రూ.6,000 నుంచి రూ.10,000 వరకు పెంచాలని నిర్ణయం తీసుకుంది.

6. దేశవ్యాప్తంగా 57 కొత్త కేంద్రీయ విద్యాలయాల(ఏర్పాటుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. ఇందులో తెలంగాణకు 4, ఆంధ్రప్రదేశ్ కి 4 మంజూరు చేసింది.

7. నాలుగు కీలకమైన రైల్వే ప్రాజెక్టులకు ఆమోదం

8. సహకార రంగాన్ని మరింత బలోపేతం చేయడానికి కింద రూ.2,000 కోట్ల ఆర్థిక సహాయం

9. పీఎం కిసాన్ సంపద యోజన.. ఈ పథకానికి రూ.6,520 కోట్లు కేటాయింపు.

10. క్వాంటం టెక్నాలజీ పరిశోధన, అభివృద్ధిని ప్రోత్సహించడానికి అదనంగా రూ.4,000 కోట్ల నిధులు కేటాయింపు

11. మైక్రో, స్మాల్ అండ్ మీడియం ఎంటర్‌ప్రైజెస్ లకు బ్యాంకుల నుంచి సులభంగా రుణాలు లభించేందుకు వీలుగా రూ.15,000 కోట్లతో కొత్త క్రెడిట్ గ్యారెంటీ పథకానికి గ్రీన్ సిగ్నల్

12. దేశంలోని డిజిటల్ మౌలిక సదుపాయాలను రక్షించడనాకి సైబర్ దాడులను నిరోధించడానికి సైబర్ సెక్యూరిటీ



## మెస్సీ Vs రేవంత్ ఫుట్ బాల్ మ్యాచ్‌కి రాహుల్ గాంధీ..!

హైదరాబాద్ డిసెంబర్ 12(భారతశక్తి ప్రతినిధి):

నగరంలో జరగబోయే 'మెస్సీ గోట్ ఇండియా టూర్' అనేది ఓ ప్రైవేట్ ఈవెంట్ అయినప్పటికీ రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీలను ప్రత్యేకంగా హాజరు కావాల్సిందిగా కోరినట్లు తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. ఢిల్లీ పర్యటన ముగించుకుని హైదరాబాద్ బయలుదేరే ముందు ముఖ్యమంత్రి అక్కడి మీడియాతో మాట్లాడారు. ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన ప్రముఖ ఫుట్ బాల్ ప్లేయర్ లియోనెల్ మెస్సీ ఈనెల 13న హైదరాబాద్ వస్తున్నారని.. ఓ ప్రముఖ సంస్థ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొంటారని సీఎం చెప్పారు.

ఈ కార్యక్రమానికి తననూ ప్రత్యేక అతిథిగా పిలిచారని.. అయితే ఇది ప్రభుత్వానికి సంబంధం లేని ఈవెంట్ అని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ప్రభుత్వం తరుపున పూర్తి సహకారం అందిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో మెస్సీతోపాటు లూయిస్ సువారెజ్, రోడ్రిగో డి పాల్ వంటి అంతర్జాతీయ క్రీడాకారులు పాల్గొంటారు. అయితే, ఈ కార్యక్రమంలో మెస్సీ వర్సెస్ రేవంత్ రెడ్డి జట్లు 5 నిమిషాలపాటు మ్యాచ్ ఆడనున్నారు. మెస్సీతోపాటు ప్రముఖుల రాక నేపథ్యంలో పోలీసులు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేస్తున్నారు. అయితే.. ఈ కార్యక్రమానికి సీనియర్ కాంగ్రెస్ నేత రాహూల్ గాంధీ వస్తున్నారా, లేదా? అన్న విషయంపై ఇంకా స్పష్టత రాలేదు.

## జనవరి 30 నుంచి నిరాహార దీక్ష.. ప్రకటించిన అన్నా హజారే

ఢిల్లీ: డిసెంబర్ 12(భారతశక్తి ప్రతినిధి):ప్రముఖ సామాజిక కార్యకర్త అన్నా హజారే మరోసారి నిరాహార దీక్షకు సిద్ధమయ్యారు. మహారాష్ట్రలో లోకాయుక్త చట్టం అమల్లో జాప్యం జరుగుతున్నందుకు నిరసనగా వచ్చే ఏడాది జనవరి 30న తన స్వగ్రామం రాలేగావ్ సిద్ధిలో నిరాహార దీక్ష చేపట్టనున్నారు లోకాయుక్త చట్టం అమలులో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని అన్నా హజారే మండిపడ్డారు. ప్రజాసంక్షేమానికి కీలకమైన ఈ చట్టాన్ని నిర్లక్ష్యం చేస్తున్నారని అన్నారు. చట్టం అమలుకు గతంలో ఇచ్చిన హామీలను పక్కనపెట్టారని ఆరోపించారు.

లోకాయుక్త చట్టాన్ని తీసుకురావాలంటూ హజారే 2022లో నిరాహార దీక్ష చేపట్టారు. అయితే, అప్పటి ముఖ్యమంత్రి జోక్యంతో ఆయన దీక్షను విరమించారు. అనంతరం మహారాష్ట్ర అసెంబ్లీ లోకాయుక్త బిల్లుకు ఆమోదం కూడా తెలిపింది.

అయితే, క్షేత్రస్థాయిలో మాత్రం చట్టం అమలు జరగట్లేదని



హజారే అన్నారు. ముఖ్యమంత్రి ఫడణవీస్‌కు ఈ విషయంలో 7 లేఖలు రాసినా స్పందన కరువైందని ఆక్షేపించారు. 'ఈ చట్టం ప్రజాసంక్షేమానికి ఎంతో అవసరం. నేను ఈ విషయంపై ఏడు లేఖలు రాశాను. కానీ అవతలి వైపు నుంచి ఎటువంటి స్పందనా లేదు. ఇలా ఎందుకో నాకు అర్థం కావట్లేదు. ప్రభుత్వం ఉన్నదే ప్రజాసంక్షేమానికి, కేవలం ప్రదర్శనకు కాదు' అంటూ హజారే ఘాటు వ్యాఖ్యలు చేశారు.

## కేబినెట్ హోదాలపై పిల్.. హైకోర్టు కీలక ఆదేశాలు

హైదరాబాద్, డిసెంబరు12 కాంగ్రెస్ పార్టీకి చెందిన పలువురు ఎమ్మెల్యేలతో సహా కొందరికీ కేబినెట్ హోదా కల్పిస్తూ తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఓ జీవో ఇచ్చిన విషయం తెలిసిందే. అయితే ఈ జీవోను సవాల్ చేస్తూ బీఆర్ఎస్ నేత ఏరోళ్ల శ్రీనివాస్ తెలంగాణ హై కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిల్‌పై ఇవాళ(శుక్రవారం) విచారణ జరిగింది.

కాంగ్రెస్ నేతలు కేశవరావు , పోచారం శ్రీనివాసరెడ్డి , సుదర్శన్ రెడ్డి, ప్రేమ్‌సాగర్, చిన్నారెడ్డిలతోపాటు మరో తొమ్మిది మందికి కేబినెట్ హోదా చట్ట విరుద్ధమని పిటిషన్‌లో ప్రస్తావించారు. రిజిస్ట్రీ అభ్యంతరం చెప్పడంతో చీఫ్ జస్టిస్ బెంచ్ విచారణ చేపట్టింది. ఎమ్మెల్యేల సంఖ్యలో 15 శాతం మాత్రమే కేబినెట్ హోదా ఇవ్వాలని వాదనలు వినిపించారు. ముఖ్యమంత్రి, మంత్రులకు మాత్రమే కేబినెట్ హోదా ఉంటుందని వివరించారు ఏరోళ్ల శ్రీనివాస్. రిజిస్ట్రీ అభ్యంతరాలను తోసి పుచ్చి ఓ నెంబర్ కేటాయించాలని న్యాయస్థానం ఆదేశాలు జారీ చేసింది. గత




బీఆర్ఎస్ ప్రభుత్వంలో కేబినెట్ హోదా కల్పించడాన్ని సవాల్ చేస్తూ 2017లో ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పిల్ దాఖలు చేశారని గుర్తుచేశారు. సీఎం రేవంత్‌రెడ్డి వేసిన పిల్‌తో పాటు బీఆర్ఎస్ పిటిషన్లను కలిపి వచ్చే వారంలో విచారణకు తమ ముందు ఉంచాలని రిజిస్ట్రీకి ఆదేశాలు జారీ చేసింది తెలంగాణ హైకోర్టు.

# ఒకే ఒక్క శాతం మంది దగ్గర 40 శాతం సంపద

దేశ ఆదాయంలో 58%.. ఉన్నత వర్గంలో ఉన్న టాప్ 10% వారికే దక్కుతోంది.భారత్‌లోని 40 శాతం సంపద అంతా ఒకే ఒక్క శాతం మంది సంపన్నుల వద్ద ఉంది.భారత్‌లో ధనవంతులు మరింత ధనవంతులు అవుతున్నారు. స్థూల జాతీయాదాయం పెరుగుతున్నప్పటికీ చాలా దేశాల్లో ఆర్థిక అసమానతలు మాత్రం ఆశించిన స్థాయిలో తగ్గడం లేదని తాజా అధ్యయనమొకటి వెల్లడించింది. 2023 నాటికి ప్రపంచవ్యాప్తంగా దాదాపు సగం జనాభా.. ఆదాయ అసమానతలు పెరిగిన దేశాల్లోనే ఉందని పేర్కొంది. 1990తో పోలిస్తే మాత్రం అంతర్జాతీయ జనాభాలో 94 శాతం మంది స్థూల జాతీయాదాయం పెరిగిందని తెలిపింది. దేశాల్లో, దేశాల మధ్య అసమానతలను తగ్గించడం ఐక్యరాజ్య సమితి సుస్థిరాభివృద్ధి లక్ష్యాల్లో (ఎస్‌డీజీ) పదోది. దాన్ని సాధించడంలో ప్రపంచ పురోగతిని గుర్తించేందుకు ఫిన్లాండ్‌లోని ఆల్టో విశ్వవిద్యాలయం సహా పలు ఇతర సంస్థలకు చెందిన పరిశోధకులు భారత్, బ్రెజిల్, చైనా తదితర దేశాల్లో ఉమ్మడిగా తాజా అధ్యయనాన్ని నిర్వహించారు. సంబంధిత వివరాలు 'నేచర్ సస్టెయినబిలిటీ' అనే జర్నల్‌లో ప్రచురితమయ్యాయి. అందులోని వివరాల ప్రకారం.. – 2023 నాటికి ప్రపంచ జనాభాలో మూడింట ఒక వంతు మంది.. అసమానతలు తగ్గిన దేశాల్లో నివసిస్తున్నారు. – నాలుగింట ఒక వంతు మంది.. 1990తో పోలిస్తే ఆదాయం, అసమానతలు రెండూ గణనీయంగా పెరిగిన ప్రాంతాల్లో ఉన్నారు. ఉత్తర భారత దేశంలో అసమానతలు స్థిరంగా ఉన్నాయి. దక్షిణ భారత రాష్ట్రాల్లో మాత్రం సమ్మిళిత పురోగతి కనిపించింది. ప్రజారోగ్యం, విద్య, మౌలిక వసతుల రంగాల్లో పెట్టుబడులు పెరగడం, ఆర్థికాభివృద్ధి అందుకు దోహదపడ్డాయి. బ్రెజిల్‌లో పేద కుటుంబాలకు నగదు బదిలీ పథకాలు అసమానతలను తగ్గించేందుకు ఉపకరిస్తున్నాయి పేదలు మరింత పేదరికంలో కూరుకుపోతున్నారు" అన్న వాదన ఎన్నో ఏళ్లుగా ఉంది. ప్రస్తుతం జపాన్‌ను సైతం అధిగమించి ప్రపంచంలోనే నాలుగో అతిపెద్ద ఆర్థిక శక్తిగా భారత్ ఎదిగినప్పటికీ మన దేశంలో ఆర్థిక అసమానతలు ఏ మాత్రం తగ్గడం లేదు.ప్రపంచంలో ఏ దేశంలోనూ లేనంత ఆర్థిక అసమానత భారత్‌లో ఉందని వరల్డ్ ఇన్‌ఈక్వాలిటీ రిపోర్ట్ 2026లో పేర్కొన్నారు. ఆ రిపోర్ట్ ప్రకారం.. దేశంలోని 40 శాతం సంపద ఒకే ఒక్క శాతం మంది వద్ద ఉంది.వరల్డ్ ఇన్‌ఈక్వాలిటీ రిపోర్ట్ 2026 అంచనాలను విశ్లేషకులు లుకాస్ చాన్సెల్, రికార్డో గోమెస్ కరెరా, రోవైదా మోష్రిఫ్, థామస్ పికెట్టి ఎడిట్ చేసి, ప్రచురించారు.ఇటీవలి కాలంలో అసమానతలు తగ్గే సూచనలు కనపడకుండాపోయాయని ఆ రిపోర్టు తెలిపింది. భారత్‌లోని అత్యంత సంపన్న 10% వర్గం సుమారు 65% సంపదను పొందుతోందని నివేదిక తెలిపింది.ఆదాయ అసమానలతు కూడా మామూలుగా లేవు. దేశ ఆదాయంలో 58% ఉన్నత వర్గంలో ఉన్న టాప్ 10% వారికే దక్కుతోంది. కిందిస్థాయిలో ఉన్న 50% వర్గం వారికి దేశ ఆదాయంలో కేవలం 15% మాత్రమే దక్కుతోంది.2014 నుంచి 2024 వరకు దేశంలోని సంపన్న టాప్ 10% వర్గం, బాటమ్‌లోని 50% వర్గం మధ్య ఆదాయం వ్యత్యాసం స్థిరంగా ఉందని నివేదిక తెలిపింది. అంటే పదేళ్ల క్రితం దేశంలో అసమానతలు ఎలా ఉండేవో ఇప్పుడూ అలానే ఉన్నాయి.భారతదేశంలో సగటు వార్షిక ఆదాయం పర్చేసింగ్ పవర్ పారిటీ ఆధారంగా సుమారు 6,200 యూరోస్, అంటే దాదాపు రూ.6.49 లక్షలు. సగటు సంపద పర్చేసింగ్ పవర్ పారిటీ ఆధారంగా సుమారు 28000 యూరోస్. మహిళల శ్రమ భాగస్వామ్యం 15.7% మాత్రమే ఉందని, గత దశాబ్దంలో పెరుగుదల లేకపోయిందని నివేదిక తెలిపింది.ఇక మొత్తంగా భారతదేశంలో ఆదాయం, సంపద, లింగ పరమైన అసమానతలు అధికంగా కొనసాగుతున్నాయి. ఆర్థిక వ్యవస్థలో నిర్మాణాత్మక విభేదాలు స్పష్టంగా ఉన్నాయని ఇది సూచించింది.140 కోట్ల జనాభాలో దాదాపు 100 కోట్ల మంది తమ ఖర్చులను గణనీయంగా పరిమితం చేసుకోవాల్సిన పరిస్థితిలో ఉన్నారు. మరోవైపు స్థిరమైన ఆదాయంతో స్వేచ్ఛగా ఖర్చు చేయగలిగే వారు కేవలం 13-14 కోట్ల మంది మాత్రమేనని ఈ అధ్యయనం సూచిస్తోంది. అంటే భారత మార్కెట్‌ను అర్థం చేసుకోవాలంటే కేవలంజనాభా పరంగా కాకుండా, ప్రజల ఆదాయ స్థాయిలను, ఖర్చు విధానాలను విశ్లేషించడం అవసరం. భారత్‌లో ఆర్థిక అసమతుల్యత గణనీయంగా ఉంది. నగరాల్లో ఉన్నత, మధ్య తరగతులకు మంచి ఆదాయ వృద్ధి కనిపిస్తున్నా, గ్రామీణప్రాంతాల్లో ఇంకా తక్కువ ఆదాయ స్థాయిలు కొనసాగుతున్నాయి. ఆదాయ వ్యవస్థ మెరుగుపడకపోతే వినియోగదారుల ఖర్చు సామర్థ్యం పెరగదు. దేశంలో చాలా మంది అనిశ్చిత ఉపాధిపై ఆధారపడటంతో, నిర్దిష్ట ఆదాయ స్థాయిని చేరుకోవడం కష్టమవుతోంది. 100 కోట్ల మంది వినియోగదారులు వ్యక్తిగత ఖర్చులను గణనీయంగా పరిమితం చేసుకోవాల్సిన పరిస్థితిలో ఉన్నారు. వీరి ఆదాయం ప్రధానంగా ఆహారం, వైద్యం, విద్య వంటి అవసరాలకే సరిపోతోంది. విలాస వస్తువులు, గృహోపకరణాలు, వినోదం, టూరిజం వంటి విభాగాల్లో వీరు పెద్దగా ఖర్చు చేయడం లేదు. ఈ వాస్తవం మార్కెట్ వ్యూహాలపై గణనీయమైన ప్రభావం చూపుతోంది. మధ్యతరగతి, ఉన్నత వర్గాలే లక్ష్యం. భారత మార్కెట్‌ను అనేక కంపెనీలు మధ్యతరగతి, ఉన్నత వర్గాలను లక్ష్యంగా పెట్టుకుని అభివృద్ధి చేశాయి. అయితే, వినియోగ సామర్థ్యం పరంగా చూస్తే, తక్కువ ఆదాయం గల వినియోగదారులు పెద్ద సంఖ్యలో ఉన్నందున, మార్కెట్ వ్యూహాలను పునరాలోచించాల్సిన అవసరం ఉంది. ప్రీమియం ఉత్పత్తులతో పాటు, బడ్జెట్ –ఫ్రెండ్లీ ప్రోడక్ట్స్, స్థిరమైన ధరల వ్యూహాలు, ఫైనాన్స్– ఆధారిత వినియోగ మోడల్స్ ద్వారా ఈ వర్గాన్ని ఆకర్షించే మార్గాలను పరిశీలించాలి. భారత మార్కెట్ వృద్ధి కొనసాగాలంటే కేవలం ఉన్నత ఆదాయ వర్గాలను లక్ష్యంగా పెట్టుకోవడం సరిపోదు. తక్కువ ఆదాయ గల వినియోగదారుల అవసరాలను అర్థం చేసుకుని, వారికి అందుబాటులో ఉండే ఉత్పత్తులు, సేవలు రూపొందించాలి. సరసమైన ధరల్లో నాణ్యమైన ఉత్పత్తులు అందుబాటులోకి తేవడం, ఈఎంఐ లేదా ఫైనాన్స్ మోడళ్లను ప్రవేశపెట్టడం, గ్రామీణ మార్కెట్లకు చేరువ కావడం ద్వారా వినియోగదారుల స్థాయిని విస్తరించుకోవచ్చు. డిజిటల్ విస్తరణ ద్వారా కూడా ఈ వర్గానికి మార్కెట్‌ను మరింత చేరువ చేయొచ్చు. ఈ మార్గాల్లో వ్యూహాలు అమలు చేస్తే తక్కువ ఆదాయంగల వినియోగదారుల ఖర్చు సామర్థ్యం పెరిగి, భారత ఆర్థికవృద్ధికి కొత్త దిశలో ఉత్సాహం లభించవచ్చు. ఆర్థిక అసమతుల్యతను అధిగమించాలంటే ఉపాధి కల్పన సరైన పరిష్కారంగా పరిగణించాలి. ప్రజల ఆదాయాన్ని పెంచేలా.. ప్రభుత్వ కార్యక్రమాలు.. ఉద్యోగ కల్పన పెంచడం, కార్మిక వేతనాలు పెంచడంతోపాటు, స్థిరమైన ఉపాధి అవకాశాలను పెంచడం, వ్యవసాయాన్ని ఆదాయ వృద్ధి మార్గంగా తీర్చిదిద్దేందుకు ఆధునికీకరణ, గోదాములు, ప్రత్యక్ష మార్కెటింగ్ విధానాలు అవసరం. వినియోగదారుల మార్కెట్ విస్తరణపై దృష్టి పెట్టడం అత్యవసరం. చిన్న, మధ్య తరహా పరిశ్రమలను ప్రోత్సహించడం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో ఆదాయ వృద్ధిని సాధించవచ్చు.

================================చీచీచీ

# మళ్లీ మొదటికొచ్చిన వివేకా కేసు

కడప, డిసెంబర్ 12(భారతశక్తి ప్రతినిధి):

వైఎస్ వివేకా హత్య కేసు క్లైమాక్స్‌లో ట్విస్ట్ చోటు చేసుకుంది. ఒక అడుగు ముందుకు..రెండు అడుగులు వెనక్కు..ఆల్ మోస్ట్ దర్యాప్తు కంప్లీట్..అయినా ఇంకా ఎక్కడో డౌట్ అన్నట్లుగా కొనసాగుతోన్న వివేకా హత్య కేసు వివాదం ఎంతకు కొలిక్కి రావడం లేదు. వివేకా కూతురు సునీత న్యాయపోరాటం చేస్తూనే ఉన్నారు. లేటెస్ట్‌గా ఆమె లేవనెత్తిన పలు అంశాలపై దర్యాప్తునకు సీబీఐ కోర్టు అనుమతి ఇచ్చింది. అయితే వివేకా హత్య కేసులో నిందితుల ఫోన్ కన్వర్జేషన్ కీలక ఆధారంగా మారింది.ఇప్పటికే వివేకా హత్య కేసు తొలి దర్యాప్తు అధికారి సీఐ శంకరయ్యను ఏపీ సర్కార్ డిస్మిస్ చేసింది. వివేకా హత్య జరిగినప్పుడు పులివెందుల సీఐగా ఉన్న శంకరయ్య.. సాక్ష్యాధారాలు చెరిపివేస్తున్నా చూస్తూ ఊరుకున్నారన్న ఆరోపణలను ఫేస్ చేస్తున్నారు. అయితే ఈ ఎపిసోడ్ ఇలా ఉండగానే లేటెస్ట్‌గా సీబీఐ కోర్టు ఇచ్చిన ఆదేశాలు ఆసక్తికరంగా మారాయి.వివేకా హత్య కేసులో ఇన్ డీటేయిల్డ్ దర్యాప్తు జరగలేదని, పలు అంశాలపై దర్యాప్తు అసంపూర్తిగా ఉందని నిందితులు చెప్తున్న విషయాన్ని పరిగణలోకి తీసుకోవాలని సీబీఐ కోర్టును కోరారు సునీతారెడ్డి. వివేకా హత్య కేసులో మిగతా దర్యాప్తు కంటిన్యూ చేయాలంటూ సునీత వేసిన పిటిషన్‌పై విచారణ జరిపిన సీబీఐ కోర్టు..కీలక ఆదేశాలు ఇచ్చింది.వివేకా హత్య కేసులో కొన్ని అంశాలపై రీఇన్వెస్టిగేషన్‌కు సీబీఐ కోర్టు ఆదేశించింది. సుప్రీంకోర్టు డైరెక్షన్‌లో కేసును మళ్లీ విచారించాలని వివేకా కూతురు సునీత సీబీఐ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారణ జరిపిన కోర్టు..కొన్ని అంశాలపై మాత్రం ఇన్వెస్టిగేషన్‌కు అనుమతులు ఇచ్చింది. ౦2 సునీల్ యాదవ్ బ్రదర్ కిరణ్, వైఎస్ భాస్కర్ రెడ్డి సోదరుడి కుమారుడు అర్జున్ రెడ్డి ఫోన్ సంభాషణపై దర్యాప్తు చేయాలని కోర్టు ఆదేశించింది. నెల రోజుల్లోపు దర్యాప్తు పూర్తి చేయాలని ఆదేశించింది.సీబీఐ కోర్టు ఉత్తర్వులు ప్రకారం వివేకా హత్య కేసులో మళ్లీ పాక్షిక దర్యాప్తు జరగనుంది. ఆ ఇద్దరి ఫోన్ కన్వర్జేషన్‌పై దర్యాప్తునకు సీబీఐ కోర్టు ఉత్తర్వులు ఇచ్చింది. అయితే ఈ కేసులో సునీత వ్యక్తం చేసిన అన్ని సందేశాలపై కోర్టు విచారణకు అనుమతించలేదు. అంతేకాకుండా పాక్షిక దర్యాప్తును నెలరోజుల్లో పూర్తి చేయాలని కూడా కోర్టు చెప్పడం ఉత్కంఠ రేపుతోంది.అయితే సునీత వ్యక్తం చేస్తున్న డౌట్స్‌పై కోర్టు విచారణకు ఆదేశించకపోవడం..నిందితులకు కాస్త రిలీఫేనన్న చర్చ జరుగుతోంది. హత్య జరిగిన రోజు కడప ఎంపీ అవినాశ్ రెడ్డి ఫోన్ నుంచి వైసీపీ పెద్దలకు ముందే సమాచారం ఇచ్చి ఉంటారని అనుమానం వ్యక్తం చేశారు సునీత. ఈ విషయంపై దర్యాప్తు జరపలేదని సునీత కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. రిటైర్డ్ ఐఏఎస్ అజేయ్ కల్లం తన వాంగ్మూలంలో ఉదయం 5 గంటలకు హైదరాబాద్ లోటస్ పాండ్‌లో తాము జగన్‌తో సమావేశంలో ఉండగా, భారతి నుంచి జగన్‌కు పిలుపు వచ్చిందని, ఆ తర్వాత జగన్ తమతో వివేకా మరణంపై చెప్పారని అజేయ్ కల్లాం వాంగ్మూలమిచ్చారని గుర్తు చేశారు సునీత.అయితే భారతికి ఎలా సమాచారం వచ్చింది.? ఎవరి నుంచి వచ్చిందన్న అంశంపై సీబీఐ దర్యాప్తు చేయలేదని,



ఆ అంశాలపై దర్యాప్తు చేయాలని సునీత కోరారు. కేసు విచారణను సీబీఐ సగంలోనే వదిలేసిందని, నిందితులు పొంతన లేని వాంగ్మూలాలు ఇవ్వడంపైనా సీబీఐ దృష్టిపెట్టలేదని సునీత అభ్యంతరం వ్యక్తం చేశారు.అయితే కోర్టు మాత్రం సునీత లేవనెత్తిన అన్ని అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకోకుండా, కేవలం అర్జున్ రెడ్డి, కిరణ్ యాదవ్ మధ్య జరిగిన ఫోన్ సంభాషణలపైనే దర్యాప్తునుకు ఆదేశించింది. హత్య జరిగిన రోజు తెల్లవారుజామున 1.42 గంటల సమయంలో కిరణ్ యాదవ్ నుంచి అర్జున్ రెడ్డికి..వివేకా సర్ చనిపోయాడనే మెసేజ్ వెళ్లిందని సీబీఐ గుర్తించింది. కానీ, ఆ మెసేజ్‌పై దర్యాప్తు చేయలేదని సునీత కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ఇప్పుడు కోర్టు తీర్పుతో ఈ విషయంపైనే దర్యాప్తు కొనసాగనుంది.




విజయవాడ, డిసెంబర్ 12(భారతశక్తి ప్రతినిధి):

ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా తీవ్ర సంచలనం సృష్టించిన అన్నమయ్య జిల్లా ములకలచెరువు నకిలీ మద్యం కేసులో ఎట్టకేలకు కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ భారీ కుంభకోణంలో ప్రధాన నిందితుడిగా ఆరోపణలు ఎదుర్కొంటున్న తెలుగుదేశం పార్టీ బహిష్కృత నేత దాసరపల్లి జయచంద్రారెడ్డిని ఎక్సైజ్ పోలీసులు అరెస్ట్ చేశారు. గత కొంతకాలంగా పరారీలో ఉన్న ఆయన్ను బెంగళూరులో అదుపులోకి తీసుకుని, విచారణ నిమిత్తం రాష్ట్రానికి తరలిస్తున్నారు. ఈ అరెస్టుతో కేసు విచారణ తుది దశకు చేరుకుందని భావిస్తున్నారు.ములకలచెరువు కేంద్రంగా సాగిన ఈ నకిలీ మద్యం దందా కేవలం ఒక చిన్న తరహా నేరం కాదు. ఇది ఒక వ్యవస్థీకృత నేరంగా ఎక్సైజ్ శాఖ గుర్తించింది. ప్రముఖ బ్రాండ్ల పేరుతో నకిలీ మద్యాన్ని తయారు చేసి, ప్రజల ప్రాణాలతో చెలగాటమాడే భారీ నెట్‌వర్క్‌ను పోలీసులు ఛేదించారు. ఈ దందా వెనుక ప్రధాన సూత్రధారిగా ఉన్న అద్దేపల్లి జనార్దన్ రావుకు, జయచంద్రారెడ్డికి మధ్య ఉన్న చీకటి ఒప్పందాలే ఈ సామ్రాజ్యం విస్తరించడానికి కారణమని దర్యాప్తులో తేలింది.పోలీసుల రిమాండ్ రిపోర్ట్, ప్రాథమిక విచారణ ప్రకారం జయచంద్రారెడ్డి పాత్ర ఈ కేసులో చాలా కీలకం. నకిలీ మద్యం తయారీకి అవసరమైన భారీ పెట్టుబడిని, మౌలిక వసతులను సమకూర్చడంలో జయచంద్రారెడ్డి ప్రధాన పాత్ర పోషించినట్లు ఆరోపణలు ఉన్నాయి. తనకున్న రాజకీయ పలుకుబడిని ఉపయోగించి, అధికారుల కళ్లు గప్పి ఈ దందాను నిరాటంకంగా సాగించడంలో అద్దేపల్లి జనార్దన్ రావుకు అండదండలు అందించారని పోలీసులు పేర్కొన్నారు. కేవలం పెట్టుబడికే పరిమితం కాకుండా, మద్యం తయారీ, రవాణా వ్యవహారాలన్నీ జయచంద్రారెడ్డి కనుసన్నల్లోనే సాగినట్లు రిమాండ్ రిపోర్టు స్పష్టం చేస్తోంది.జయచంద్రారెడ్డి అరెస్ట్ రాజకీయంగా కూడా ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ ఆరోపణలు వెలుగులోకి వచ్చిన వెంటనే తెలుగుదేశం పార్టీ ఆయన్ను పార్టీ నుంచి బహిష్కరించింది. తద్వారా అవినీతి, అక్రమాల విషయంలో ఎవరినీ ఉపేక్షించేది లేదని పార్టీ అధిష్టానం స్పష్టమైన సంకేతాలిచ్చింది. వాస్తవానికి ఎన్నికల ముందే జయచంద్రా రెడ్డి వైసీపీ నుంచి టీడీపీలో చేరారు. టీడీపీ తరపున తంబళ్లపల్లె నుంచి పోటీ చేసి ఓడిపోయారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గంజాయి, నకిలీ మద్యంపై ఉక్కుపాదం మోపుతోంది. సొంత పార్టీకి చెందిన వారైనప్పటికీ, తప్పు చేస్తే చట్టం తన పని తాను చేసుకుపోతుందని చెప్పడానికి ఈ అరెస్ట్ ఒక ఉదాహరణగా నిలుస్తుంది. ఈ కేసులో ఇప్పటివరకు 31 మందిని అరెస్ట్ చేయగా, జయచంద్రారెడ్డి అరెస్టుతో ఆ సంఖ్య 32కి చేరింది. ఆయన్ను మదనపల్లె ఎక్సైజ్ కార్యాలయానికి తరలించి లోతుగా విచారించనున్నారు.ములకలచెరువు ఘటన కేవలం ఒక ప్రాంతానికి పరిమితం కాకుండా, రాష్ట్రంలోని ఎక్సైజ్ వ్యవస్థలోని లోసుగులను, రాజకీయ నాయకుల అండతో చెలరేగిపోయే మాఫియా తీరును బయటపెట్టింది. జయచంద్రారెడ్డి అరెస్ట్ ఈ కేసులో న్యాయం జరగడానికి, భవిష్యత్తులో ఇటువంటి ప్రాణాంతక దందాలు పుట్టకుండా అడ్డుకట్ట వేయడానికి ఒక కీలక ముందడుగు. ఇప్పుడు అందరి దృష్టి మదనపల్లెలో జరగబోయే విచారణపైనే ఉంది.

# చంద్రబాబు తర్వాతే లోకేష్, పవన్



విజయవాడ, డిసెంబర్ 12(భారతశక్తి ప్రతినిధి):

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుపాలనలో ప్రతి నిర్ణయం గణాంకాలకు ఆధారపడిందనే విషయం అధికార యంత్రాంగం మాత్రమే కాదు, ప్రజలకూ తెలిసిందే. మాటలు కాకుండా వాస్తవాలు, డేటా ఆధారిత వివరాలు ప్రజల ముందు ఉంచడం ఆయన ప్రభుత్వం చేపట్టిన ప్రత్యేక పద్ధతి. ఇదే విధానంతో ఇటీవల జరిగిన సమీక్ష సమావేశంలో కూడా సీఎం చంద్రబాబు వివిధ శాఖల ఫైల్ క్లియరెన్స్ వివరాలను బహిర్గతం చేశారు. ఎవరు ఎంత వేగంగా ప్రజాసంబంధ ఫైళ్లను పూర్తి చేశారో అంకెలతో వివరించడంతో అధికారులు, మంత్రులు అందరూ మరింత అప్రమత్తమయ్యారు.మంత్రుల పనితీరును పరిశీలిస్తూ విడుదల చేసిన ఈ సమాచారంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆరో స్థానంలో ఉండడం ప్రత్యేకంగా కనిపించింది. ఆయన తరువాత స్థానాల్లో నారా లోకేష్ తొమ్మిదవ స్థానంలో, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పదకొండవ స్థానంలో ఉన్నారు. అయితే ఈ ముగ్గురికంటే ముందుగా ఐదుగురు మంత్రులు ఫైళ్ల పరిశీలనలో వేగం ప్రదర్శించడం గమనించదగిన విషయం. మొదటి స్థానాన్ని డోలా బాల వీరాంజనేయ స్వామి దక్కించుకున్నారు. ప్రజల నుండి వచ్చిన ఫైళ్లను ఆయన సగటుగా రెండు రోజులు 41 నిమిషాల్లో పరిష్కరించడం ఈ ర్యాంక్‌కు ప్రధాన కారణం. మొత్తం 651 ఫైళ్లను క్లియర్ చేసి ముందంజలో నిలిచారు.ఆ తరువాత స్థానాల్లో నిమ్మల రామానాయుడు, ఎన్.ఎస్.డి ఫరూక్, బీసీ జనార్దన్ రెడ్డి, పొంగూరు నారాయణ ఉన్నారు. అదే సమయంలో ఫైల్ క్లియరెన్స్ లో ఆలస్యంగా ఉన్న చివరి ఐదు స్థానాలను కొలుసు పార్థసారథి నాదెండ్ల మనోహర్ , పయ్యావుల కేశవ్ , కొల్లు రవీంద్ర, మడింపల్లి రాంప్రసాద్ రెడ్డి ఆక్రమించారు.సమీక్షలో సీఎం చంద్రబాబు మాట్లాడుతూ సంక్రాంతి నాటికి రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ సేవలను పూర్తిగా ఆన్‌లైన్ ద్వారా అందించేలా వ్యవస్థ సిద్ధం అవుతుందని చెప్పారు. కొంతమంది శాఖలు ఇప్పటికీ భౌతిక విధానంలో సేవలు అందిస్తున్నాయని, వెంటనే డిజిటల్ పద్ధతులకు మారాలని సూచించారు. ప్రజలకు అవసరమైన ఏ సేవకైనా ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా "మనమిత్రా వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా అందుబాటులోకి తెస్తున్నామని సీఎం పేర్కొన్నారు. ఈ సేవల గురించి ప్రజల్లో విస్తృత ప్రచారం చేయాలనీ కూడా ఆదేశించారు.డేటాను ఆధారంగా చేసుకుని పాలన సాగిస్తున్న చంద్రబాబు నాయుడు ప్రభుత్వం, వేగవంతమైన ఫైల్ క్లియరెన్స్‌తో పారదర్శకతకు మరొక మెట్టు వేసినట్లు అధికారులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

# కవితకు గులాబీ టార్గెట్...

మెదక్, డిసెంబర్ 12(భారతశక్తి ప్రతినిధి):

కారు వర్సెస్ కవిత ఫైట్ ఎటు వెళ్తోంది? జాగృతి టార్గెట్ బీఆర్ఎస్సేనా? ఇక బీఆర్ఎస్‌కూ జాగృతే టార్గెట్‌గా మారిందా..?నాన్న దేవుడు. అన్నతో నో ఇష్యూస్.. హరీష్ తోనే అసలు సమస్య అంటూ మొదట్లో ప్రకటన చేసింది. ఆ తర్వాత కొద్దిరోజులు సైలెంట్ గా ఉన్న కవిత ప్పుడు జనం బాటలో తన గేర్ మార్చేస్తుంది. రోజురోజుకూ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను, మాజీ మంత్రులను టార్గెట్ చేస్తూ హీట్ పుటిస్తోంది. జాగృతి జనం బాట కార్యక్రమంలో భాగంగా జిల్లాల పర్యటన చేస్తున్న కవిత..ఎక్కడికి వెళ్లినా పదేళ్ల బీఆర్ఎస్ పాలన మొత్తం అవినీతిమయం, అసలు అభివృద్ధి ఏం జరిగింది అనేలా మాట్లాడుతూ వస్తున్నారు.మొన్నటి వరకు సుతిమెత్తంగా, సున్నితంగా విమర్శిస్తూ వచ్చిన కవిత..ఇప్పుడు ఏకంగా ఒక్కో ఎమ్మెల్యేను, మాజీమంత్రిని పర్సనల్ గా టార్గెట్ చేస్తూ అవినీతి ఆరోపణలు.. కబ్జాలు అంటూ దుమ్మెత్తిపోస్తున్నారు. చివరకు కాంగ్రెస్ సిట్టింగ్ ఎమ్మెల్యే ఉన్న నియోజకవర్గానికి వెళ్లి కూడా బీఆర్ఎస్ లీడర్లను టార్గెట్ చేస్తుండటం చర్చకు దారితీస్తోంది. ఇదంతా గమనించిన గులాబీ లీడర్లు..కవిత బీఆర్ఎస్ నే టార్గెట్ చేస్తుందని తమపై చేస్తున్న వ్యాఖ్యలకు సైలెంట్ గా ఉంటే ఇంకా వీక్ అయిపోతామనే నిర్ణయానికి వచ్చారట. ఎమ్మెల్యేలు, మాజీ మంత్రులు అవినీతి చేశారంటూ..ఇండైరెక్టగా గత బీఆర్ఎస్ పాలన అంతా అవినీతిమయమే అనేలా కవిత



ఆరోపిస్తుండటం గులాబీ లీడర్లకు అస్సలు మింగుడు పడటం లేదట. దీంతో కవిత వ్యాఖ్యలకు అంతే స్థాయిలో రియాక్ట్ అవ్వాలని డిసైడ్ అవ్వడమే కాదు.. డైరెక్ట్ ఎటాక్ కు దిగారు.కవిత తను పర్యటిస్తున్న నియోజకవర్గంలో అధికార కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే ఉన్నా?వారిని పల్లెత్తు మాట అనకుండా తమపైనే విరుచుకుపడటం బీఆర్ఎ? నేతలకు మింగుడు పడటం లేదు. మొన్నటివరకు కవితపై బీఆర్ఎస్ నేతలు ఆచితూచి అడుగులు వేశారు. ఎంతైనా తమ అధినేత కూతురు కాబట్టి సంయమనంతో వ్యవహరిస్తూ వచ్చారు. ఇప్పుడు కవిత డోస్ పెంచి వాయిస్ రేజ్ చేస్తుండటంతో బీఆర్ఎస్ లీడర్లు కూడా తగ్గేదేలే అంటున్నారు. మొన్న మాజీమంత్రి జగదీష్ రెడ్డి, ఆ తర్వాత మరో మాజీమంత్రి నిరంజన్ రెడ్డి కవిత ఆరోపణలపై తీవ్రస్థాయిలో ఫైర్ అవ్వగా.. ఇప్పుడు కూకట్ పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు కవితకు లెఫ్ట్ అండ్ రైట్ ఇచ్చిపడేశారు. కవిత ఏ కేసులో జైలుకు వెళ్లారో మరిచిపోయి ఇలా తమను విమర్శించడం ఏంటని డైరెక్ట్ అటాక్ కు దిగుతున్నారు.కవిత ఆరోపణలు చేయడంతో కూకట్ పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఘాటుగా రియాక్ట్ అయ్యారు. కవిత చరిత్ర ఏంటో తనకు బాగా తెలుసన్న ఆయన.. ఇంకా ఎక్కువ మాట్లాడితే గుట్టు విప్పుతానంటూ సీరియస్ వార్నింగ్ ఇచ్చి పడేశారు. కవిత పెంపుడు కుక్కకు విస్కీ అని పేరు పెట్టుకున్న కవిత.. పదేళ్లలో ఏమేం చేసిందో అంతా తెలుసంటూ ఘాటుగా రియాక్ట్ అయ్యారు. అయితే కవిత బీఆర్ఎస్ నేతలను టార్గెట్ చేసినా..గులాబీ లీడర్లు కవితకు కౌంటర్ గా మాట్లాడినా..నువ్వు అవినీతి చేశావంటే నువ్వు దోచుకున్నావంటూ ఆరోపణలు గుప్పించుకోవడం ఇప్పుడు చర్చకు దారితీస్తోంది. ఈ రెండు వర్గాలు కేసీఆర్ హయాంలో నిర్ణయాలపైనే అలిగేషన్స్ చేసుకుంటుడంతో..ఇండైరెక్ట్ గా గులాబీ బాస్ కు తలనొప్పిగా మారిందన్న టాక్ నడుస్తోంది.

# సంక్రాంతి తర్వాత గ్రామం తరలింపు

శ్రీకాకుళం, డిసెంబర్ 12(భారతశక్తి ప్రతినిధి): శ్రీకాకుళం జిల్లా మూలపేట పోర్టు పనులు వేగవంతం అయ్యాయి. పునరావాస గ్రామాన్ని సంక్రాంతి తర్వాత తరలించేందుకు ప్రణాళికలు సిద్ధమయ్యాయి. ఆర్డీవో పనులను పరిశీలించి ఆలస్యంపై అసహనం వ్యక్తం చేశారు. మరోవైపు మూలపేట పోర్టు నిర్మాణంలో కాంట్రాక్టు సంస్థ ప్రభుత్వానికి రిక్వెస్ట్ చేసింది. ప్రకృతి వైపరీత్యాల కారణంగా గడువు పొడిగింపు



కోరగా.. 2026 నవంబర్ 30 నాటికి పూర్తి చేయాలని ప్రభుత్వం షరతు విధించింది.శ్రీకాకుళం జిల్లాలో మూలపేట పోర్టు నిర్మాణ పనులు వేగవంతం అయ్యాయి. అయితే మూలపేట పోర్టు పునరావాస గ్రామం తరలింపుపై క్లారిటీ వచ్చింది. సంక్రాంతి పండగ తర్వాత నౌపడ పునరావాస కాలనీకి మూలపేట పోర్టు పునరావాస గ్రామాన్ని తరలించేందుకు ప్రణాళికలు సిద్ధమయ్యాయి. నౌపడలోని ఆర్అండ్ఆర్ కాలనీలో జరుగుతున్న పనులను ఆర్డీవో ఎం కృష్ణమూర్తి స్వయంగా పరిశీలించారు. పునరావాస పనుల్లో ఆలస్యం జరుగుతోందని ఆయన అసహనం వ్యక్తం చేశారు. ముఖ్యంగా స్కూల్, పంచాయతీ కార్యాలయం, అంగన్‌వాడీ కేంద్రాల భవనాల నిర్మాణాల విషయంలో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ పనులు ఎప్పుడు మొదలుపెడతారని పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ అధికారులను ప్రశ్నించారు.స్కూల్, పంచాయతీ కార్యాలయం, అంగన్‌వాడీ కేంద్రాల భవనాల పనులు ప్రారంభించడానికి ఎంత టైం కావాలని మండిపడ్డారు. వారం రోజుల్లోపు ఆర్అండ్ఆర్ కాలనీలో ఎట్టి పరిస్థితుల్లో అన్ని పనులు ప్రారంభం కావాలని ఆర్డీవో ఆదేశించారు. నౌపడలో కాలనీలో ఇంటింటికీ కుళాయి పాయింట్లతో పాటుగా జనాలకు అవసరమైన తాగునీటి ట్యాంకులు నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలని ఆర్డీవో ఎం కృష్ణమూర్తి ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ రామకృష్ణకు సూచించారు. మూలపేటలో ఉంటున్న 75 మంది నిరుపేదలను గుర్తించామని.. వారందరికీ ఉచితంగా ఇంటి నిర్మాణ సామగ్రి అందించడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. అంతేకాదు పునరావాస కాలనీలో నాలుగు చెరువులను అభివృద్ధి చేస్తామన్నారు. కాలనీ వాసుల కోసం నౌపడలో శ్మశానవాటిక పనులు కూడా త్వరలోనే చేపడతామన్నారు ఆర్డీవో కృష్ణమూర్తి.మూలపేట పోర్టు నిర్మాణంలో జాప్యంపై కాంట్రాక్టు సంస్థ మరి కొన్ని రోజులు గడువు కోరింది. తాము పోర్టు నిర్మాణాన్ని అనుకున్న సమయానికి పూర్తి చేయలేకపోవడానికి ప్రకృతి వైపరీత్యాలను కారణంగా చూపింది. తుఫాన్లు, ఎడతెరిపిలేని వర్షాలు తమ పనులకు ఆటంకం కలిగించాయని సంస్థ పేర్కొంది. అందుకే మూలపేట పోర్టు నిర్మాణాన్ని పూర్తి చేయడానికి తమకు అదనంగా 409 రోజుల సమయం కావాలని రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. రాష్ట్ర ప్రభుత్వం ఈ విజ్ఞప్తిని పరిశీలించి, కాంట్రాక్టు సంస్థకు గడువు పొడిగించడానికి అంగీకరించింది. అయితే, పోర్టు నిర్మాణాన్ని తప్పనిసరిగా 2026 నవంబరు 30 నాటికి పూర్తి చేయాలని షరతు విధించింది. నిర్మాణంలో జరిగిన జాప్యం వల్ల పెరిగిన అదనపు ఖర్చులను తాము భరించబోమని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ నిర్ణయానికి సంబంధించిన మౌలిక సదుపాయాల కల్పన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎంటీ కృష్ణబాబు ఉత్తర్వులు జారీ చేశారు. అంతేకాదు ఈ పోర్టు నిర్మాణ పనుల్ని మరింత వేగవంతం చేశారు.. వీలైనంత త్వరగా పూర్తిచేసి అందుబాటులోకి తీసుకురావాలని భావిస్తున్నారు. ఇటీవల మంత్రి అచ్చెన్నాయుడు పోర్టు పనుల్ని పరిశీలించారు.

**త్వరలో ట్రయల్ రన్**

శ్రీకాకుళం జిల్లాలో కీలకమైన మూలపేట పోర్టు పనులు వేగవంతం అయ్యాయి. పోర్టు నిర్మాణంలో కీలకమైన వాటర్ బ్రేక్ తొలి దశ పూర్తయింది. 2,300 మీటర్ల సౌత్ వాటర్ బ్రేక్ వాల్, 580 మీటర్ల నార్త్ వాటర్ బ్రేక్ వాల్ నిర్మాణం పూర్తయింది. ప్రస్తుతం కొండ రాళ్లు, ఇండో పార్ట్స్ అమరిక పనులు జరుగుతున్నాయి. షిప్‌లు నిలిపే బెర్తుల నిర్మాణం కూడా వేగంగా సాగుతోంది. పోర్టు నిర్మాణంలో భాగంగా, బెర్త్‌ల వద్ద కాలువలు తవ్వడానికి రోజుకు 30 వేల క్యూబిక్ మీటర్ల మట్టిని మూడు డ్రెడ్జింగ్ యంత్రాలతో తొలగిస్తున్నారు. త్వరలోనే అత్యాధునిక డ్రెడ్జర్లను విదేశాల నుంచి తీసుకురానున్నారు. ఈ డ్రెడ్జర్లు మరింత వేగంగా, సమర్థవంతంగా మట్టిని తొలగించడంలో సహాయపడతాయి.షిప్‌లు నిలిపే బెర్తుల నిర్మాణ పనులు ఊపందుకున్నాయి.. ప్రస్తుతం ఫైలింగ్ దశ నుంచి బీమ్స్ దశకు వచ్చింది. పిల్లర్లను నాలుగు బెర్తుల్లో 64 మీటర్ల లోతు నుంచి ఏర్పాటు చేశారు. తూర్పు వైపున మూడు జనరల్ బెర్తులు, పశ్చిమాన ఒక కోల్ బెర్త్ నిర్మించనున్నారు. ఇప్పటికే రెండు జనరల్ బెర్తుల పనులు దాదాపు పూర్తయ్యాయి. అంతేకాదు కోల్ బెర్త్ ఫైలింగ్ పనులు ఇటీవల ప్రారంభమయ్యాయి. ఈ పోర్టు నిర్మాణం పూర్తయితే, శ్రీకాకుళం జిల్లాకు ఆర్థికంగా ఎంతో మేలు జరుగుతుంది. కూటమి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధతో మూలపేట పోర్టు నిర్మాణం వేగంగా జరుగుతోంది. ఇటీవల మంత్రి అచ్చెన్నాయుడు, కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ పోర్టు పనులపై అధికారులతో సమీక్ష నిర్వహించిన సంగతి తెలిసిందే. పోర్టు నిర్మాణంలో 60 శాతం పనులు పూర్తయ్యాయని అధికారులు తెలిపారు. అనుకున్న సమయానికి పోర్టును అందుబాటులోకి తీసుకొస్తామని చెబుతున్నారు. పోర్టుకు వెళ్లే రోడ్డు నిర్మాణంపై కూడా ఫోకస్ పెట్టారు.. ఈ మేరకు అక్కడ గ్రావెల్ పనులు పూర్తయ్యాయి. నౌపడలో ఒక ఫ్లైఓవర్, క్రీక్ దగ్గరకు దారిని ఏర్పాటు చేయాల్సి ఉంది. మూలపేట పోర్టు నుంచి రైల్వే ట్రాక్ లైన్ కోసం మట్టి చదును చేసే పనులు స్పీడ్ అందుకున్నాయి. కుర్మనాథపురం, యామలపేట, పోతునాయుడుపేట, కోటపాడు గ్రామాల్లో ఈ పనులు జరుగుతున్నాయి. నౌపడలో విద్యుత్ సౌకర్యం కోసం స్తంభాలను ఏర్పాటు చేస్తున్నారు. పోర్టుకు సంబంధించిన పరిపాలన భవనాలు, నాలుగు పెద్ద గోదాముల నిర్మాణం ప్రారంభమైంది. త్వరలో ట్రయల్ రన్ నిర్వహించాలని భావిస్తున్నారు.

# ట్రాఫిక్ సమస్యలకు చెక్

తిరుపతి, డిసెంబర్ 12(భారతశక్తి ప్రతినిధి): తిరుపతి అభివృద్ధికి తగ్గట్టుగానే ట్రాఫిక్ కూడా భారీగా పెరుగుతోంది. స్థానికంగా విస్తరిస్తున్న నగరం, వివిధ ప్రాంతాల నుంచి స్వామి దర్శనానికి వస్తున్న భక్తుల వాహనాలతో ట్రాఫిక్ సమస్య ఇబ్బంది పెడుతోంది. అందుకే ట్రాఫిక్ సమస్యలకు చెక్ పెట్టేందుకు ఔటర్ రింగ్‌రోడ్ నిర్మాణానికి సిద్ధమవుతోంది తుడా. దీనికి సంబంధించిన ప్రక్రియను కూడా ప్రారంభించింది. తిరుపతి అర్బన్ డెవలప్‌మెంట్ ఛైర్మన్ దివాకర్ రెడ్డి అధికారులతో కలిసి తిరుపతిలో పర్యటించారు. ఔటర్ రింగ్ రోడ్డు ప్రతిపాదించిన ప్రాంతాల్లో తిరిగి సాధ్యాసాధ్యాలను పరిశీలించారు. తిరుపతి గ్రామీణ, చంద్రగిరి,రామచంద్రాపురం, రేణిగుంట, వడమాలపేట మండలాల్లో ప్రాంతాలను ఆయన చెక్ చేశారు. దాదాపు 90 కిలోమీటర్ల మేర ఈ ఔటర్ రింగ్ రోడ్డును ప్రారంభించాలని ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఈ ప్రాంతాల్లో సర్వే కూడా ప్రారంభించారు. 2014లో చంద్రబాబు అధికారంలో ఉన్నప్పుడే వైకుంఠ మాల పేరుతో ఈ ఔటర్ రింగ్‌రోడ్డును ప్రతిపాదించారు. అప్పట్లో ఇది ప్రతిపాదన దశలోనే ఆగిపోయింది. తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ దీనిని పక్కన పెట్టేసింది. ఇప్పుడు అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం



తిరుపతిపై స్పెషల్ ఫోకస్ పెట్టింది. నగరం రూపు రేఖలు మార్చేయాలని చూస్తోంది. అందుకే రోడ్ల అభివృద్ధితోపాటు ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు తీసుకుంది. ఆధ్యాత్మిక కేంద్రంగా ఉన్న తిరుపతికి భక్తులతోపాటు పర్యాటకులు భారీగా తరలి వస్తుంటారు. వచ్చిన వాళ్లకు ఇబ్బంది లేకుండా ఉండేలా ట్రాఫిక్‌లో సమయం వృథా కాకుండా ఔటర్ రింగ్ రోడ్డు ప్రతిపాదన మళ్లీ తెరపైకి తెచ్చింది. ఇది పూర్తి అయితే తిరుపతికి కొత్త కళ వస్తుందని అంటున్నారు. వీలైనంత త్వరగా సర్వే పూర్తి చేసి ప్రతిపాదనలు సిద్ధం చేస్తారు. టెండర్లు పిలవనున్నారు.

## ఈరోజు అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం

( పెండ్యాల రామ్ కుమార్, మంథని )

ప్రతి మనిషి మనిషిగా జీవించడానికి కొన్ని హక్కులు ఉండాలి. ఇందులో జాతి, భాష, కుల, మతాలకతీతంగా మనిషిగా జీవించే హక్కు కలిగి ఉండడమే ప్రధాన ఉద్దేశం.అలాంటి మానవ హక్కుల దినాన్ని 10 డిసెంబర్ 1948న ఐక్యరాజ్య సమితి ప్రకటించింది. అప్పటినుండి ప్రతిసంవత్సరం ప్రపంచ వ్యాప్తంగా డిసెంబరు 10వ తేదీ ని అంతర్జాతీయ మానవహక్కుల దినోత్సవంగా జరుపుకుంటున్నారు. వివక్షత లేనటువంటి మానవ సమాజ నిర్మాణమే ఈ అంతర్జాతీయ మానవహక్కుల దినోత్సవ లక్ష్యం.అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం డిసెంబరు 10న ప్రపంచవ్యాప్తంగా ప్రతి ఏట నిర్వహిస్తారు. ఐదేళ్ళకోసారి అమెరికా సంయుక్త రాష్ట్రాలు మానవ హక్కులకు సంబంధించినవారికి ఇచ్చే పురస్కారం, అలాగే అత్యున్నత నోబెల్ బహుమతి అందుకున్నవారిని ఈరోజున సత్కరిస్తారు. 1948, డిసెంబరు 10న ఐక్యరాజ్య సమితి విశ్వమానవ హక్కుల ప్రకటన చేసింది. అందువల్ల డిసెంబర్ 10వ తేదీని అంతర్జాతీయ మానవహక్కుల దినంగా ప్రపంచవ్యాప్తంగా జరుపుకొంటారు. మానవ హక్కుల ఉల్లంఘనకు సంబంధించిన వివాదాలను వెంటనే పరిష్కరించడంకోసం కోర్టులతోపాటు మానవ హక్కుల కమిషన్‌లు ఏర్పాటుచేయబడ్డాయి.

# మీకు స్మార్ట్ రేషన్ కార్డు

ఏలూరు, డిసెంబర్ 12(భారతశక్తి ప్రతినిధి): ఏపీలో స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేస్తున్న విషయం తెలిసిందే. ప్రజలకు సులభంగా, పారదర్శకంగా రేషన్ అందించేందుకు స్మార్ట్ రేషన్ కార్డులను ప్రభుత్వం తీసుకొచ్చింది. ఈ కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున చేపట్టింది. స్మార్ట్ రేషన్ కార్డుల ద్వారా అక్రమార్కులకు చెక్ పెట్టాలని భావిస్తోంది. ఆగస్టు నుంచి వీటిని పంపిణీ చేస్తోంది ఏపీ. ఇప్పటికే చాలా వరకు పంపిణీ చేసింది.గ్రామ, వార్డు సచివాలయాల్లో అధికారులకు అప్పగించే బాధ్యతను ఇచ్చింది. అంతేకాదు వృద్ధులు, దివ్యాంగులకు ఇంటి వద్దకే వెళ్లి ఇవ్వాలని ప్రభుత్వం చెప్పింది. ఈ నెల 15వ తేదీ వరకు పంపిణీ పూర్తి చేయాలని ప్రభుత్వం టార్గెట్ పెట్టుకుంది. అయితే చాలా మంది లబ్దిదారులు ఇంకా వాటిని తీసుకోలేదు. వేలాది కార్డులు పంపిణీ చేయలేదు. 15వ తేదీ తర్వాత వాటిని కమిషనరేట్‌కు పంపనున్నారు.గడువు దగ్గరకు వచ్చినా.. సరే అర్హులైన కొందరు స్మార్ట్ రేషన్ కార్డులను తీసుకోలేదు. ఇంకా చాలా కార్డులు పంపిణీ కోసం ఎదురుచూస్తున్నాయి. కొందరికి కార్డులు తీసుకోవాలని సమాచారం ఇస్తున్నా స్పందించడం లేదని అధికారులు చెబుతున్నారు. సచివాలయ సిబ్బంది, డీలర్లు వారికి ఇచ్చేందుకు ప్రయత్నాలు చేసిన కొన్ని ప్రాంతాల్లో కుదరడం లేదు.అయితే ప్రస్తుతం అందుబాటులో లేకుండా ఉన్నవారు స్మార్ట్ రేషన్ కార్డు తీసుకోకపోవడంపై ఆందోళనలో ఉన్నారు. స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ గడువు ఈ నెల 15వ తేదీతో ముగుస్తుంది. ఒకవేళ కార్డులు తీసుకోకుంటే రద్దు చేస్తారని చాలా మంది అపోహలో ఉన్నారు. కానీ ప్రభుత్వం ఆ విధంగా చేయదు.సచివాలయాల్లో చిరునామాతోపాటుగా స్మార్ట్ రేషన్ కార్డు కోసం దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ఇందుకోసం రూ.200 రుసుము చెల్లించాలి. తర్వాత కమిషనరేట్ నుంచి చిరునామాకు రేషన్ కార్డు పంపిస్తారు. ఈ పోస్ యంత్రంలో స్మార్ట్ రేషన్ కార్డులను స్వైప్ చేయగానే.. లబ్దిదారుల వివరాలు కనెక్ట్ అవుతాయి. బయోమెట్రిక్, ఫింగర్ ప్రింట్, ఐరిస్ స్కాన్ ద్వారా కూడా స్కాన్ చేసి సరుకులు అందిస్తారు.

# నాలుగు ఎమ్మెల్సీలకు భారీగా డిమాండ్

విజయవాడ, డిసెంబర్ 12(భారతశక్తి ప్రతినిధి): ఏపీలో టిడిపి కూటమి పాలన నడుస్తోంది. కేంద్రంలో తెలుగుదేశం పార్టీ కీలక భాగస్వామిగా ఉంది. రాజకీయ పరస్పర ప్రయోజనాలు పొందుతున్నాయి టిడిపి, బిజెపి. మరోవైపు జనసేనకు సైతం ఆ రెండు పార్టీలు ఎనలేని ప్రాధాన్యమిస్తున్నాయి. ఈ తరుణంలో మూడు పార్టీలకు నామినేటెడ్ పదవులతో పాటు ఎమ్మెల్సీ పదవులు దక్కాయి. కానీ జనసేనకు రాజ్యసభ స్థానం ఇంతవరకు లభించలేదు. వచ్చే ఏడాది రాజ్యసభలో జనసేన ఖాతా తెరిచే అవకాశం ఉంది. వచ్చే ఏడాది ద్వితీయార్థంలో ఓ నలుగురు రాజ్యసభ సభ్యులు పదవీ విరమణ చేయనున్నారు. ముగ్గురు వైసీపీ రాజ్యసభ సభ్యులు కాగా.. ఒకరు టిడిపి ఎంపీ ఉన్నారు. ఈ నాలుగు ఎంపీ పదవులు ఖాళీ అవడంతో కూటమి పార్టీలు సర్దుబాటు చేసుకునే అవకాశం ఉంది.వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నుంచి గెలిచిన పిల్లి సుభాష్ చంద్రబోస్, ఆళ్ల అయోధ్య రామిరెడ్డి, పరిమళ్ నత్వాని పదవీ విరమణ చేయనున్నారు. టిడిపి నుంచి సానా సతీష్ పదవి పూర్తి కానుంది. అయితే సతీష్ మొన్ననే రాజ్యసభ సభ్యుడిగా ప్రమోట్ అయ్యారు. అది మోపిదేవి వెంకటరమణ రాజీనామాతో ఖాళీ అయిన స్థానం. దాదాపు ఏడాది కాలం మాత్రమే ఆ పదవికి గడువు ఉండగా సనా సతీష్ ని ఎంపిక చేశారు. ఇప్పుడు ఆయన కూడా పదవి విరమణ చేస్తారు. మొత్తం నాలుగు రాజ్యసభ పదవులు ఖాళీ కావడంతో కూటమి పార్టీల నుంచి విపరీతమైన పోటీ ఉంటుంది.మొత్తం నాలుగు పదవుల్లో రెండు టిడిపికి, ఒకటి బిజెపికి, మరొకటి జనసేనకు దక్కే అవకాశం ఉంది. టిడిపికి సంబంధించి కీలక నేత. ఆయనకు పదవి ఇచ్చి ఏడాది అవుతున్న క్రమంలో మరోసారి రెన్యువల్ ఖాయం. అయితే మిగిలిన ఒక రాజ్యసభ పదవికి విపరీతమైన పోటీ ఉంది. ప్రధానంగా గల్లా జయదేవ్ పేరు వినిపిస్తోంది. 2014, 2019 ఎన్నికల్లో గెలిచారు గల్లా జయదేవ్. 2024 సార్వత్రిక ఎన్నికలకు ముందు క్రియాశీలక రాజకీయాలకు దూరమయ్యారు. మొన్న ఎన్నికల్లో ఆయన పోటీ చేసి ఎంపీగా గెలిచి ఉంటే కేంద్రమంత్రి కావడం ఖాయం. ఆయన స్థానంలో పోటీ చేసిన పెమ్మసాని చంద్రశేఖర్ గెలిచి కేంద్ర మంత్రి అయ్యారు. క్రియాశీలక రాజకీయాలకు దూరమైన గల్లా జయదేవ్ టిడిపి తో అనుబంధాన్ని కొనసాగిస్తున్నారు. రాజ్యసభకు ఎంపిక కావడం ద్వారా మరోసారి పార్లమెంట్లో అడుగు పెట్టాలని భావిస్తున్నారు.మరోవైపు పార్టీ సీనియర్ నేత యనమల రామకృష్ణుడు తన సీనియారిటీని దృష్టిలో పెట్టుకొని రాజ్యసభ పదవి కోరుతున్నారు. కొద్ది రోజుల కిందట ఆయన ఎమ్మెల్సీగా పదవి విరమణ చేశారు. ఆయన పేరు గవర్నర్ పోస్ట్ కు వినిపించింది. కానీ ఆ పదవి అశోక్ గజపతి రాజుకు వరించింది. చంద్రబాబుకు సమకాలీకుడు యనమల రామకృష్ణుడు. 1995 టీడీపీ సంక్షోభ సమయంలో స్పీకర్ గా ఉండేవారు. అప్పటినుంచి చంద్రబాబుకు నమ్మకమైన నేతగా ఉంటూ వచ్చారు. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన ప్రతిసారి యనమల రామకృష్ణుడుకు మంత్రి పదవి దక్కేది. 2014లో ఎమ్మెల్సీగా ఉన్న అయ్యన్నపాత్రుడుకు మంత్రిగా అవకాశం ఇచ్చారు చంద్రబాబు. కానీ ఈసారి యనమల రామకృష్ణుడు కుమార్తె దివ్య ఎమ్మెల్యేగా పోటీ చేసి గెలిచారు.

## పోలీసుల అదుపులో ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ మాధురి బర్త్ డే పార్టీలో మద్యం బాటిళ్లు స్వాధీనం

రంగారెడ్డి డిసెంబర్ 12(భారతశక్తి ప్రతినిధి): ఏపీ ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ భార్య మాధురి పుట్టినరోజు సందర్భంగా గురువారం రాత్రి ఫామ్ హౌస్ లో వైసిపి నాయకులతో పార్టీ నిర్వహించారు. అనుమతి లేకుండా మద్యం సేవించి బర్త్ డే పార్టీ నిర్వహించుకున్నారు. ఈ బర్త్ డే పార్టీలో మద్యం బాటిళు హుక్కా వంటి ఇతరత్రా ఇతర ధర సంబంధించిన మత్తు పదార్థాలు కూడా ఉన్నాయని సమాచారం.

దక్షిణ మధ్య రైల్వే
Follow us on @SCRailwayindia
ద.మ రైల్వేలోని టెండరు ప్రకటన వివరాలను మా వెబ్‌సైట్
website : www.scr.indianrailways.gov.in

**Open e-Tender Notice Nos.C/E.29/Elec/M/SC/33/PA/OT/2025-26, Dt.:11.12.2025** PUB/1591

భారత రాష్ట్రపతి గారి తరపున, ఆయన తరపున క్రింద ఇవ్వబడిన పని కోసం 02.01.2026న మధ్యాహ్నం 3 గం॥ల వరకు ఇ-టెండర్‌ను ఆహ్వానిస్తున్నారు

ఇ-టెండర్ నెం.: C/E.29/Elec/M/SC/33/PA/OT/2025-26 ఇ-టెండర్ నెం.: E-M-SC-33-OT-2025-26 పనిపేరు : సికింద్రాబాద్ డివిజన్ ఎలక్ట్రికల్ మెయింటెనెన్స్ డిపార్ట్‌మెంట్: 1) సీనియర్ DEN/నార్త్/SC అధికార పరిధిలోని స్టేషన్లలో దివ్యాంగజన సౌకర్యాల ఏర్పాటు. 2) సీనియర్ DEN/నార్త్-వెస్ట్/SC అధికార పరిధిలోని స్టేషన్లలో దివ్యాంగజన సౌకర్యాల ఏర్పాటు. 3) సీనియర్ DEN/సౌత్/SC పరిధిలోని స్టేషన్లలో దివ్యాంగజన సౌకర్యాల ఏర్పాటు మరియు 4) సీనియర్ DEN/పశ్చిమ/SC పరిధిలోని స్టేషన్లలో దివ్యాంగజన సౌకర్యాల ఏర్పాటు 5) సీనియర్ DEN/నార్త్/SC పరిధిలోని స్వల్పకాలిక లక్ష్యాలను చేరుకోవడానికి మిగిలిపోయిన దివ్యాంగజన సౌకర్యాల ఏర్పాటు (స్పర్శ మార్గదర్శకత్వంతో యాక్సెస్ చేయగల మార్గం, ప్లాట్‌ఫామ్ జోనింగ్ కోసం టాక్టైల్ ఫ్లోరింగ్, స్ట్రక్చరల్ ఎలిమెంట్స్ & ప్లాట్‌ఫామ్ ఎడ్జ్ స్ట్రిప్స్ కోసం కాంట్రాస్టింగ్ కలర్ షీమ్) 6) సీనియర్ DEN/నార్త్-వెస్ట్/SC విభాగంలోని స్టేషన్లలో స్వల్పకాలిక లక్ష్యాలను చేరుకోవడానికి దివ్యాంగజన సౌకర్యాల ఏర్పాటు 7) సీనియర్ DEN/సౌత్/SC విభాగంలోని స్టేషన్లలో స్వల్పకాలిక లక్ష్యాలను చేరుకోవడానికి దివ్యాంగజన సౌకర్యాల ఏర్పాటు 8) సీనియర్ DEN/వెస్ట్/SC విభాగంలోని స్వల్పకాలిక లక్ష్యాలను చేరుకోవడానికి దివ్యాంగజన సౌకర్యాల ఏర్పాటు (నీటి కుళాయిలు, దివ్యాంగజన మరుగుదొడ్లు, స్పర్శ మార్గదర్శకత్వంతో యాక్సెస్ చేయగల మార్గం, ప్లాట్‌ఫామ్ జోనింగ్, స్ట్రక్చరల్ ఎలిమెంట్స్ & ప్లాట్‌ఫామ్ ఎడ్జ్ స్ట్రిప్స్ కోసం కాంట్రాస్టింగ్ కలర్ స్కీమ్) 9) సీనియర్ DEN/కో-ఆర్డ్/SC విభాగంలో స్వల్పకాలిక లక్ష్యాలను చేరుకోవడానికి దివ్యాంగజన సౌకర్యాల ఏర్పాటు 10) SNF-SC-KZJలో స్వల్పకాలిక లక్ష్యాలను చేరుకోవడానికి దివ్యాంగజన సౌకర్యాల ఏర్పాటు 11) KZJ-BZA విభాగం : ADEN/S/KZJ సబ్ డివిజన్ 12) కింద స్టేషన్లలో SS గట్టర్, కొత్త షీటింగ్‌తో COPల అప్‌గ్రేడ్ & అదనపు PF షెల్టర్‌ల ఏర్పాటు, విభాగం : ADEN/MDR సబ్ డివిజన్ కింద స్టేషన్లలో అదనపు COPల నిర్మాణం ప్రతిపాదిత విద్యుత్ ఏర్పాట్లు. టెండర్ విలువ : రూ.2,86,28,720.00/- డిపాజిట్ (E.M.D.) : రూ.2,93200.00/- పూర్తిచేయు కాలం: 6 నెలలు

టెండర్ షరతులు/ఇతర వివరాలు IREPS వెబ్‌సైట్ www.ireps.gov.in లోని టెండర్ పత్రాలలో అందుబాటులో ఉన్నాయి. వీటిని డౌన్‌లోడ్ చేసుకోవచ్చు, పాల్గొనవచ్చు మరియు ఏవైనా మార్పులు ఉండే చూడవచ్చు.

సీనియర్ డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజనీర్, (నిర్వహణ), సికింద్రాబాద్

**E-Tender Notice No.44-2025 Dt.:11.12.2025** PUB/1592

భారత రాష్ట్రపతి తరపున సీనియర్ డివిజనల్ ఇంజనీర్ /కో-ఆర్డినేషన్/గుంతకల్ వారు ఇ-టెండర్లను ఆహ్వానిస్తున్నారు. ముగింపు తేదీ : 08-01-2026, 15.00.

క్రమ సంఖ్య: 01 టెండర్ నెం.: Engg-GTL-Central-1992, పని వివరణ : గూటీ-సరుకు రవాణా డిపో/ GYయొక్క ATC వద్ద యార్డ్ పరీక్షా సౌకర్యాలు మరియు మోడల్స్ కోసం ఓపెన్ షెడ్‌కు మెరుగుదలలు. అంచనా వ్యయం : రూ.2,50,74,102.54/- EMD : రూ.2,75,400.00/-

క్రమ సంఖ్య: 02 టెండర్ నెం.: Engg-GTL-North-1993, పని వివరణ : గుంతకల్లు డివిజన్: గుంతకల్లు-గూటీ సెక్షన్‌లోని తిమ్మనచర్ల (TIM) వద్ద షంటింగ్‌నెక్ ఏర్పాటు 1) రిటైనింగ్‌వాల్ నిర్మాణం 2) ఎర్త్‌వర్క్ మరియు 3) ట్రాక్ లింకింగ్ అంచనా వ్యయం : రూ. 4,49,36,214.08, EMD : రూ.3,74,700.00

క్రమ సంఖ్య: 03 టెండర్ నెం.: Engg-GTL-బ్రిడ్జి-1994, పని వివరణ : GTL గుంతకల్లు డివిజన్: 1) DMM-GY విభాగంలో KLU-PMD స్టేషన్ల మధ్య Br.No.45DN(26x16.30)@ కి.మీ., పై తుప్పు పట్టిన టాప్ ఫ్లాంజ్ ప్లేట్లు, టాప్ లాటరల్ బ్రేసింగ్‌లు మరియు టాప్ లాటరల్ గస్సెట్ ప్లేట్‌లను మార్చడం 2)Br.No.45DN పై X-లెవల్ మరియు నిలువుగా కుంగిపోయేలా ప్రస్తుత బెడ్‌ప్లేట్‌ల క్రింద వివిధ పరిమాణాల బెడ్ ప్లేట్‌లను అందించడం. 3)Br.No.45DN పై స్టీల్ గిర్డర్‌లు మరియు దాని భాగాల మెటలైజేషన్. 4)Br.No.45DNకి సమాంతరంగా నడుస్తున్న సిగ్నల్, టెలికాం మరియు OFC కేబుల్ పైపులకు మద్దతు ఇచ్చే ఏర్పాటు. అంచనా వ్యయం : రూ. 2,56,67,106.10, EMD : రూ.2,78,300.00

క్రమ సంఖ్య: 04 టెండర్ నెం.: Engg-GTL-బ్రిడ్జి-1995, పని వివరణ : BAY-GTL, GY-KLU, DMM-PAK విభాగం SSE/BR/సెంట్రల్ అధికార పరిధిలోని వివిధ ప్రధాన వంతెనలు మరియు ROB లకు క్రెడిట్ ఏర్పాట్ల ఏర్పాటు. అంచనా వ్యయం : రూ. 4,08,85,719.23, EMD : రూ.3,54,400.00

ఏదైనా కొరిజండా ఆన్‌లైన్‌లో మాత్రమే జారీ చేయబడుతుంది.

డివిజనల్ రైల్వే మేనేజర్, వర్క్స్, గుంతకల్లు

**Tender No. :GTL-EM-63-2025-26 Dt.:12.12.2025** PUB/1593

భారత రాష్ట్రపతి తరపున సీనియర్ డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజనీర్ /మెయింటెనెన్స్/గుంతకల్ వారు క్రింది పనులకొరకు ఇ-టెండర్లను ఆహ్వానిస్తున్నారు.

టెండర్ నెం.: Engg-GTL-EM-63-2025-26, పని పేరు : గుంతకల్ డివిజన్ : 1) ఎయిర్ కండిషనింగ్‌తో పాటు అన్ని నిర్దిష్ట సౌకర్యాలను అందించడం ద్వారా ధోన్‌లోని క్రూ బుకింగ్ లాబీ భవనం యొక్క అప్‌గ్రేడ్ కోసం విద్యుత్ ఏర్పాట్ల ఏర్పాటు. 2) సీనియర్ DEN/ సెంట్రల్ జూరిస్‌డిక్షన్‌లోని ADEN/DHNE సబ్ డివిజన్ లోని DHNE, BMH & PDL స్టేషన్లలో కాలనీలకు (క్వార్టర్లు/నీటి పైపులైన్/డ్రైనేజీ/రోడ్లు, పార్కులు మొదలైనవి) మెరుగుదల. అంచనా వ్యయం : రూ. 54,32,232.76.

ముగింపు తేదీ మరియు సమయం : 05.01.2026 మధ్యాహ్నం : 3 గం॥లకు.

టెండర్ బిడ్డింగ్ మరియు ఇతర వివరాల కోసం http://www.ireps.gov.in కు లాగిన్ అవ్వండి. టెండర్ యొక్క దిద్దుబాటు పత్రాలు, ఏదైనా ఉంటే, ఆన్‌లైన్‌లో మాత్రమే జారీ చేయబడతాయి.

సీనియర్ డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజనీర్, మెయింటెనెన్స్/ గుంతకల్

**Tender No. :GTL-EM-64-2025-26 Dt.:12.12.2025** PUB/1594

భారత రాష్ట్రపతి తరపున సీనియర్ డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజనీర్ /మెయింటెనెన్స్/గుంతకల్ వారు క్రింది పనులకొరకు ఇ-టెండర్లను ఆహ్వానిస్తున్నారు.

టెండర్ నెం.: Engg-GTL-EM-64-2025-26, పని పేరు : గుంతకల్ డివిజన్ -గుంతకల్ డివిజన్ మీదుగా తిరుచానూర్ (TCNR) వద్ద కొత్త ట్రిప్ షెడ్ నిర్మాణం. అంచనా వ్యయం : రూ. 78,03,955.86.

ముగింపు తేదీ మరియు సమయం : 05.01.2026 మధ్యాహ్నం : 3 గం॥లకు. టెండర్ బిడ్డింగ్ మరియు ఇతర వివరాల కోసం http://www.ireps.gov.in కు లాగిన్ అవ్వండి. టెండర్ యొక్క దిద్దుబాటు పత్రాలు, ఏదైనా ఉంటే, ఆన్‌లైన్‌లో మాత్రమే జారీ చేయబడతాయి.

సీనియర్ డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజనీర్, మెయింటెనెన్స్ / హైదరాబాద్

A 2021

మరిన్ని టెండర్ నిబంధనలు / వివరాల కోసం మరియు టెండర్ పత్రాలను డౌన్‌లోడ్ చేసుకోవడానికి, https://www.ireps.gov.in లేదా www.scr.indianrailways.gov.in వెబ్‌సైట్‌ను సందర్శించండి

# ఒకే చోట రెండు వైన్ షాపులు స్థానికుల మండిపాటు

సికింద్రాబాద్ డిసెంబర్ 12(భారతశక్తి ప్రతినిధి):

ఒకే చోట రెండు మద్యం దుకాణాలను ఏర్పాటు చేసి తమ రాకపోకలకు తీవ్ర అంతరాయం కల్పిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తూ మహిళలు ధర్నా చేపట్టారు. మద్యం దుకాణాల ముందు నిలబడి ఎక్సైజ్ అధికారులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. బేగంపేట్ లో శ్యామ్ లాల్ బిల్డింగ్ సమీపంలో ఏర్పాటు చేసిన దుకాణాలకు వ్యతిరేకంగా శ్యామ్ లాల్ బిల్డింగ్ వెల్ఫేర్ అసోసియేషన్, విజయ్ గణపతి టెంపుల్ కమిటీ ఆధ్వర్యంలో మహిళలు ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ 7కాలనీలకు వెళ్లేందుకు ఉన్న ప్రధాన రహదారి ఇది అని ఈ రహదారి ప్రారంభంలోనే ఇరు వైపులా రెండు మద్యం దుకాణాలను ఏర్పాటు చేసి స్వాగతం పలుకుతున్నట్లు ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. వీటికి కనీసం పార్కింగ్ స్థలం కూడా లేదని ఐనా అనుమతులు ఇవ్వడం ఏంటని ప్రశ్నించారు. మద్యం దుకాణానికి అనుమతి ఇచ్చిన అధికారిని వెంటనే సస్పెండ్ చేయాలని వారు డిమాండ్ చేశారు. బస్ స్టాప్ కు వెళ్లాలన్నా, బస్ స్టాప్ నుండి ఇళ్లకు వెళ్లాలన్న మహిళలు, పిల్లలు, పెద్దలు అనేక ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం అధికారుల దృష్టికి తీసుకు వెళ్లడం కోసం శాంతి యుతంగా ఈ కార్యక్రమం చేయడం జరిగిందని, అధికారులు వెంటనే స్పందించి చర్యలు తీసుకొని మద్యం దుకాణాలను తొలగించాలని డిమాండ్ చేశారు. లేకుండా మరింత ఉధృతంగా ఉద్యమాన్ని చెప్పాట్టాల్సి వస్తుందని హెచ్చరించారు.

## జంగారెడ్డిగూడెంలో పోలీసుల ఫుట్ పెట్రోలింగ్

జంగారెడ్డిగూడెం డిసెంబర్ 12(భారతశక్తి ప్రతినిధి):

జంగారెడ్డిగూడెం ఏఎస్పీ సుస్మిత, విస్తృత స్థాయిలో ఫుట్ పెట్రోలింగ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఇన్స్పెక్టర్ ఎం.వి. సుభాష్, ఎస్ఐ వీర ప్రసాద్ మరియు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు. అధికారులు పట్టణం లోని ప్రధాన వీధులు, రద్దీ ప్రాంతాలలో కాలి నడకన పర్యటించి భద్రతా పరిస్థితులను సమీక్షించారు. ట్రాఫిక్ అంతరాయాల నివారణ రోడ్లపై అడ్డ దిడ్డంగా వాహనాలు నిలపడం వల్ల పాదచారులకు, ఇతర వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయని ఏఎస్పీ గారు గుర్తించారు. రోడ్ల పక్కన వ్యాపారాలు చేసుకునే వారు సామాన్య ప్రజలకు ఆటంకం కలగకుండా చూసుకోవాలని ఆదేశించారు.

# డీఎస్పీనే హనీ ట్రాప్ దిగితే...

రాయ్ పూర్, డిసెంబర్ 12(భారతశక్తి ప్రతినిధి):



చట్టాన్ని రక్షించాల్సిన చేతులే అక్రమాలకు తెరలేపితే? సమాజంలో గౌరవప్రదమైన హోదాలో ఉన్నవారే 'హనీ ట్రాప్' వంటి వ్యూహాలతో అమాయకులను దోచుకుంటే? ఛత్తీస్‌గఢ్‌లో వెలుగుచూసిన ఒక ఘటన ఇప్పుడు పోలీసు శాఖ ప్రతిష్టనే ప్రశ్నార్థకం చేస్తోంది. దంతెవాడ డీఎస్పీ కల్పనా వర్మ తనను ప్రేమ పేరుతో మోసగించి, కోట్ల రూపాయలు కొల్లగొట్టారంటూ రాయ్‌పూర్‌కు చెందిన ఒక ప్రముఖ హోటల్ యజమాని చేసిన ఆరోపణలు దేశవ్యాప్తంగా చర్చనీయాంశమయ్యాయి. రాయ్‌పూర్‌కు చెందిన హోటల్ వ్యాపారి దీపక్ టాండన్ కు 2021 లో డీఎస్పీ కల్పనా వర్మతో పరిచయం ఏర్పడింది. ఆ పరిచయం క్రమంగా సాన్నిహిత్యంగా, ఆపై ప్రేమగా మారింది. నాలుగేళ్లుగా వీళ్లిద్దరూ రిలేషన్‌షిప్‌లో ఉన్నారు. దీపక్ టాండన్‌కు అప్పటికే వివాహమైందన్న విషయం కల్పనకు తెలిసినప్పటికీ, ఆమె ఈ బంధాన్ని కొనసాగించింది. అయితే, ఈ బంధం వెనుక ప్రేమ కంటే ఆర్థిక అవసరాలే ఎక్కువని దీపక్ ఆరోపిస్తున్నారు. ఈ నాలుగేళ్ల కాలంలో కల్పన కోరికలు తీర్చడానికి తాను దాదాపు రూ. 2 కోట్లకు పైగా ఖర్చు చేసినట్లు ఆయన వాపోయారు. డీఎస్పీ కల్పన డిమాండ్ల చిట్టా వింటే ఎవరైనా ఆశ్చర్యపోవాల్సిందే. డైమండ్ రింగ్, ఖరీదైన బంగారు హారాలు, బ్రాస్‌లెట్, ఇన్నోవా కారు వంటి విలాసవంతమైన బహుమతులను ఆమె దీపక్ నుండి పొందినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇక్కడితో ఆగకుండా, రాయ్‌పూర్‌లోని వీఐపీ రోడ్‌లో దీపక్ టాండన్ పేరు మీద ఉన్న ఒక హోటల్‌ను వ్యూహాత్మకంగా తన సొంతం చేసుకున్నారు. మొదట ఆ హోటల్‌ను తన సోదరుడి పేరు మీదకు, ఆ తర్వాత తన పేరు మీదకు మార్పించుకున్నారు. కేవలం ఈ రిజిస్ట్రేషన్ ఖర్చుల కోసమే దీపక్ రూ. 30 లక్షలు వెచ్చించడం గమనార్హం. వ్యాపారంలో ఒడిదుడుకులు సహజం. ఎప్పుడైతే దీపక్ తన ఆర్థిక పరిస్థితి బాగోలేదని, ఇకపై డబ్బు ఇవ్వలేనని చెప్పారో, అప్పుడే కథ అడ్డం తిరిగింది. అప్పటి వరకు ప్రేమను నటించిన డీఎస్పీ, ఒక్కసారిగా ప్లేట్ ఫిరాయించారు. తన భార్యకు విడాకులు ఇవ్వాలని ఒత్తిడి చేయడంతో పాటు, డబ్బు ఇవ్వకపోతే తప్పుడు కేసులు పెట్టి జైలుకు పంపిస్తానని బ్లాక్ మెయిల్ చేయడం మొదలుపెట్టారని దీపక్ ఆవేదన వ్యక్తం చేశారు. విసిగిపోయిన దీపక్, తన వద్ద ఉన్న వాట్సాప్ చాటింగ్ స్క్రీన్ షాట్లు, వివిధ ప్రాంతాల్లో ఇద్దరూ కలిసి ఉన్న సీసీటీవీ ఫుటేజీలను సాక్ష్యాలుగా సమర్పించి పోలీసు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. సాధారణంగా ఆన్‌లైన్‌లో గుర్తు తెలియని వ్యక్తులు చేసే 'హనీ ట్రాప్' మోసాలను మనం చూస్తుంటాం. కానీ, ఒక బాధ్యతాయుతమైన పదవిలో, అదీ ప్రజలకు రక్షణ కల్పించాల్సిన డీఎస్పీ స్థాయి అధికారిణిపై ఇలాంటి ఆరోపణలు రావడం సమాజం ఎటు పోతోందనే ప్రశ్నకు అద్దం పడుతోంది. ఒక సామాన్యుడు తప్పు చేస్తే చట్టం శిక్షిస్తుంది. కానీ, చట్టాన్ని చేతిలో ఉంచుకున్న అధికారిణి, తన హోదాను అడ్డం పెట్టుకుని ఒక వ్యక్తిని మానసికంగా, ఆర్థికంగా దోచుకోవడం అధికార దుర్వినియోగానికి పరాకాష్ట. పోలీసులంటే భయం, భక్తి ఉండాలి. కానీ ఇలాంటి ఘటనలు పోలీసు వ్యవస్థపై ప్రజలకున్న నమ్మకాన్ని సన్నగిలేలా చేస్తాయి. వివాహితుడని తెలిసి కూడా సంబంధం కొనసాగించడం, ఆపై ఆస్తుల కోసం బెదిరించడం నైతిక పతనాన్ని సూచిస్తోంది. అయితే డీఎస్పీ కల్పనా వర్మ ఈ ఆరోపణలను పూర్తిగా ఖండించారు. ఇదంతా తన ప్రతిష్టను దిగజార్చడానికి జరుగుతున్న కుట్ర అని ఆమె అంటున్నారు. నిజానిజాలు పోలీసు విచారణలో తేలాల్సి ఉంది. డబ్బు, విలాసాల కోసం ఎంతటి స్థాయివారైనా అడ్డదారులు తొక్కుతున్నారడానికి ఈ ఘటన ఒక ఉదాహరణ. విచారణ నిష్పక్షపాతంగా జరిగి, తప్పు ఎవరు చేసినా శిక్ష పడితేనే వ్యవస్థపై ప్రజలకు నమ్మకం మిగులుతుంది. ప్రస్తుతం ఛత్తీస్‌గఢ్ పోలీసు శాఖ ఈ కేసును సీరియస్‌గా తీసుకుని విచారణ జరుపుతోంది.


# బీహార్ లో ఎయిడ్స్ కలకలం

పాట్నా, డిసెంబర్ 12(భారతశక్తి ప్రతినిధి):

సరిగ్గా రెండు దశాబ్దాల క్రితం మనదేశంలో హెచ్ఐవి అధికంగా ఉండేది. సురక్షితం కానీ శృంగారంలో పాల్గొనడం వల్ల చాలామంది హెచ్ఐవి బారిన పడేవారు. ఈ వ్యాధి వల్ల చాలామంది ప్రాణాలు కోల్పోయారు. అప్పట్లో ఐక్యరాజ్యసమితి హెచ్ఐవి మీద యుద్ధం ప్రకటించడంతో హెచ్ఐవి తగ్గుముఖం పట్టింది. ఇప్పటికి కూడా ప్రపంచవ్యాప్తంగా కొన్ని ప్రాంతాలలో హెచ్ఐవి కేసులు నమోదు అవుతూనే ఉన్నాయి. ఇక మనదేశంలో చూసుకుంటే హెచ్ఐవి కేసులు తగ్గుముఖం పడుతూనే ఉన్నప్పటికీ.. ఒక రాష్ట్రంలో మాత్రం రికార్డు స్థాయిలో హెచ్ఐవి కేసులు నమోదయ్యాయి. సోషల్ మీడియాలో ట్రెండ్ అవుతున్న ఓ పోస్ట్ ప్రకారం.. మన దేశంలోని బీహార్ రాష్ట్రంలో ఓ జిల్లాలో 7,400 హెచ్ఐవి కేసులు నమోదయ్యాయి. ఇందులో 400 మంది చిన్నారులు కూడా ఉండడం విశేషం. 7400 హెచ్ఐవి బాధితులలో 3,544 మంది మహిళలు, 2,733 మంది పురుషులు ఉన్నారు. సోషల్ మీడియాలో దీనికి సంబంధించిన పోస్ట్ విపరీతంగా సర్కులేట్ అవుతున్న నేపథ్యంలో రకరకాల చర్చలు మొదలయ్యాయి.. కొందరేమో ఒక మత ఆచారం ప్రకారం బీహార్ రాష్ట్రంలో నుదుటిమీద కత్తితో ఘాటు పెట్టుకుంటారని.. దీనివల్ల హెచ్ఐవి వ్యాప్తి చెంది ఉండవచ్చని అనుమానిస్తున్నారు. మరికొందరేమో ఈ వీడియో ఉత్తర ప్రదేశ్ లో తీసిందని.. దానిని అనవసరంగా బీహార్ రాష్ట్రానికి ఆపాదిస్తున్నారని వివరిస్తున్నారు. వాస్తవానికి హెచ్ఐవి వ్యాప్తి అనేది కొంతకాలంగా మన దేశంలో తగ్గుముఖం పట్టింది. ఈ వ్యాధి పై ప్రభుత్వం విస్తృతస్థాయిలో అవగాహన కల్పిస్తోంది. మరోవైపు శృంగారం లో పాల్గొనేటప్పుడు చాలామంది రక్షణ విధానాలను పాటిస్తున్నారు. అందువల్ల హెచ్ఐవి వ్యాప్తి చాలావరకు తగ్గిపోయింది. అయితే సోషల్ మీడియాలో సర్కులేట్ అవుతున్న పోస్ట్ ప్రకారం బీహార్ రాష్ట్రంలో ఈ వ్యాధి తీవ్రంగా ఉందని తెలుస్తోంది. అయితే దీనిపై ఇంతవరకు బీహార్ ప్రభుత్వం గానీ.. అక్కడి అధికారులు గాని ఎటువంటి అఫీషియల్ నోట్ విడుదల చేయలేదు. బీహార్ రాష్ట్రం పరువు తీయడానికే కొంతమంది ఇలాంటి కుట్రలకు పాల్పడుతున్నారని అక్కడి ప్రజలు ఆరోపిస్తున్నారు. సోషల్ మీడియాలో తమ రాష్ట్రం మీద లేనిపోని దుష్ప్రచారాలు చేస్తున్నారని.. ఇది సరైన విధానం కాదని చెబుతున్నారు. బీహార్ వెనుకబడిన రాష్ట్రం అయినప్పటికీ.. ఇక్కడి ప్రజలమైన తాము అడ్డగోలు పనులు చేయమని చెప్తున్నారు. ప్రభుత్వం మాకు అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తోందని.. చివరి కి శృంగారం జరిపే విషయంలో కూడా తమకు ఒక అవగాహన ఉందని అక్కడి ప్రజలు అంటున్నారు. బీహార్ రాష్ట్రం కొన్ని రంగాలలో వెనుకబడిపోయినప్పటికీ మిగతా వాటిల్లో అంత అడ్డగోలుగా లేదని అక్కడి ప్రజలు అంటున్నారు. అడ్డగోలు రోగాలను తెచ్చుకోవడానికి తాము సిద్ధంగా లేమని.. తాము నాగరికులమని.. అనాగరిక జీవితం గడిపే దౌర్భాగ్యం మాకు లేదని అక్కడి ప్రజలు అంటున్నారు. ఇప్పటికైనా తమమీద ఆరోపణలు చేసేవారు.. మరొకసారి పునరాలోచన చేసుకోవాలని బీహార్ ప్రజలు సూచిస్తున్నారు.

# శ్రవణ్ సాయి కేసులో ఏం జరిగింది

హైదరాబాద్, డిసెంబర్ 12(భారతశక్తి ప్రతినిధి):





ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మంగళవారం నుంచి కాకాని శ్రవణ్ సాయి (19) ఘటన తీవ్రస్థాయిలో సంచలనం కలిగిస్తోంది ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ఎన్టీఆర్ జిల్లా పెనుగంచిప్రోలు గ్రామానికి చెందిన శ్రావణ్ సాయి హైదరాబాదులోని మేడ్చల్ జిల్లా మైసమ్మగూడలో సెయింట్ పీటర్ ఇంజనీరింగ్ కాలేజీలో బిటెక్ చదువుతున్నాడు. శ్రావణ్ సాయి మంగళవారం తన ప్రియురాలు ఇంటికి వెళ్లిన కొద్ది గంటలకే హైదరాబాదు నగరంలో అనుమానాస్పద స్థితిలో మరణించినట్టు తెలుస్తోంది. అతడి ప్రియురాలి కుటుంబ సభ్యులు కొట్టి చంపారని మీడియాలో వార్తలు వస్తున్నాయి. శ్రవణ్ ను నిర్బంధించారని.. అతనిపై దారుణంగా దాడి చేశారని.. అందువల్లే అతడు చనిపోయాడని శ్రావణ్ కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. మరోవైపు ఆ యువతితో ఉన్న అనుబంధం రెండు కుటుంబాలకు తెలుసని.. వారిద్దరి మధ్య ఉన్న అనుబంధాన్ని రెండు కుటుంబాలకు చెందిన సభ్యులు వ్యతిరేకించాలని పోలీసులు అంటున్నారు. శ్రవణ్ కుత్బుల్లాపూర్ లోని ఓ భవనంలో అద్దెకు ఉంటున్నాడు. శ్రవణ్ పదో తరగతి కూకట్పల్లిలోని ప్రగతి నగర్ ప్రాంతంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో శ్రావణ్ చదువుకున్నాడు. అతడు పాఠశాలలో చదువుకుంటున్నప్పుడు ఆ బాలిక కూడా అక్కడే చదువుకునేది. ఆ బాలిక అమీన్పూర్ పట్టణంలోని బీరంగూడ సృజన లక్ష్మీ నగర్ లో నివాసం ఉండేది. పదవ తరగతి చదువుతున్నప్పుడే వారిద్దరి మధ్య స్నేహం మొదలైంది. అది కాస్త ప్రేమగా మారింది. వాస్తవానికి వారిద్దరూ బీటెక్ వేరువేరు కాలేజీల్లో చదువుతున్నప్పటికీ.. తరచుగా కలుసుకునేవారని తెలుస్తోంది. ఇరు కుటుంబాల వారికి వారిద్దరి మధ్య అనుబంధం తెలుసు కాబట్టి.. శ్రవణ్ ను అమ్మాయి తరఫున బంధువులు హెచ్చరించారు. ఇద్దరు దూరం పాటించాలని సూచించారు. అయితే మంగళవారం ఉదయం 11 గంటల ప్రాంతంలో శ్రావణ్ ఆ అమ్మాయి ఇంటికి వెళ్ళాడు. అక్కడ గొడవ జరిగింది. గొడవ జరుగుతున్నప్పుడు ఆ అమ్మాయి చేయి విరిగిందని తెలుస్తోంది. ఈ నేపథ్యంలోనే ఆ అమ్మాయి కుటుంబ సభ్యులు ఆమెను ఆసుపత్రికి తరలించాలని తెలుస్తోంది. ప్రస్తుతం ఆస్పత్రిలో ఆ యువతి చికిత్స పొందుతోంది.

# ఫ్యూచర్ సిటీకి విపరీతమైన క్రేజ్

హైదరాబాద్, డిసెంబర్ 12(భారతశక్తి ప్రతినిధి):



తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మించ తలపెట్టిన భారత్ ఫ్యూచర్ సిటీ.. దేశంలో మరే ఇతర కొత్త నగర నిర్మాణానికి దక్కని అరుదైన ప్రాముఖ్యతను దక్కించుకుంది. 13,500 ఎకరాల్లో సువిశాలంగా రూపుదిద్దుకోనున్న ఈ నగరం, కేవలం రెండు రోజుల తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్-2025 విజయంతోనే ప్రపంచ పారిశ్రామిక పటంలో కీలక గమ్యస్థానంగా నిలిచింది. ఈ సమ్మిట్‌లో 44 దేశాల ప్రతినిధులు హాజరు కావడం, రూ.5.7 లక్షల కోట్ల పెట్టుబడుల ఒప్పందాలు జరగడం ఫ్యూచర్ సిటీ పట్ల ఇన్వెస్టర్ల విశ్వాసానికి నిదర్శనంగా నిలుస్తోంది. దేశంలో ఇప్పటికే అనేక స్మార్ట్ సిటీలు, కొత్త నగరాల నిర్మాణ ప్రతిపాదనలు దశాబ్దాలుగా కేవలం కాగితాలకే పరిమితమైన సందర్భాలు ఉన్నాయి. కానీ భారత్ ఫ్యూచర్ సిటీ నిర్మాణానికి వేదికగా గ్లోబల్ సమ్మిట్‌ను నిర్వహించడం అనేది సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వ దార్శనికత, కార్యాచరణ వేగానికి నిదర్శనం అని పలువురు అభిప్రాయపడుతున్నారు. సమ్మిట్ ముగిసిన వెంటనే ఫ్యూచర్ సిటీ కార్యరూపం దాల్చడానికి మార్గం సుగమమైంది. మౌలిక సదుపాయాలు, డీప్ టెక్, గ్రీన్ ఎనర్జీ, ఏరోస్పేస్,ఫ్ర్మా, ఎంటర్టైన్మెంట్, డిఫెన్స్, ఏఐ వంటి రంగాలకు లక్షల కోట్ల పెట్టుబడులు తరలివస్తున్నాయి. ఈ ప్రాంతాన్ని నివాస కేంద్రంగా, వ్యాపార ? పరిశోధన కేంద్రంగా అభివృద్ధి చేయాలని ప్రభుత్వం ప్రణాళికలు రచిస్తోంది. భారత్ ఫ్యూచర్ సిటీ నగరాన్ని ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, హెల్త్ సిటీ, ఎంటర్‌టైన్‌మెంట్, క్రీడలు, డేటా సెంటర్స్, అంతర్జాతీయ స్థాయి ఉన్నత విద్యా సంస్థల జిల్లాలుగా మొత్తం ఆరు విభాగాలుగా నిర్మించనున్నారు. ముఖ్యమైన నిర్మాణ ప్రక్రియలో భాగంగా డేటా సెంటర్ల కోసం 400 ఎకరాలు కేటాయించారు, వచ్చే ఫిబ్రవరి చివరిలో నిర్మాణాలు ప్రారంభం కానున్నాయి. ఇక మరో నెల రోజుల్లో యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ కార్యక్రమాలు మొదలవుతాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆకాంక్షల మేరకు ఈ 13,500 ఎకరాల నగరాన్ని జీరో కార్బన్ సిటీగా రూపొందించే లక్ష్యంతో.. నగరం అంతటా అర్బన్ ఫారెస్ట్‌లు, రెయిన్ హార్వెస్టింగ్ వ్యవస్థ ఏర్పాటు చేయనున్నారు. లైఫ్ సైన్సెస్, గ్రీన్ ఫార్మా, ఎలక్ట్రిక్ వాహనాల రంగాల్లో పరిశోధన, మ్యాన్యుఫ్యాక్చరింగ్ కేంద్రాలు ఇక్కడ ఉంటాయి. ఈ నగరం సమగ్ర జీవన కేంద్రంగా ఉండనుంది. ఇక్కడ 13 లక్షల మందికి ఉ ద్యోగాలు, 9 లక్షల జనాభా కోసం నివాస సముదాయాలు ఏర్పాటవుతాయి. అంతేకాకుండా రిలయన్స్ ఫౌండేషన్ వంతారతో వన్యప్రాణుల సంరక్షణ కేంద్రం ఏర్పాటుతో పాటు ఎంటర్‌టైన్‌మెంట్ డిస్ట్రిక్ట్‌లో అంతర్జాతీయ కన్వెన్షన్ సెంటర్లు, స్టార్ హోటళ్లు, రేసింగ్ ట్రాక్‌లు వంటి వినోద, క్రీడా సౌకర్యాలు కూడా అందుబాటులోకి రానున్నాయి. భారత్ ఫ్యూచర్ సిటీ నిర్మాణం అద్భుతమైన మౌలిక వసతులు, అత్యాధునిక రవాణా వ్యవస్థలతో ఒక ఆర్కిటెక్చరల్ అద్భుతంగా నిలవనుంది. సమ్మిట్ విజయం తర్వాత దేశంలో ఏ కొత్త నగరానికి దక్కని ప్రాముఖ్యత ఈ ప్రాజెక్ట్‌కు దక్కింది. ఇది తెలంగాణ విజన్-2047 లక్ష్యాలకు అనుగుణంగా 3 ట్రలియన్ డాలర్ల ఎకానమీగా తెలంగాణను తీర్చిదిద్దడంలో ఫ్యూచర్ సిటీ కీలక పాత్ర పోషించనుందని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి.

## ఒకే రోజు నాలుగు కంపెనీలకు శంకుస్థాపన
## ఇటుక ఇటుక పేర్చుకుంటూ వచ్చాం

విజయవాడ, డిసెంబర్ 12(భారతశక్తి ప్రతినిధి):

ఆంధ్రప్రదేశ్‌కు ఐటీ రంగంలో పెట్టుబడులను ఆకర్షించే దిశగా ప్రభుత్వం కీలక అడుగులు వేస్తోంది. ఇందులో భాగంగా విశాఖపట్నంలో ఒకేరోజు నాలుగు ప్రముఖ ఐటీ సంస్థల ఏర్పాటుకు రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖ మంత్రి నారా లోకేశ్ శంకుస్థాపన చేశారు. ఆంధ్రప్రదేశ్ ఐటీ రంగానికి భారీ ఊపునిస్తూ, ప్రముఖ టెక్నాలజీ సంస్థ కాగ్నిజెంట్ విశాఖపట్నంలో భారీ కార్యకలాపాలు ప్రారంభించనుంది. నగరంలో 20,000 సీట్ల సామర్థ్యంతో శాశ్వత క్యాంపస్‌కు భూమిపూజ చేయడంతో పాటు, తక్షణమే 1,000 సీట్లతో ఒక తాత్కాలిక టెక్ ఫిన్ సెంటర్‌ను ప్రారంభిస్తున్నట్లు రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ప్రకటించారు. ఈ పరిణామం రాష్ట్ర ప్రగతిలో ఒక కొత్త అధ్యాయమని ఆయన అభివర్ణించారు. తాజాగా దీనిపై ఆయన సోషల్ మీడియాలో స్పందించారు."ఈరోజు నాకు చాలా వ్యక్తిగతమైనది. గత 18 నెలలు అంత సులభంగా గడవలేదు... ప్రపంచ పెట్టుబడిదారులను ఒప్పించడం, నమ్మకాన్ని తిరిగి నిలబెట్టడం, ఇటుక ఇటుక పేర్చి ఆంధ్రప్రదేశ్ కథను మళ్లీ చెప్పడం వంటివి ఎంతో శ్రమతో కూడుకున్నవి. విశాఖలో 20,000 సీట్ల సామర్థ్యంతో కాగ్నిజెంట్ తన క్యాంపస్‌కు భూమిపూజ చేయడం, 1,000 సీట్ల తాత్కాలిక టెక్‌ఫిన్ కేంద్రాన్ని ప్రారంభించడంతో మనం ఒక కొత్త అధ్యాయంలోకి అడుగుపెడుతున్నాం. మన యువ రాష్ట్ర ప్రయాణంలో ఇది ఒక సరికొత్త అధ్యాయం, ఒక కీలకమైన మలుపు. ఇక్కడి నుంచి ఆంధ్రప్రదేశ్‌కు ఒకేఒక్క మార్గం ఉంది... అది అభివృద్ధి పథమే" అని లోకేశ్ ఉద్ఘాటించారు. ఈ కంపెనీల ద్వారా నగరంలోకి రూ. 282.60 కోట్ల పెట్టుబడులు రానుండగా, సుమారు 4,300 మందికి ప్రత్యక్షంగా ఉద్యోగావకాశాలు లభించనున్నాయి. మంత్రి లోకేశ్ భూమిపూజ చేసిన సంస్థల వివరాలు ఇలా ఉన్నాయి.

# మళ్లీ విస్తరణ ఆశలు...

అదిలాబాద్, డిసెంబర్ 12(భారతశక్తి ప్రతినిధి):

ఉన్నది రెండు క్యాబినెట్ బెర్తులు. ఎంతోమంది ఆశావహులు. మరెన్నో క్యాస్ట్ ఈక్వేషన్స్. అయినా తన లెక్కలు తనకు ఉన్నాయంటున్నారు ఓ ఎమ్మెల్యే. ఎంబీసీ కోటాలో తనకు మినిస్ట్రీ పక్కా అని ధీమాగా ఉన్నారట. ఐయామ్ మోస్ట్ ఎలిజిబుల్ పర్సన్ అంటూ.. ఓ రేంజ్‌లో హోప్స్ పెట్టుకుని హైప్ క్రియేట్ చేస్తున్నారు. ఇంతకు ఎవరా ఎమ్మెల్యే? ఆయనకు అమాత్య యోగం అంత దగ్గరలో ఉందా?రెండో సారి క్యాబినెట్ విస్తరణపై ఆ ఎమ్మెల్యే ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. ఎంబీసీ కోటా.. డిస్ట్రిక్ ఈక్వేషన్స్ ఎలా ఎన్నో లెక్కలు వేసుకున్నా.. అప్పట్లో జస్ట్ మిస్. అయినప్పటికి పట్టు వదలని విక్రమార్కుడిలా అలుపెరగని ప్రయత్నాలు చేస్తున్నారు రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్. ఇంకా మంత్రి వర్గంలో రెండు బెర్తులు ఖాళీగా ఉండటంతో..ఎంబీసీ కోటాలో ఛాన్స్ కోసం పట్టుబడుతున్నారట. రెండో విడత మంత్రివర్గ విస్తరణలో చోటు దక్కించుకోవాలనే ఆశతో సౌత్ టు నార్త్ ఎఫర్ట్స్ పెట్టినప్పటికీ ఫలితం దక్కలేదట.అయితే సామాజిక సమీకరణల నేపథ్యంలో ఇరుగు పొరుగు నియోజకవర్గాల ఎమ్మెల్యేలు మంత్రులయ్యారు కానీ..మక్కాన్ సింగ్ కోరిక నెరవేర లేదు. కాంగ్రెస్ పార్టీలో ఉన్న ఎమ్మెల్యేలలో మోస్ట్ బ్యాక్ వర్డ్ క్యాస్ట్ ఎమ్మెల్యేగా మక్కాన్ సింగ్ ఒక్కరే ఉన్నారు. మొదటి నుంచి ఎంబీసీ కోటాలో తనకు బెర్త్ దక్కడం ఖాయమని భావించిన ఆయనకు.. జిల్లా ఈక్వేషన్స్ మాత్రం



అడ్డంకిగా మారుతున్నాయట. ఇప్పటికే ఉమ్మడి కరీంనగర్ జిల్లా నుండి ముగ్గురు మంత్రులు కేబినెట్ లో ఉండటంతో ఆయనకు ఛాన్స్ దక్క లేదు. అయితే నెక్ట్స్ విస్తరణలో మాత్రం జిల్లా నుండి ఓ మంత్రిని తప్పించైనా మక్కాన్ సింగ్ కు బెర్త్ ఖాయమనే చర్చ జోరుగా సాగుతోంది.2014, 2018లో రెండుసార్లు రామగుండం నుంచి పోటీ చేసి ఓడిన మక్కాన్ సింగ్.. 2023 ఎన్నికల్లో మాత్రం గెలుపొందారు. దివంగత సీఎం రాజశేఖర్ రెడ్డి హయంలో మక్కాన్ సింగ్ కు శాప్ ఛైర్మన్ పదవి దక్కింది. రాజశేఖర్ రెడ్డికే కాదు ఏపీ మాజీ సీఎం జగన్ తోసత్సంబంధాలున్నప్పటికి? మారిన రాజకీయ పరిణామాలతో ఆశించిన పదవులు ఆమడ దూరమయ్యాయి. ఇప్పుడు ఎమ్మెల్యేగా విజయం సాధించడం, పార్టీ అధికారంలో ఉండడంతో..ఎంబీసీ స్లోగన్ కలిసి వస్తుందనుకున్నారు. మొదట విడతలో బీసీ కోటలో పొన్నం ప్రభాకర్, కొండా సురేఖకు మంత్రి పదవులు దక్కగా..రెండో విడత క్యాబినెట్ విస్తరణలో వాకిటి శ్రీహరి మంత్రి అయ్యారు. ఎంబీసీ కోటాను పరిగణలోకి తీసుకుంటే?తనకు మినిస్టర్ పదవి దక్కుతుందనేది మక్కాన్ సింగ్ నమ్మకం.క్యాబినెట్ లో మొత్తం 18మందికి అవకాశం ఉండగా..సీఎంతో కలిసి 16 మందితో క్యాబినెట్ కొనసాగుతుంది. మొదటి విడతలో 11 మందిని, రెండో విడతలో ముగ్గరికి క్యాబినెట్ లో బెర్త్ లు దక్కాయి. జూబ్లీహిల్స్ ఎన్నికలకు ముందు అజారుద్దీన్ కు మంత్రి పదవి ఇవ్వడంతో మరో రెండు ఖాళీలు మాత్రమే మిగిలి ఉన్నాయి. మిగిలిన రెండింట్లో ఓ ఛాన్స్ ఇవ్వాలంటున్నారట మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్. పార్టీకి వీర విధేయుడిగా పని చేయడమే కాదు?సామాజిక పరంగా చూసుకున్నా మోస్ట్ ఎలిజిబుల్ పర్సన్ అంటున్నారట.సీఎం రేవంత్ రెడ్డికి సన్నిహితుడే కాదు..రాహుల్ గాంధీతో మంచి సంబంధాలున్నాయి. ఇక అమాత్య పదవి దక్కితే మాత్రం మొదటి మంత్రిగా రామగుండం పొలిటికల్ హిస్టరీలో మిగిలిపోనున్నారు. కాబట్టి? మక్కాన్ మంత్రి పదవి కోసం మాములుగా ట్రై చేయడం లేదట. అయితే అమాత్య రేసులో ఉన్న మక్కాన్ సింగ్ కు?రెండోసారి పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడి పదవి దక్కింది. డీసీసీ ప్రెసిడెంట్ పోస్ట్ వచ్చినా తన సీనియారిటీకి తగ్గ పదవి ఇవ్వలేదనే అసంతృప్తితో ఉన్నారట ఎమ్మెల్యే. మంత్రి పదవి ఎలాగో పెండింగ్ లో పడుతుంది.. కనీసం పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ పోస్ట్ అయినా ఇవ్వాలి కదా అంటూ తన సన్నిహితుల దగ్గర డిస్కస్ చేస్తున్నారట. మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ కల నెరవేరుతుందా.. ఆయన మంత్రి పదవి ఆశ తీరుతుందో చూడాలి.

## వివాదంలో దువ్వాడ శ్రీనివాస్ జంట

హైదరాబాద్, డిసెంబర్ 12(భారతశక్తి ప్రతినిధి):

లుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టించిన ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్, దివ్వెల మాధురి జంట మరోసారి వార్తల్లోకి ఎక్కారు. మాధురి పుట్టినరోజు సందర్భంగా గురువారం రాత్రి



మొయినాబాద్ ఫామ్‌హౌస్‌లో నిర్వహించిన పార్టీపై పోలీసులు దాడి చేశారని సమాచారం. అనుమతి లేకుండా మద్యం, హుక్కా పరికరాలతో పార్టీ చేసుకుంటున్నారనే సమాచారంతో ఈ ఆకస్మిక తనిఖీ జరిగిందని తెలుస్తోంది. ఈ ఘటనతో వీరిద్దరూ పోలీసుల అదుపులోకి వెళ్లినట్లు సమాచారం.తెలుగు రాష్ట్రాల్లో ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్, దివ్వెల మాధురి జంట గురించి తెలియని వారుండరు. ఇక తాజాగా దివ్వెల మాధురి బిగ్‌బాస్ షోలో పాల్గొని, తన పాపులారిటీని మరింత పెంచుకుంది. ఈ లవ్‌బర్డ్స్ గురించి నిత్యం ఏదో వార్త వస్తూనే ఉంటుంది. ఈక్రమంలో తాజాగా దువ్వాడ శ్రీనివాస్ , మాధురిలు వివాదంలో చిక్కుకున్నారు. ఈ జంటను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. మాధురి బర్త్‌డే సందర్భంగా మొయినాబాద్‌లోని ది పెండెంట్ ఫామ్‌హౌస్‌లో పార్టీ నిర్వహించి... అనుమతి లేకుండా మద్యం తీసుకుంటున్నారనే సమాచారంతో.. ఎస్‌ఓటీ పోలీసులు దాడి చేసి, వారిని అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం.డిసెంబర్ 12న దివ్వెల మాధురి పుట్టిన రోజు సందర్భంగా మొయినాబాద్‌లోని ది పెండెంట్ ఫామ్‌హౌస్‌లో దువ్వాడ శ్రీనివాస్ గురువారం రాత్రి పార్టీ నిర్వహించారని తెలుస్తోంది. అయితే ఈ పార్టీకి ఎలాంటి అనుమతి లేదని సమాచారం. అలానే పార్టీలో మద్యంతో పాటు మత్తు పదార్థాలు కూడా ఉన్నాయని వార్తలు వెలుగులోకి వస్తున్నాయి. ఈ పార్టీ గురించి స్థానిక పోలీసులకు, ఎస్‌ఓటీ పోలీసులకు అందిన పక్కా సమాచారంతో ఫామ్‌హౌస్‌పై సంయుక్తంగా దాడి చేసి బర్త్‌డే పార్టీని భగ్నం చేశారు. ఎలాంటి అనుమతి లేని 10 విదేశీ మద్యం బాటిళ్లు, ఏడు హుక్కా పరికరాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారని తెలుస్తోంది. ప్రస్తుతం పోలీసులు దువ్వాడ శ్రీనివాస్, దివ్వెల మాధురిలను అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం.దువ్వాడ శ్రీనివాస్ ఆంధ్రప్రదేశ్ శాసన మండలిలో సభ్యుడిగా (ఎమ్మెల్సీగా) పనిచేస్తున్నారు. 2024లో ఆయన తన కుటుంబాన్ని విడిచిపెట్టి దివ్వెల మాధురితో కలిసి ఉంటున్నారు. టెక్కలిలోని దువ్వాడ నివాసం ముందు ఆయన భార్యాపిల్లలు ధర్నా చేయడంతో ఈ జంట వ్యవహారం వెలుగులోకి వచ్చింది. ఇక అప్పటి నుంచి వీరిద్దరూ ఓపెన్‌గా తమ బంధం గురించి మాట్లాడుతున్నారు. బయట ఫంక్షన్లు, కార్యక్రమాలకు జంటగా కలిసే వెళు న్నారు.ఇదిలా ఉంటే.. బిగ్‌బాస్ 9 తెలుగుకి దివ్వెల మాధురి వైల్డ్‌కార్డ్ ఎంట్రీగా వెళ్లింది. ముచ్చటగా మూడు వారాల పాటు హౌస్‌లో ఉంది దివ్వెల మాధురి. మొదటి వారం ఆమెని ఎవరూ నామినేట్ చేయలేదు. ఇక రెండో వారం తనే తనూజతో డైరెక్ట్ నామినేషన్ చేయించుకొని, బిగ్‌బాస్ హౌస్ నుంచి ఎలిమినేట్ అయి బయటికొచ్చేసింది. శివాజీకి ఇచ్చిన ఇంటర్వ్యూ, మరో యూట్యూబ్ ఛానెల్ ఇంటర్వ్యూ తెగ వైరల్ అయ్యాయి.

## ఫస్ట్ టూ ట్వల్త్...ఒక్కటేబోర్డు

హైదరాబాద్, డిసెంబర్ 12(భారతశక్తి ప్రతినిధి):

తెలంగాణ పాఠశాల విద్యలో అతిపెద్ద మార్పులు రానున్నాయి. ఇప్పటిదాకా పదో తరగతి వరకు ఉన్న ఎస్ఎస్‌సీ బోర్డు, ఇంటర్ వరకు ఉన్న ఇంటర్మీడియట్ బోర్డు రెండు కలిసిపోనున్నాయి. ఈ మేరకు 1 నుంచి 12వ తరగతి వరకు తెలంగాణ స్కూల్ ఎడ్యుకేషన్ బోర్డు ఏర్పాటు చేయనుంది ప్రభుత్వం. తెలంగాణ రైజింగ్ విజన్ డాక్యుమెంట్ 2047లో ఈ విషయాన్ని వెల్లడించింది.ప్రస్తుతం ఉన్న సెకండరీ స్కూల్ సర్టిఫికేట్, ఇంటర్మీడియట్ బోర్డులను ఒకే అధికారంతో భర్తీ చేయడం ద్వారా తెలంగాణ తన పాఠశాల విద్యా వ్యవస్థను పునర్నిర్మించనుంది. కొత్త బోర్డు అన్ని వర్గాల పాఠశాలలకు విద్యా ప్రమాణాలు, నాణ్యతా నిబంధనలు, గుర్తింపును నిర్వహిస్తుందని ప్రభుత్వం తెలిపింది. డ్యూయల్-బోర్డు వ్యవస్థ నుండి వైదొలగాలని కేంద్రం రాష్ట్రాలకు చెబుతోంది.ప్రాథమిక, యూపీఎస్, ఉన్నత పాఠశాలలు వంటి ఒకే ప్రాంతంలో పనిచేసే పాఠశాలలు ఒకే ప్రధానోపాధ్యాయుడి కింద ఒకే సంస్థలో విలీనం అవుతాయి. ఈ ఏకీకృత పాఠశాలలు అన్నమాట ప్రీ-ప్రైమరీ నుండి 10వ తరగతి వరకు తరగతులను అందిస్తాయి. హైస్కూల్‌గా మారుతుంది. విలీనం ముందు విద్యార్థులకు తగిన ప్రత్యామ్నాయాలు అందిస్తారు. దీని ద్వారా అనేక ఉపయోగాలు ఉన్నాయని ప్రభుత్వం చెబుతుంది. ఒకే ప్రాంతం, ఒతే ప్రదేశంలో ఉన్న వివిధ పాఠశాలలు ఒకే గొడుగు కిందకు వస్తాయి.ప్రభుత్వం అన్ని పాఠశాలల్లో దశలవారీగా ప్రీ-ప్రైమరీ తరగతులను ప్రవేశపెడుతుంది. సరిపడా ఉపాధ్యాయులను కూడా అందిస్తుంది. కోడింగ్, కంప్యూటేషనల్ థింకింగ్, వయస్సుకు తగిన ఏఐ అక్షరాస్యతతో పాటు పాఠశాల స్థాయి నుండి వృత్తి విద్యను ఏకీకృతం చేయాలని రాష్ట్రం యోచిస్తోంది. పరీక్షా వ్యవస్థ, అభ్యాస అంచనా పద్ధతులను కూడా పునఃరూపకల్పన చేస్తారు.విద్యా ప్రమాణాలను నియంత్రించడానికి తెలంగాణ స్కూల్ స్టాండర్డ్స్



అథారిటీ ఏర్పాటు చేస్తారు. విద్యార్థి-ఉపాధ్యాయ నిష్పత్తిని చూస్తారు. దీని ఆధారంగా అవసరమైన చోట ఉపాధ్యాయులను పోస్ట్ చేస్తారు. జిల్లా, మండల స్థాయి సమీక్షలు ప్రతి సంవత్సరం ఉంటాయి. టెక్నాలజీ ద్వారా ట్రాన్స్‌ఫర్ రిపోర్ట్ తయారు అవుతుంది. నియామకాలు కోర్ సబ్జెక్టులు, ఆర్ట్స్, శారీరక విద్య, కౌన్సెలింగ్ వంటి అనుబంధ రంగాలను కవర్ చేస్తాయి. పోస్ట్ గ్రాడ్యుయేట్ లేదా పీహెచ్‌డీ అర్హత ఉంటే.. వారిని ఇంటర్మీడియట్ లేదా డిగ్రీ కళాశాలలలో కూడా నియమించవచ్చు.ప్రభుత్వ ఆఎఇ కళాశాలలను కొత్త ప్రీ-ప్రైమరీ ఉపాధ్యాయులు, ఇన్-సర్వీస్ సిబ్బంది కోసం కోర్సులను అందించే విద్యా కేంద్రాలుగా మారుస్తారు. కార్పొరేట్ సామాజిక బాధ్యత నెట్‌వర్క్‌లను ప్రభుత్వం మరింత క్రీయాశిలకంగా చేయనుంది. దీనిద్వారా పాఠశాలల్లో మౌలిక సదుపాయాల మెరుగుదలపై దృష్టి పెడుతుంది. అంతేకాదు ఎన్ఆర్ఐలను కూడా ఇందులో భాగం చేసేందుకు ప్రభుత్వం ఆలోచన చేస్తోంది.

## డివిజన్ల పునర్విభజన షురూ

హైదారబాద్, డిసెంబర్ 12(భారతశక్తి ప్రతినిధి):

ఎల్బీనగర్ నియోజకవర్గంలో డివిజన్ల పునర్విభజనతో నూతన డివిజన్ల ఏర్పాటుతో పాటు రాజకీయ వర్గాల్లో నూతనోత్సాహం కనిపిస్తుంది. జీహెచ్ఎంసీలో శివారు ప్రాంతాలను విలీనం చేసిన అనంతరం నూతన డివిజన్లను వాటి పేర్లలో ప్రాథమిక నోటిఫికేషన్



ప్రకటించారు. కాగా, ఎల్బీనగర్ జోనల్ లోని హయత్ నగర్, ఎల్బీనగర్, సరూర్ నగర్ సర్కిళ్ల పరిధిలోని డివిజన్లను పునర్విభజన చేశారు.నూతనంగా 9 నూతన డివిజన్లు ఏర్పాటు కాబోతున్నాయి. ఎల్బీనగర్ నియోజకవర్గంలోని మూడు సర్కిళ్లలో ఇప్పటివ రకు మొత్తం 13 డివిజన్లు ఉండగా, వాటి స్థానంలో మొత్తం 22 డివిజన్లు రానున్నాయి. నూతన డివిజన్ల ఏర్పాట్లపై అభ్యం తరాలు, సలహాలు, సూచనలు చేయాలని జీహెచ్ఎంసీ అధికారులు కోరుతున్నారు. ఎల్బీనగర్ నియోజకవర్గం పరిధిలో ఇప్పటివరకు 11 డివిజన్లు ఉన్నాయి. ఎల్బీనగర్ నియోజకవర్గంలో ఇప్పటి వరకు 11 డివిజన్లు ఉన్నాయి. వీటికి అదనంగా నూతనం గా 7 డివిజన్లు ఏర్పాటు చేయడంతో మొత్తంగా 18 డివిజన్లు ఏర్పాటు కానున్నాయి. ఎల్బీనగర్ నియోజకవర్గం పరిధిలో ఉన్న మహేశ్వరం నియోజకవర్గానికి చెందిన సరూర్ నగర్, ఆర్కేపురం డివిజన్లను సైతం పునర్విభజన చేశారు. రెండు డివిజన్ల స్థానం లో మరో రెండు డివిజన్లు ఏర్పాటు చేశారు. ఎల్బీనగర్ నియోజకవర్గం జీహెచ్ఎంసీ జోనల్ పరిధిలో ఇప్పటి వరకు మూడు సర్కిళ్ల ఉన్నాయి. వీటిలో హయత్ నగర్, ఎల్బీనగర్, సరూర్ నగర్ సర్కిళ్లు ఉన్నాయి. హయత్ నగర్ సర్కిల్ పరిధిలో నాలుగు డివిజన్లు నాగోల్, మన్సూరాబాద్, హయత్ నగర్, బీఎన్ రెడ్డి నగర్ డివిజన్లు ఉన్నాయి. ఎల్బీనగర్ సర్కిల్ లో ఇప్పటివరకు వనస్థలిపురం, హస్తినాపురం, చంపాపేట, లింగోజిగూడ డివిజన్లు ఉన్నాయి.సరూర్ నగర్ సర్కిల్ లో ఇప్పటివరకు కొత్తపేట, చైతన్యపురి, గడ్డిఅన్నారం, సరూర్ నగర్, ఆర్కే పురం డివిజన్లు ఉన్నాయి. మూడు సర్కిళ్ల పరిధిలోని డివిజన్లను పునర్విభజన చేసి, కొత్తగా ఎనిమిది డివిజన్లు ఏర్పాటు చేశారు. సరూర్ నగర్ సర్కిల్ పరిధిలోని కొత్తపేట, చైతన్యపురి, గడ్డిఅన్నారం డివిజ న్లను యథావిధిగా ఉంచారు. అయితే, మహేశ్వరం నియోజకవర్గంలోని సరూర్ నగర్ డివిజన్ ను విభజించి డాక్టర్స్ కాలనీ పేరుతో కొత్త డివిజన్, రామకృష్ణాపురం డివిజన్ ను విభజించి ఎన్టీఆర్ నగర్ పేరుతో నూతన డివిజన్ ఏర్పాటు చేశారు. ఎల్బీనగర్ నియోజకవర్గం పరిధిలోకి వచ్చే ఎల్బీనగర్ సర్కిల్ లో ఉన్న చంపాపేట డివిజన్ విభజించి నూతనంగా కర్మన్ ఘాట్, హస్తినా పురం డివిజన్ నుంచి బైరామల్ గూడ, వనస్థలిపురం డివిజన్ నుంచి చింతలకుంట, నాగోల్ డివిజన్ నుంచి సాయినగర్, మన్సూరాబాద్ డివిజన్ నుంచి లెక్చరర్స్ కాలనీ, హయత్ నగర్ డివిజన్ నుంచి హైకోర్టు కాలనీ, బీఎన్ రెడ్డి నగర్ డివిజన్ నుంచి సాహెబ్ నగర్ డివిజన్లను ఏర్పాటు చేశారు. తాజాగా ఎల్బీనగర్ నియోజకవర్గంలో 7 డివిజన్లు, మహేశ్వరం నియోజకవర్గంలో 2 నూతన డివిజన్లు ఏర్పాటు చేశారు. ఎల్బీనగర్ నియోజకవర్గం పరిధిలోని సరూర్ నగర్ సర్కిల్ పరిధిలోని కొత్తపేట, చైతన్యపురి, గడ్డిఅన్నారం డివిజన్లను యథావిధిగా ఉంచారు. నియోజకవర్గంలోని డివిజన్ల పునర్విభజనతో రాజకీయ పార్టీలో నూతనోత్తేజం కనిపిస్తుంది. సుమారు 40 వేల జనాభాకు ఒక డివిజన్ ఏర్పాటు చేస్తుండడంతో కొత్తవారికి రాజకీయ రంగ ప్రవేశం లభిస్తుంది. పాలన వికేంద్రీకరణ కావడంతో ప్రజలకు మౌలిక, కనీస సౌకర్యాలు, వసతులు అందుబాటులోకి వస్తాయి. దీంతో పాటు కొత్తగా రాజకీయ అవకాశాలు అందరికీ అందుబాటులోకి వస్తాయి.

## శుక్రవారం సభతో మహిళల్లో ఆరోగ్యంపై అవగాహన
## జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి

కరీంనగర్ డిసెంబర్ 12(భారతశక్తి ప్రతినిధి):

శుక్రవారం సభ కార్యక్రమం ద్వారా జిల్లాలో మహిళలకు తమ ఆరోగ్యం, పిల్లల పోషణ పట్ల అవగాహన వస్తోందని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో హౌసింగ్ బోర్డ్ కాలనీ అంగన్వాడీ కేంద్రం పరిధిలో నిర్వహించిన శుక్రవారం సభకు జిల్లా కలెక్టర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ శుక్రవారం సభ ద్వారా మహిళలకు ప్రభుత్వ కార్యక్రమాల అవగాహన మాత్రమే కాకుండా ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించామని తెలిపారు. దీనివల్ల చాలామంది మహిళలు రక్తహీనత గురించి తెలుసుకుని అధిగమించారని అన్నారు. తమ పిల్లలు ఎంత బరువు, ఎంత ఎత్తు ఉండాలి అనే విషయం పట్ల తల్లులకు అవగాహన పెరుగుతోందని తెలిపారు. తద్వారా పిల్లలకు పోషకాహారం అందజేస్తూ వారి ఆరోగ్యాన్ని సంరక్షిస్తున్నారని తెలిపారు. ఆటపాటలతో కూడిన అంగన్వాడీ విద్య పిల్లల భవిష్యత్తుకు ఎంతగానో ఉపకరిస్తుందని అన్నారు. అంగన్వాడీల్లో పిల్లల బరువులు, ఎత్తు కొలుస్తూ వారు పరిపూర్ణ ఆరోగ్యంగా ఉండేలా చూస్తారని అన్నారు. పోషకాహారంతో పాటు ఆలనా పాలన చూసే అంగన్వాడి కేంద్రాలలో పిల్లలను చేర్పించాలని సూచించారు. ఎవరైనా దివ్యాంగ పిల్లలు ఉన్నట్లయితే వారిని భవితా కేంద్రాల్లో చేర్పించాలని తెలిపారు. ప్రభుత్వ దవాఖానాలు, ఆరోగ్య కేంద్రాల్లో అన్ని రకాల మందులు అందుబాటులో ఉంటాయని, బీపీ, షుగర్ వంటి దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు ఈ కేంద్రాల నుంచి ఉచితంగా మందులు స్వీకరించాలని సూచించారు.

# గ్రేటర్ హైదరాబాద్ ఆఫీసులోనే నీళ్లు ల్లేవ్

హైదరాబాద్, డిసెంబర్ 12(భారతశక్తి ప్రతినిధి):

హైదరాబాద్‌ను విశ్వనగరంగా మారుస్తాం, ఇంటింటికీ 24 గంటల మంచినీరు ఇస్తాం అని ప్రగల్భాలు పలికే గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పెద్దలకు.. సొంత ఆఫీసులో నీటి కష్టాలు తీర్చడం చేతకావడం లేదు. నగర ప్రజల దాహార్తిని తీర్చాల్సిన బల్దియా ప్రధాన కార్యాలయంలోనే గత రెండు రోజులుగా తీవ్ర నీటి ఎద్దడి నెలకొంది.ట్యాంక్ బండ్ పక్కన ఠీవిగా కనిపించే ఈ పరిపాలనా భవనంలో బుధవారం మధ్యాహ్నం మొదలైన నీటి సమస్య గురువారం రాత్రి వరకు పరిష్కారం కాకపోవడంతో అధికారులు, సిబ్బంది, సందర్శకులు అల్లాడిపోయారు.జీహెచ్ఎంసీ హెడ్ ఆఫీసులో గ్రౌండ్ ఫ్లోర్ నుంచి ఏడవ అంతస్తు వరకు నీటి సరఫరా వ్యవస్థ కుప్పకూలింది. మోటార్లు మొరాయించాయో, పైపులైన్లు పగిలాయో తెలియదు కానీ కార్యాలయంలోని ఏ ఒక్క నల్లాలోనూ చుక్క నీరు రాలేదు. మేయర్ విజయలక్ష్మి, కమిషనర్, అదనపు కమిషనర్లు, విభాగాధిపతులు కొలువుదీరే భవనంలోనే 24 గంటలకు పైగా నీటి సరఫరా నిలి చిపో వడం బల్దియా పనితీరుకు అద్దం పడుతోంది. నీటి సరఫరా లేకపోవడంతో భవనంలోని వాష్‌రూమ్‌లు, టాయిలెట్లు అధ్వానంగా తయారయ్యాయి. నీళు లేక ఫ్లష్‌లు పని చేయక, దుర్వాసన వెదజల్లుతుండటంతో కారిడార్లలో నడవడవే కష్టంగా మారింది. ముఖ్యంగా వందలాదిగా ఉన్న మహిళా ఉద్యోగులు వాష్‌రూమ్‌లకు వెళ్లలేక, బయటకు చెప్పుకోలేక నరకం అనుభవించారు. అత్యవసర పరిస్థితుల్లో పక్కనే ఉన్న వేరే భవనాలకు వెళ్లాల్సిన దుస్థితి ఏర్పడింది.నగర నలుమూలల నుంచి తమ సమస్యల పరిష్కారం కోసం, జనన మరణ ధృవీకరణ పత్రాల కోసం, టౌన్ ప్లానింగ్ పనుల కోసం హెడ్ ఆఫీసుకు వచ్చే సామాన్య జనం పరిస్థితి మరీ దారుణంగా ఉంది. దాహం వేస్తే మంచి నీళ్లు దొరక్క, టాయిలెట్లకు వెళ్లే దారిలేక వృద్ధులు, మహిళలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఊరందరికీ నీళ్లు పోస్తున్నామంటారు.. ఇక్కడేమో గొంతు తడుపుకోవడానికి కూడా దిక్కులేదు అని పలువురు ఆగ్రహం వ్యక్తం చేశారు.సాధారణంగా నగరంలో ఎక్కడ నీటి సమస్య వచ్చినా



వాటర్ ట్యాంకర్లు పంపించే జీహెచ్ఎంసీ.. తన సొంత ఆఫీసులో నీళ్లు లేకపోతే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయడంలో ఘోరంగా విఫలమైంది. బిల్డింగ్ మెయింటెనెన్స్ విభాగం అధికారులు నిమ్మకు నీరెత్తిన ట్లు వ్యవహరిస్తున్నారని ఉద్యోగులు మండిపడుతున్నారు. సమస్య మొదలై 30 గంటలు దాటుతున్నా కనీసం ట్యాంకర్ల ద్వారా అయినా నీటిని నింపే ప్రయత్నం చేయలేదని ఆరోపిస్తున్నారు. నీటి కొరత కారణంగా ఉద్యోగులు పడ్డ పాట్లు అన్నీ ఇన్నీ కావు. బుధవారం, గురువారం మధ్యాహ్న సమయాల్లో లం చ్ చేద్దామంటే కనీసం చేతులు కడుక్కోవడానికి, ప్లేట్లు శు భ్రం చేసుకోవడానికి కూడా నీళ్లు లేని దుస్థితి నెలకొంది. చాలామంది సిబ్బంది తెచ్చుకున్న లంచ్ బాక్సు లను అలాగే వెనక్కి తీసుకెళ్లారు. మరికొందరు ఆకలికి తట్టుకోలేక క్యాంటీన్లలో కొనుక్కున్న వాటర్ బాటిళ్ల నీటితో చేతు లు కడుక్కుని భోజనం కానిచ్చారు. చిన్న చిన్న అవసరాలకు కూడా బయట నుంచి నీళు కొనుక్కోవాల్సి రావడంతో సిబ్బంది తీవ్ర అసహనం వ్యక్తం చేశారు.

# అంతారంలో ఉపసర్పంచ్ ఎన్నిక వాయిదా ఎందుకు..

## గెలిచిన వార్డు సభ్యులకు ఇవ్వని నియామకపత్రాలు

### ఎన్నికల అధికారిపై చర్యలకు డిమాండ్

### జిల్లా కలెక్టర్, తాండూరు సబ్ కలెక్టర్కు వార్డుల సభ్యుల ఫిర్యాదు




వికారాబాద్ డిసెంబర్ 12(భారతశక్తి ప్రతినిధి):

వికారాబాద్ జిల్లా తాండూరు మండలం అంతారం గ్రామంలో ఉపసర్పంచు ఎన్నిక చేయలేదు ఇందులో కాంగ్రెస్ నేతల ఒత్తిడి కనిపిస్తుంది. . ఎన్నికల్లో గెలిచిన వార్డు సభ్యులకు గెలుపు నియామకపత్రాలు అందకపోవడం వివాదాస్పదంగా మారింది. ఎన్నికల అధికారి ఒత్తిళ్లకు తలొగ్గి పనిచేశారని వార్డు సభ్యులు ఆరోపించారు.

శుక్రవారం తాండూరు సబ్ కలెక్టర్ ఉమా శంకర్ ప్రసాద్కు ఫిర్యాదు చేశారు. తాండూరు మండలం అంతారం గ్రామంలో గురువారం ఎన్నికలు జరిగిన సంగతి తెలిసిందే. ఈ ఎన్నికల్లో ఎన్నికల అధికారిగా డి.రవికుమార్ విధుల్లో ఉన్నారు. ఓటింగ్ కౌంటింగ్ తరువాత కాంగ్రెస్ మద్దతుతో జంగని లక్ష్మీ విజయం సాధించారు. వార్డు సభ్యులుగా బీఆర్ఎస్ మద్దతుదారులు 7 మంది సుందరి నాగమణి, దౌల్తాబాద్ అనిత, విజయేందర్, ప్రవీణ్ కుమార్, వడ్డె రవి, బీజే గోరేమ్మ, శేరి విజయేందర్ రెడ్డిలు గెలిచారు.

ఎన్నికల తరువాత ఉపసర్పంచ్ను ఎన్నుకోవాల్సి ఉండగా ఎన్నికల అధికారి డి.రవీందర్ ఎన్నిక నిర్వహించలేదని వార్డు సభ్యులు ఆరోపించారు. బీఆర్ఎస్ తరుపున బీజే గోరెమ్మను ప్రతిపాదించడం జరిగిందని తెలిపారు. ఎన్నికల అధికారి ఇష్టారాజ్యంగా విధులు నిర్వహించారని అన్నారు. పైగా గెలిచిన వార్డు సభ్యులకు నియామకపత్రాలు కూడా అందించలేదని తెలిపారు. అధికార పార్టీ ఒత్తిళ్లకు తలొగ్గి పనిచేశారని ఆరోపించారు. ఎన్నికల అధికారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం వికారాబాద్ జిల్లా కలెక్టర్ కు ఫిర్యాదు చేసేందుకు వెళ్లారు.

# నాగారం గ్రామ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ప్రణవ్..

- కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించండి గ్రామ సమస్యలకు పరిష్కారం చూపెట్టండి.
- పని చేసే ప్రభుత్వాన్ని ఆశీర్వదించండి.
- గెలిచినా,ఓడినా ప్రజల మధ్యే ఉంటున్నా...

సమస్యల పరిష్కారానికి నా వంతు కృషి చేస్తా, వొడితల ప్రణవ్..



జమ్మికుంట, డిసెంబర్ 12(భారతశక్తి ప్రతినిధి):

పనిచేసే ప్రభుత్వానికి అండగా ఉండాలని, గెలిచినా,ఓడినా ప్రజల మధ్య ఉంటూ గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి నా వంతు కృషి చేస్తానని హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్, అన్నారు. శుక్రవారం రోజున జమ్మికుంట మండల పరిధిలోని నాగారం గ్రామంలో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థి ప్రదీప్-మమత,ల తరుపున ఎన్నికల ప్రచారంలో పాల్గొనీ, భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. డప్పు చప్పుళ్ళతో,మంగళ హారతులతో గ్రామస్థులు ఘన స్వాగతం పలికారు. అనంతరం నాగారం గ్రామంలోనీ అంజన్న స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన,అనంతరం ఆయన మాట్లాడుతూ, ఏ ఎన్నిక ప్రచారం అయినా ఇక్కడి నుండే ప్రారంభిస్తున్నామని, హుజూరాబాద్ నియోజకవర్గానికి ఈశాన్యాంగా ఉన్న ఈ ప్రాంతం,ఇక్కడి ఆంజనేయ స్వామి అత్యంత మహిమ కలిగినదని, స్వామి ఆశీస్సులు అందరిపై ఉండాలని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిందని రాబోయే రోజుల్లో ప్రతి ఇంటికి మరిన్ని సంక్షేమ పథకాలు అందజేస్తామని అన్నారు.

# అభివృద్ధికి పాటుపడే కాంగ్రెస్ అభ్యర్థులనే గెలిపించండి

## కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పిన్నింటి రఘునాథరెడ్డి

తాండూం డిసెంబర్ 12(భారతశక్తి ప్రతినిధి):



గ్రామాల అభివృద్ధికి పాటుపడే, గ్రామ అభ్యున్నతికి కట్టుబడి ఉండే కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులనె స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలిపించాలని కాంగ్రెస్ పార్టీ మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు పిన్నింటి రఘునాథ్ రెడ్డి కోరారు. శుక్రవారం మండలంలోని మాదారం ,మాదారం శ్రీ ఇంక్లైన్ ,రాజీవ్ నగర్, అచలాపూర్ గ్రామపంచాయతీలో కాంగ్రెస్ అభ్యర్థుల తరఫున ఇంటింటి ప్రచారం నిర్వహించి, రోడ్ షో చేపట్టారు .ఈ సందర్భంగా మాదారం ఐ ఎన్ టి యు సి కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. 2014లో కాంగ్రెస్ ప్రభుత్వం మిగులు బడ్జెట్ తో రాష్ట్రాన్ని టిఆర్ఎస్ పార్టీకి అప్పగిస్తే ,కెసిఆర్ కుటుంబం రాష్ట్రాన్ని దోచుకొని తెలంగాణ రాష్ట్రంపై 8 లక్షల కోట్ల అప్పును చేసిందన్నారు. అయినప్పటికీ రేవంత్ రెడ్డి సర్కారు ఇచ్చిన హామీలను ఎన్ని ఒడిదుడుకులు ఎదురైనా నెరవేరుస్తూ ముందుకు సాగుతుందన్నారు. ప్రజా సంక్షేమానికి కట్టుబడి మహిళలకు ఉచిత బస్సు, ప్రతి ఇంటికి 200 యూనిట్ల ఉచిత కరెంటు ,ఏకకాలంలో రైతులకు రుణమాఫీ ,500 రూపాయలకే గ్యాస్, రైతు భరోసా నిధుల విడుదల తోపాటు ప్రతి గ్రామంలో వాడవాడన సిసి రోడ్లతో పాటు ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం జరిగిందన్నారు. గత పదేళ్ల పాలనకు, ఈ రెండేళ్ల అభివృద్ధికి తేడాను గమనించి అభివృద్ధి చేసిన కాంగ్రెస్ అభ్యర్థులకే ఎన్నికల్లో పట్టం కట్టాలన్నారు . ఓటమి భయంతోనే ప్రతిపక్ష బిజెపి బిఆర్ఎస్ లు కాంగ్రెస్ ప్రభుత్వం పై అసత్య ఆరోపణ చేస్తున్నాయన్నారు మాదారం ఓపెన్ కాస్ట్ అయితే గనక ప్రతి ఒక్కరికి పునరావాసం కల్పించడంతో పాటు నిరుద్యోగులకు ఉపాధి కల్పించేలా చొరవ తీసుకుంటామని హామీ ఇచ్చారు ఈ సందర్భంగా అభ్యర్థులంతా కలిసి మాదారం గ్రామస్తులకు వాగ్దానం చేశారు గ్రామంలోని ప్రధాన సమస్య అయిన కోతుల సమస్యను పరిష్కరించేందుకు కట్టుబడి ఉన్నామన్నారు కాంగ్రెస్ సర్పంచ్ తో పాటు వార్డు సభ్యులందరినీ గెలిపిస్తే గెలిచిన వెంటనే సొంత ఖర్చులతో కోతులను పట్టిస్తామని హామీ ఇచ్చారు ఒకవేళ హామీని నెరవేర్చుకొని పక్షంలో ఎంపీటీసీ జడ్పిటిసి ఎన్నికల్లో ఓటు అడగబోమని స్పష్టం చేశారు. ఆయా కార్యక్రమాల్లో డిసిసి ఉపాధ్యక్షుడు సూరం రవీందర్ రెడ్డి ఐఎన్టీయూసీ ఏరియా ఉపాధ్యాయులు పేరం శ్రీనివాస్ సింగల్ విండో వైస్ చైర్మన్ కడారి రత్నాకర్ రావు మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గట్టు మురళీధర్ రావు సింగిల్ విండో మాజీ చైర్మన్ దామోదర్ రెడ్డి మాజీ సర్పంచ్ కాపర్తి సుభాష్ సర్పంచ్ అభ్యర్థులు పుట్ట శ్రీనివాస్ కృష్ణ పెల్లి లక్ష్మీనారాయణ మామిడాల లలిత తదితరులు ఉన్నారు

# పోలింగ్ అధికారులకు శిక్షణ

జయశంకర్ భూపాలపల్లి. డిసెంబర్ 12(భారతశక్తి ప్రతినిధి):



రెండవ సాధారణ గ్రామపంచాయతీ ఎన్నికలు, 2025 పురస్కరించుకొని జయశంకర్ భూపాలపల్లి జిల్లా లోని మహాదేవపూర్ మండలంలో 17.12. 2025 రోజున సర్పంచులకు మరియు వార్డ్ మెంబర్లకు ఎన్నికలు నిర్వహిస్తున్నందున ఈరోజు మహదేవపూర్ మండలంలోని 162 పోలింగ్ స్టేషన్లకు ప్రిసైడింగ్ అధికారులుగా విధులు పడిన ఉద్యోగులకు మరియు 18 గ్రామపంచాయతీలకు స్టేజ్ 2 రిటర్నింగ్ అధికారులు గా డ్యూటీ పడిన ఉద్యోగులకు శుక్రవారం మహాదేవపూర్ మండల కేంద్రంలోని రైతు వేదికలో రెండవ విడత ఒకరోజు శిక్షణ నిర్వహించబడినది. ఈ సందర్భంగా ఎంపీడీవో రవీంద్రనాథ్ ఎన్నికల సిబ్బందిని ఉద్దేశిస్తూ మాట్లాడుతూ గ్రామపంచాయతీ ఎన్నికలలో ప్రిసైడింగ్ అధికారులది ముఖ్య పాత్ర పోషించాల్సి ఉంటుందని తెలుపుతూ పోలింగ్ నిర్వహణ రోజు ముఖ్యమైందని పోలింగ్ దృష్ట్యా చేయాల్సిన అన్ని అంశాలపై ఎన్నికల సంఘం రూపొందించిన హ్యాండ్ బుక్కును ప్రతి ప్రిసైడింగ్ అధికారి తప్పకుండా చదవడమే కాకుండా అందులోని అన్ని నియమాలను పాటించాలని ఎంపీడీవో గారు సూచించారు. ఎన్నికల పట్ల ఎట్టి పరిస్థితుల్లో నిర్లక్ష్యంగా ఉండవద్దని ఆయన కోరారు, అంతేకాకుండా ప్రిసైడింగ్ అధికారిగా విధులు నిర్వహించే వారికి అన్ని అంశాల పట్ల పూర్తి అవగాహన ఉండాలని సూచించారు. మరియు ఎన్నికల విధులకు నియమించబడ్డ ఉద్యోగులు ఎలాంటి పార్టీలకు, అభ్యర్థులకు అనుకూలంగా ఉండకూడదని ఎన్నికల ప్రవర్తన నియమావళికి లోబడి ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు జాగ్రత్తగా విధులు నిర్వహించాలని సూచించారు. అనంతరం మండల విద్యాధికారి ప్రకాష్ గారు మాట్లాడుతూ ప్రతి పోలింగ్ ఆఫీసర్ పోలింగ్ మెటీరియల్, బ్యాలెట్ బాక్సులు, ఓటరు జాబితా కాపీ, ప్రిసైడింగ్ అధికారి డైరీ , పోలింగ్ కేంద్రం బయట ప్రదర్శించాల్సిన సామాగ్రి, పోలింగ్ కేంద్రంలోకి అనుమతించే వారు, వంటి అన్ని విషయాలు ఒకటికి రెండుసార్లు చదువుకోవాలని , పోలింగ్ సమయం ముగిసిన తర్వాత క్యూలో ఉన్న ఓటర్లకు స్లిప్పులు ఇవ్వాలని చివరి వ్యక్తి ఓటు వేసిన తర్వాత ప్రిసైడింగ్ అధికారి క్యూ వద్దకు వెళ్లి ఎవరూ లేరని నిర్ధారించుకొని పోలింగ్ స్టేషన్ తలుపులు మూసి ఏజెంట్ల సమక్షంలో బ్యాలెట్ బాక్స్ లను సీలు చేయాలి అని సూచించినారు.

# మాజీ ఎమ్మెల్యే నారాయణరావు పటేల్ నాయకత్వంలో పల్సి తండా ఏకగ్రీవ సర్పంచ్ ఆడె అర్జున్.



ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో, డిసెంబర్ 12 (భారతశక్తి):నిర్మల్ జిల్లా, కుబీర్ మండలంలోని పల్సి తాండ గ్రామ సర్పంచ్ గా ఆడే అర్జున్. శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.కాంగ్రెస్ పార్టీ ముదోల్ నియోజకవర్గ ఇన్చార్జి మాజీ ఎమ్మెల్యే నారాయణరావు పటేల్ సమక్షంలో ఏకగ్రీవంగా ఎన్నికైన ఆడే అర్జున్ ను శాలువాతో మాజీ ఎమ్మెల్యే నారాయణరావు పటేల్ సన్మానించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు బషీర్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# ప్రశాంతంగా ముగిసిన తొలి విడత పంచాయితీ ఎన్నికలు :జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి. ప్రావీణ్య

సంగారెడ్డి,భారత శక్తి, డిసెంబర్ 12:

సంగారెడ్డి జిల్లాలో తొలి విడతగా నిర్వహించిన గ్రామ పంచాయితీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిసినట్టు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి. ప్రావీణ్య తెలిపారు. తొలి విడత



పోలింగ్ ముగిసిన నేపథ్యంలో, రెండవ విడత ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు కలెక్టర్ తెలిపారు.ఎన్నికల ప్రక్రియకు సహకరించిన అధికారులు,ఎన్నికల సిబ్బందికి, పోలీసులు, గ్రామ స్థాయి సిబ్బందికి, ఓటర్లు, మీడియా ప్రతినిధులకు కలెక్టర్ ధన్యవాదాలు తెలిపారు.

# అనుమతి లేకుండా మెడికల్ టర్మినేషన్ ఆఫ్ ప్రెగ్నెన్సీలు నిర్వహించినట్లయితే, సంబంధిత ఆసుపత్రిపై చట్టపరమైన చర్యలు

కామారెడ్డి జిల్లా (భారత శక్తి ప్రతినిధి) డిసెంబర్ 12: శుక్రవారం కామారెడ్డి జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయంలో, గౌరవ జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ విద్య మేడం అధ్యక్షతన, ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఎమీమ్ మేడం ఆధ్వర్యంలో ఎమ్ టి పి. (మెడికల్ టర్మినేషన్ ఆఫ్ ప్రెగ్నెన్సీ) పై జిల్లా కమిటీ సమావేశం నిర్వహించబడింది.

ఈ సమావేశంలో జిల్లా పరిధిలోని ప్రైవేట్ ఆసుపత్రులలో ఎమ్ టి పి. అమలు, నిబంధనలు, అనుమతులపై విస్తృతంగా చర్చించి, అవసరమైన సూచనలు/ ఆదేశాలు జారీ చేయడం జరిగింది.

జిల్లా కార్యాలయం నుండి ప్రత్యేక అనుమతి లేకుండా ఏ ప్రైవేట్ ఆసుపత్రి కూడా ఎమ్ టి పి. ప్రక్రియను నిర్వహించరాదు. అనుమతి లేకుండా ఎమ్ టి పి. లు నిర్వహించినట్లయితే, సంబంధిత ఆసుపత్రిపై చట్టపరమైన చర్యలు తీసుకొని, ఆసుపత్రిని మూసివేయడం జరుగుతుందని తెలియజేయబడింది.

కావున కామారెడ్డి జిల్లాలోని ప్రతి ప్రైవేట్ ఆసుపత్రి యాజమాన్యం, ఎమ్ టి పి. ల నిర్వహణకు ముందు జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ నుండి తప్పనిసరిగా అనుమతి పొందవలసినదిగా ఆదేశించబడింది.

# జిల్లా న్యాయ సేవా సలహా అథారిటీ వారిచే ఆరోగ్య సేవల సలహా దినోత్సవ కార్యక్రమం

కామారెడ్డి జిల్లా (భారత శక్తి ప్రతినిధి) డిసెంబర్ 12: శుక్రవారం జిల్లా న్యాయ సేవా సలహా అథారిటీ వారిచే ఆరోగ్య సేవల సలహా దినోత్సవ కార్యక్రమం నిర్వహిచడం జరిగింది. జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ తరవున అందుతున్న వైద్య సేవలు, సౌకర్యాల గురించి జిల్లా లీగల్ సర్వీసెస్ సెల్ జడ్జి నాగరాణి ప్రత్యేక అవగాహన కల్పించారు. జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి, కామారెడ్డిలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ఇట్టి కార్యక్రమంలో ఆస్పత్రిలో రోగులకు అవసరమైన సేవలు వారికి గల హక్కుల గురించి జడ్జి ఆసుపత్రిలో గల రోగులకు విలువైన సమాచారం అందించి వారు నాణ్యమైన ఆరోగ్య సేవలు పొందేలా అవగాహన కల్పించడం జరిగింది. ఇట్టి కార్యక్రమంలో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డా. విద్యా రాన్ వల్కర్, ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డా. రవీందర్ గౌడ్, ఆర్.ఎమ్. ఓ. డా. సంతోష్, వైద్య సిబ్బంది, రోగులు, నర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.





# దేవుని గుట్టను సందర్శించిన అటవీశాఖ ముఖ్య కన్సర్వేటర్అధికారి సువర్ణ

ములుగు జిల్లా ప్రతినిధి, డిసెంబర్ 12 (భారతశక్తి): ములుగు జిల్లా అటవీ ప్రాంతం లోని (కొత్తూరు) దేవుని గుట్ట ను శుక్రవారం అటవీ శాఖ ప్రిన్సిపల్ చీఫ్ కన్సర్వేటర్ అధికారి సిహెచ్. సువర్ణ తనిఖీలో భాగంగా అక్కడ ఉన్న అటవీ ప్రాంతాన్ని పరిశీలించి అధికారులకు ఆమె తగు సూచనలు చేశారు. అనంతరం శ్రీ లక్ష్మి నరసింహస్వామిని దర్శించుకున్నారు. తదుపరి ఇంచెర్ల ఈకో పార్కును సందర్శించి, అక్కడ చేపట్టిన టవర్, నీటి కుంటలు, పచ్చి వెదురు బొమ్మలు ఆదితర పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కాలేశ్వరం సిసిఎఫ్ బి. ప్రభాకర్, ములుగు జిల్లా ఆట విశాఖ అధికారి రాహుల్ కిషన్ జాదవ్, భూపాలపల్లి జిల్లా ఆటవిశాఖ అధికారి నవీన్ రెడ్డి, ములుగు డివిజనల్ అధికారులు ఎఫ్ ఆర్ ఓ లు, ఎఫ్ బి ఓ లు తదితరులు పాల్గొన్నారు.

# మినీ కాన్ఫరెన్స్ హాల్ లో రెండవ విడతలో మూడవ ర్యాండమైజేషన్ పూర్తి

కామారెడ్డి జిల్లా (భారత శక్తి ప్రతినిధి) డిసెంబర్ 12: రెండవ విడత గ్రామపంచాయతీ ఎన్నికల నిర్వహణలో భాగంగా మూడవ ర్యాండమైజేషన్ కలెక్టరేట్ కార్యాలయంలోని మినీ కాన్ఫరెన్స్ హాల్ లో శుక్రవారం జిల్లా పాలనాధికారి ఆశిష్ సాంగ్వాన్, సాధారణ పరిశీలకులు సత్యనారాయణ రెడ్డి సమక్షంలో నిర్వహించారు.

ఈ సందర్భంగా రెండవ విడత గ్రామ పంచాయతీ ఎన్నికలు నిర్వహించే ఎల్లారెడ్డి నియోజకవర్గంలోని నాలుగు మండలాలు లింగం పేట, నాగిరెడ్డిపేట, గాంధారి, ఎల్లారెడ్డి, బాన్సువాడ నియోజక వర్గంలోని మహ్మద్ నగర్, నిజాంసాగర్, పిట్లం 3 మండలాలు మొత్తం 7 మండలాల్లో పోలింగ్ సిబ్బంది య్నొక్క మూడవ విడత ర్యాండమైజేషన్ ప్రక్రియను జిల్లా కలెక్టర్, జనరల్ అబ్జర్వర్ సమక్షంలో నిర్వహించారు.

ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ మధుమోహన్, సిపిఓ, రఘునందన్, ఎస్.ఓ



శివకుమార్, జిల్లా పంచాయతీ అధికారి, కంప్యూటర్ ఆపరేటర్లు, తదితరులు పాల్గొన్నారు.

# లైంగిక వేధింపుల కేసులో ప్రొఫెసర్ అరెస్టు

హైదరాబాద్ డిసెంబర్ 12:

లైంగిక వేధింపులకు పాల్పడిన జేఎన్టీయూ ప్రొఫెసర్ నె పోలీసులు అరెస్టు చేసి రిమాండం కు తరలించారు. కూకట్ పల్లి జేఎన్టీయూ లో మెకానికల్ ఇంజనీరింగ్ 55 ఏళ్ల ప్రొఫెసర్ తనను లైంగిక వేధిస్తున్నట్లు అదే విభాగంలో పనిచేస్తున్న గెస్ట్ లెక్చరర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. దాంతో కేపీహెచ్బీ పోలీసులు ప్రొఫెసర్ను అరెస్టు చేసి రిమాండ్ కి తరలించారు. ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది.

# జనవరి 21 నుంచి 25 వరకూ ఐఎంటెక్స్ ఎక్స్ పో

ఆసియాలోనే అతిపెద్ద మెటల్ ఫార్మింగ్ టెక్నాలజీ ప్రదర్శన ఐఎంటెక్స్ ఫార్మింగ్ 2026ను వచ్చే నెల నిర్వహిస్తున్నట్టు ఇండియన్ మెషీన్ టూల్ మాన్యుఫ్యాక్చరర్స్ అసోసియేషన్ (ఐఎంటీయూఎంఏ) ప్రకటించింది. బెంగళూరు ఇంటర్నేషనల్ ఎగ్జిబిషన్ సెంటర్ (బీఐఈసీ) లో జనవరి 21 నుంచి 25 వరకు ఇది జరుగుతుంది. ఈ ప్రదర్శనలో 20 దేశాలకు చెందిన 600కు పైగా ఎగ్జిబిటర్లు పాల్గొననున్నారు. టూల్టెక్, అడిటివ్ మాన్యుఫ్యాక్చరింగ్, వెల్డ్ఎక్స్పో, మోల్డెక్స్ ఇండియా, ఫాస్టెనెక్స్ ఇండియా వంటి కార్యక్రమాలు కూడా జరుగుతాయి. ఫార్మింగ్ టెక్నాలజీపై సెమినార్, ఐ2 అకడెమియా స్క్వేర్, యూత్ ప్రోగ్రామ్ వంటివి ఉంటాయి. జర్మనీ, ఇటలీ, జపాన్, తైవాన్ లాంటి దేశాల ప్రదర్శనదారుల బృందాలు పాల్గొంటాయి. ఈ ప్రదర్శన స్వదేశీ ఉత్పత్తుల తయారీని వేగవంతం చేస్తుందని ఐఎంటీయూఎంఏ ప్రెసిడెంట్ మోహినీ కేల్కర్ చెప్పారు.

# ఆయుర్వేద ఉత్పత్తులపై విస్తృత అవగాహన

భారతీయ ప్రాచీన వైద్య విధానమైన ఆయుర్వేద ఉత్పత్తులపై వితృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు డాబర్ ఇండియా మార్కెటింగ్ హెడ్ ఎథిక్స్ డాక్టర్ దుర్గాప్రసాద్ తెలిపారు. సోమాజిగూడ ప్రెస్ క్లబ్బుల్లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో సంస్థ నూతనంగా రూపొందించిన పంచరతన్ ను అందుబాటులోకి తెచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుమారు 5000 వేలకు పైబడిన ఆయుర్వేద వైద్య విధానం పై ఎన్నో అపోహలు, అనుమానాలు ఉన్నాయని అన్నారు. ఈ నేపథ్యంలో ఆయుర్వేద ఉత్పత్తులపై సమగ్ర పరిశోధన నిర్వహించి శాస్త్రీయ ఆధారాలను ప్రజల ముందు ఉంచే ప్రయత్నం చేస్తున్నట్లు చెప్పారు. కేంద్ర ప్రభుత్వ ఆయుర్ శాఖ సహకారంతో ఆయుర్వేద వైద్య విధానము, ఆయుర్వేద ఉత్పత్తుల విశిష్టతను ప్రజలకు వివరిస్తామని చెప్పారు. ఆయుర్వేదాన్ని ప్రజలకు మరింత చేరువ చేసేందుకు జిల్లా, మండల గ్రామీణ స్థాయిలలో వైద్య శిబిరాలను ఏర్పాటు చేస్తామని అన్నారు.

# వెంకటేశ్వర నగర్ కాలనీ

కూకట్ పల్లి డిసెంబర్ 12:

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కాలం నుంచి వెంకటేశ్వర నగర్ కాలనీ ప్రత్యేక చరిత్ర ఉందని కాలనీవాసులు అన్నారు. హైదరాబాదు మున్సిపాలిటీ సమయంలోనే ఈ ప్రాంతం కౌన్సిలర్ స్థాయిలో ఉండేదని నివాసులు గుర్తుచేశారు. ఆ తరువాత జిహెచ్ఎంసి ఏర్పాటుతో వెంకటేశ్వర నగర్ను ఇతర కాలనీలతో కలిపి వివేకానంద నగర్ డివిజన్లో విలీనం చేశారని తెలిపారు. వెంకటేశ్వర నగర్లో అధిక సంఖ్యలో ఓటర్లు ఉన్నారని డివిజన్ పునర్వ్యవస్థీకరణలో అన్యాయం జరిగిందని నివాసులు పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత జరిగిన కొత్త డివిజన్ పునర్విభజనలో వెంకటేశ్వర నగర్ పేరును డివిజన్గా చేర్చకపోవడం పట్ల కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేశారు. నేటి సమావేశంలో వెంకటేశ్వర నగర్ బ్లాక్ కమిటీలు, టెంపుల్ కమిటీలు, అఖిలపక్ష నాయకులు మరియు కాలనీవాసులు కలిసి 'వెంకటేశ్వర నగర్ జేఏసీ'ని ఏర్పాటు చేశారు.

# ఎన్నికల నియమాలను పాటించాలి

## - లోకేశ్వరం ఎస్ ఐ అశోక్.

–పోలింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు, ప్రజల గుమి గూడి ఉండరాదు.
–సెల్ ఫోన్లు, వాటర్ బాటిల్స్, ఇంకు బాటిల్స్, పోలింగ్ కేంద్రాన్ని లోనికి అనుమతి లేదు.
–పోలింగ్ కేంద్రాల వద్ద క్యూ లైన్ పద్ధతిని పాటించాలి.

నిర్మల్, డిసెంబర్ 12(భారతశక్తి ప్రతినిధి):

గ్రామపంచాయతీ ఎన్నికల సందర్భంగా మండలంలో జరిగే ప్రతి ఒక్క గ్రామంలో పోలీసు లు సూచించిన నియమాలను పాటించాలని లోకేశ్వరం %ూ×% అశోక్ తెలిపారు. పంచాయతీ ఎన్నికల ను ప్రశాంత వాతావరణంలో మరియు నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు ప్రజలు ప్రతి ఒక్కరు సహకరించాలని తెలిపారు. ప్రజలు ప్రతి ఒక్కరూ నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు.పోలింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని 100 మీటర్ల వద్ద 200 మీటర్ల వద్ద ప్రత్యేక నియమ నిబంధనలు ఉంటాయని వాటిని పాటించాలని, ప్రజల అనవసరంగా గుమిగూడి ఉండరాదని తెలిపారు.పోలింగ్ కేంద్రాలలోనికి సెల్ఫోన్లు, వాటర్ బాటిల్ లు, ఇంకు బాటిల్లు, ఆయుధాలు, పెన్నులు, అగ్నికి సంబంధించిన వాటికి అనుమతులు ఉండవని తెలిపారు. పోలింగ్ కేంద్రాల వద్ద క్యూ లైన్ పద్ధతిని పాటించి పోలీసులకు సహకరించాలన్నారు. పోలింగ్ రోజు ఉదయం 7 గంటల నుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు పోలింగ్ కేంద్రాలలోనికి అనుమతి ఇస్తారని తెలిపారు. వాట్సాప్ నందు సోషల్ మీడియా నందు ఇతరులకు రెచ్చగొట్టేలా కించపరిచేలా పోస్టులు పెట్టిన వారిపై పోలీసు నిఘా ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు.ఎలాంటి సమాచారం అయినా డయల్ 100 ద్వారా పోలీసులకు తెలియజేయాలని, గొడవలకు, అల్లర్లకు పాల్పడకూడదు .ఎన్నికలు పూర్తయిన తర్వాత విజయోత్సవ ర్యాలీలు నిర్వహించరాదని, అధికారుల అనుమతితో నిర్ధారించిన రోజులలో అనుమతి తీసుకుని నిర్వహించుకోవాలి.విజయోత్సవ ర్యాలీలలో టపాకాయలు పేల్చరాదు. సున్నితమైన ప్రాంతాలలో ఫ్లాగ్ మార్చ్ లు నిర్వహిస్తూ ప్రజలలో పోలీసుల పట్ల ధైర్యం నమ్మకం పెంపొందించేందుకు కృషి చేయడం జరుగుతుందని తెలిపారు. ఎట్టి పరిస్థితుల్లోనూ అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ప్రశాంతమైన వాతావరణంలో ఎన్నికలు పూర్తి చేయడానికి జిల్లా పోలీస్ యంత్రాంగం కఠినమైన చర్యలతో విధులను నిర్వర్తిస్తుందని తెలిపారు.



# జిల్లాలో మొదటి విడత పోలింగ్ ప్రశాంతం




ములుగు జిల్లా ప్రతినిధి, డిసెంబర్ 12 (భారత శక్తి): జిల్లాలో గ్రామ పంచాయతీ మొదటి విడత ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా జరిగాయి. పోలింగ్ 78.65 శాతం నమోదు అయింది. గోవిందరావుపేట, ఎస్.ఎస్. తాడ్వాయి, ఏటూరు నాగారం మండలాల్లో గురువారం పోలింగ్ నిర్వహించారు.

మూడు మండలాల్లో కలిపి మొత్తం

60, 361 ఓట్లు ఉండగా, 47,472 పోల్ అయ్యాయి. మధ్యాహ్నం ఒంటి గంట వరకు 78.65 శాతం పోలింగ్ నమోదు అయింది.మండలాల వారిగా ఓటర్లు.. నమోదు అయిన పోలింగ్ శాతం.గోవిందరావుపేట మండలంలో మొత్తం ఓటర్లు 20,402 మంది ఉండగా, 15,501 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. 75.98 శాతం నమోదు అయింది.

ఎస్.ఎస్. తాడ్వాయి మండలంలో మొత్తం ఓటర్లు 16,680 మంది ఉండగా, 13,928 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. 83.50 శాతం నమోదు అయింది.ఏటూరు నాగారం మండలంలో

మొత్తం ఓటర్లు 23,279 మంది ఉండగా, 18,043 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. 77.51శాతం నమోదు అయిందని అధికారులు తెలిపారు.

# నీటి భద్రత తోనే దేశ భవిష్యత్తు: జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి

వైయస్సార్ కడప, డిసెంబర్ 12(భారత శక్తి):



నీటి భద్రతతోనే దేశ భవిష్యత్తు ఆధారపడి ఉందని ఇందుకు జిల్లాలో సమర్థ వంతమైన నీటి భద్రత, సంరక్షణ,నిర్వహణకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి పేర్కొన్నారు. ఢిల్లీ లో ఐఐటి ఢిల్లీ, నీతి ఆయోగ్ సంయుక్తంగా నిర్వహించిన ఇండియా వాటర్ ఇంపాక్ట్ సమ్మిట్ లో జిల్లా రివర్ మేనేజ్‌మెంట్ ప్లాన్ ఫ్రేమ్‌వర్క్ కింద జిల్లా స్థాయి నీటి నిర్వహణ పై ప్యానలిస్ట్‌గా జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి సదస్సులో మాట్లాడుతూ.. జిల్లాలో దీర్ఘకాలిక నీటి భద్రత కోసం నాలుగు పద్ధతులను వివరించారు.వర్షపు నీటిని సంరక్షించడం, నదుల ప్రవాహ నిర్వహణను మెరుగుపరచడం, భూగర్భజలాల నీటి మట్టాన్ని పెంచడం, ప్రణాళిక బద్ధంగా జలాశయాల నీటి నిర్వహణ, సమర్థవంతమైన నదీ పరీవాహక నిర్వహణ కోసం పంటలు పర్యావరణ వ్యవస్థ లకు తేమ నిలుపుదల శాతాన్ని పెంచడం వంటి అంశాలపై దృష్టి సారిస్తున్నట్లు తెలిపారు.జిల్లా స్థాయిలో నీటిపారుదల, తాగునీరు, ఆరోగ్యం మరియు పర్యావరణ నిర్వహణలోని అంతరాల నిర్మూలన, వికేంద్రీకృత మురుగునీటి శుద్ధి వ్యవస్థ, చిత్తడి నేలల పునరుద్ధరణ, చెక్-డ్యామ్‌లు, బిందు సేద్యం మరియు ఖచ్చితమైన వ్యవసాయ పద్ధతులు మరియు భూగర్భ జలాల పునరుద్ధరణ వంటి అంశాల అమలు, వ్యవసాయం లో సమర్థవంతమైన నీటి వినియోగం వంటి కేంద్రీకృత మార్గాల ద్వారా పరిష్కరించ వచ్చునని వివరించారు.నీటిపారుదల, గ్రామీణాభివృద్ధి,వ్యవసాయం, అడవులు మరియు పట్టణ స్థానిక సంస్థలలో శాఖా పరంగా బలోపేతం చేయడం, సమర్థవంతమైన వినియోగంపై నీటి నిర్వహణ ఆధారపడి ఉంటుందని ఆయన స్పష్టం చేశారు.ఇది సాధ్యమవ్వడానికి ఒక డిస్ట్రిక్ట్ వాటర్ గవర్నెన్స్ కమిటీని మరియు డిస్ట్రిక్ట్ పిఎమ్‌యు(ప్రాజెక్ట్ మేనేజ్మెంట్ యూనిట్)ని ఏర్పాటు చేయాలని ఈ సదస్సులో జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి ప్రతిపాదించారు.ఈ ఇంటిగ్రేటెడ్ ఫోర్ వాటర్ విధానం జిల్లాల లో సమర్థ వంతంగా అమలు ద్వారా సంపూర్ణ, సుస్థిరాభివృద్ధి ఆధారిత నీటి నిర్వహణ కు మార్గదర్శకం గా నిలుస్తుందని వివరించారు.

# అభివృద్ధి కార్యక్రమాల ప్రగతి నివేదికలు సిద్ధం చేయండి: జిల్లా జాయింట్ కలెక్టర్ అదితి సింగ్

కడప, డిసెంబర్ 12(భారత శక్తి): జిల్లాలో అన్ని శాఖలకు సంబంధించి ప్రభుత్వం చేపడుతున్న అన్ని అభివృద్ధి కార్యక్రమాల ప్రగతి నివేదికలను సిద్ధం చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ అదితి సింగ్ అన్ని శాఖల జిల్లా అధికారులను ఆదేశించారు.

రాష్ట్ర సచివాలయం నుండి సానుకూల ప్రజా దృక్పథం, ఏజెంట్ స్పేస్ కోసం డాక్యుమెంట్ అప్‌లోడ్, ఎన్టీఆర్ భరోసా, దీపం గ్యాస్, రేషన్ సరఫరా, వరి ధాన్యం కొనుగోలు, ప్రజా రవాణా సేవలు, రిజిస్ట్రేషన్ సర్వీసులు తదితర అంశాలపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి స్థానిక కలెక్టరేట్ బోర్డు మీటింగ్ హాలు నుండి జిల్లా జాయింట్ కలెక్టర్ అదితి సింగ్ హాజరయ్యారు.

సిఎస్ వీసీ ముగిసిన అనంతరం సంబందిత అధికారులతో జేసీ మాట్లాడుతూ... రాష్ట్ర ముఖ్య కార్యదర్శి సూచనల మేరకు జిల్లాలో ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, ప్రత్యేక అమలు కార్యక్రమాలతో పాటు.. ప్రధానంగా పారదర్శకంగా పిజిఆర్ఎస్ అమలు, గ్యాస్ సరఫరాలో డెలివరీ బాయ్స్ కమీషన్లను అరికట్టే చర్యలు, ప్రజా రవాణా వ్యవస్థలో ప్రయాణీకులకు సంతృప్తికరమైన సేవలు అందించడం తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఈ నెల 15వ తేదీ నాటికి జిల్లాలో అన్ని రంగాల్లో జరిగిన, జరుగుతున్న అభివృద్ధిపై ప్రగతి నివేదికలను సిద్ధం చేయాలని అన్ని శాఖల అధికారులను ఆదేశించారు.

అలాగే.. ప్రజారోగ్యం, పారిశుద్ధ్యం, సంక్షేమ హాస్టళ్లలో మెరుగైన సదుపాయాలు, మాదకద్రవ్యాల నిరోధం, గ్రామవార్డు సచివాలయాల్లో సేవల మెరుగు.. తదితర అంశాలపై క్షేత్రస్థాయిలో అధికారులు పర్యవేక్షించాలన్నారు. ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల అమలుపై క్రమం తప్పకుండా మీటింగ్స్ నిర్వహించాలన్నారు.

కార్యక్రమంలో సీపీవో హాజరతయ్య, సంబందిత శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.




# రానున్నది బిఆర్ఎస్ ప్రభుత్వమే: ఎమ్మెల్యే చింత ప్రభాకర్



సంగారెడ్డి, భారత శక్తి ప్రతినిధి, డిసెంబర్ 12:

రెండు సంవత్సరాల తరువాత ప్రజల ఆశీర్వాదంతో మన ప్రభుత్వమే,తిరిగి రానుందని సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ అన్నారు.తాజాగా ఎన్నికైన నూతన సర్పంచ్‌లు సంగారెడ్డి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా ఎమ్మెల్యే చింత ప్రభాకర్ ని కలిశారు. నూతనంగా ఎన్నికైన సర్పంచ్ లకు ఎమ్మెల్యే చింత ప్రభాకర్ శుభాకాంక్షలు తెలిపారు. వారిని శాలువాతో సన్మాంచి పుష్ప గుచ్చం అందజేశారు.ఎమ్మెల్యే ను ఆయా గ్రామాల నూతన సర్పంచులు వెల్టూర్, గిర్మాపూర్, బొబ్బిలి గామ, అనంతసాగర్, ఏటిగాడ్డ సంఘం, ముందేవునిపల్లి, శివన్న గూడెం కలిశారు.ప్రతి ఒక్కరూ అద్భుతంగా పని చేసి బి ఆర్ ఎస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులను గెలిపించుకోవడంపై వారిని ఎమ్మెల్యే అభినందించారు. ప్రజల సమస్యల పరిష్కారానికి తమ ప్రభుత్వం కట్టుబడి పని చేసిన విధానమే తిరిగి విజయం సాధించేందుకు దోహదం చేస్తుందని ఎమ్మెల్యే చింత ప్రభాకర్ పేర్కొన్నారు.త్వరలో జరగబోయే ఎన్నికల్లో భారీ మెజారిటీతో తిరిగి ప్రభుత్వాన్ని స్థాపించనున్నామని తెలిపారు.ప్రజల ఆశీర్వాదమే మాకు బలం.రానున్నది మన ప్రభుత్వమే అని వారు ధీమా వ్యక్తం చేశారు.గ్రామాల అభివృద్ధికి తన పూర్తి మద్దతు సహకారం ఉంటుందని ఎమ్మెల్యే భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ సీడీసీ చైర్మన్ కాసాల బుచ్చిరెడ్డి, మాజీ జడ్పీటీసీ కొండల్ రెడ్డి, వివిధ గ్రామాల సర్పంచ్ లు పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

# ఆశీర్వదించండి దోడర్న గ్రామ అభివృద్ధి చేస్తా సర్పంచ్ అభ్యర్థి సావిత్ర భాయి




ఉమ్మడి అదిలాబాద్ జిల్లా బ్యూరో, డిసెంబర్ 12 ( భారత శక్తి): కుబీర్ మండలంలోని డోదర్న (విలేజ్) గ్రామ అభివృద్ధి కొరకై ఉంగరం గుర్తుకే ఓటువేసి జాదవ్ సావిత్ర బాయి ని ఉంగరం గుర్తుకు ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని ఆమె కోరారు.జాదవ్ సావిత్ర బాయి విలేకరులతో మాట్లాడుతూ డోదర్న (విలేజ్) గ్రామాన్ని ఆదర్శంగా తీర్చి దిద్దడమే తన లక్ష్యమని సర్పంచ్ అభ్యర్థి అన్నారు. డోదర్న గ్రామపంచాయతీ లోని ఇంటింటికి తిరిగి ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ..... గ్రామంలో నెల కొన్నసమస్యలను పరిష్కరించి గ్రామం లోని విద్య, వ్యవసాయం, తాగు నీరు, పచ్చదనం, పరిశుభ్రత, విద్యుత్ దీపా లు, మురికి కాలువల నిర్మాణం, సీసీ రోడ్ల నిర్మాణం చేసి గ్రామాల్లో మౌలిక సదుపా యాల కృషి చేస్తానని పేర్కొన్నారు. ముఖ్యంగా రైతులకు చేన్లకు వెళ్లేందుకు రహదారుల ఏర్పాటుకు కృషి చేస్తానని పేర్కొన్నారు. అంతేకాకుండా విద్య, మహిళా సాధికారతతో పాటు ప్రభుత్వ సంక్షేమ పథకాలను సైతం అర్హులైన పేదలకు అందెలా తనవంతు కృషి చేస్తానని పేర్కొన్నారు. అంతే కాకుండా గ్రామంలో అర్హులైన వారికి పింఛన్లతో పాటు గ్రామంలోని ప్రధాన కూడలిలో సీసీ కెమెరాల ఏర్పాటుకు తనవంతుగా కృషి చేస్తానన్నారు. నిరుద్యోగ యువ తకు నైపుణ్యాభివృద్ధి శిక్షణకు సహకరిస్తాను. గ్రామస్థులందరి సహ కారంతో గ్రామాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దడమే తన సంకల్పమన్నారు. సర్పంచ్ కుర్చీ కోసం తన ఆరాటం కాదని ఊరు అభి వృద్ధి కోసమే తన పోరాటమన్నారు. ఉంగరం గుర్తుకు ఓటు వేసి ఆశీర్వదించి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు.

# గీతంలో రక్షణ సాంకేతికతలో పురోగతి'పై చర్చాగోష్ఠి


GITAM
DEEMED TO BE UNIVERSITY

## - ఈనెల 18-19 తేదీలలో నిర్వహణ
## - ముఖ్య అతిథిగా ఐఐటీహెచ్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ డైరెక్టర్

సంగారెడ్డి, భారత శక్తి ప్రతినిధి, డిసెంబర్ 12 :

హైదరాబాదులోని గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీలోని ఈనెల 18-19 తేదీలలో అంతరిక్ష శాస్త్రం, రక్షణ సాంకేతికతలో పురోగతి అనే అంశంపై రెండు రోజుల జాతీయ చర్చాగోష్ఠిని నిర్వహిస్తున్నారు. ఈ విషయాన్ని కార్యక్రమ నిర్వాహకురాలు (కన్వీనర్) ప్రొఫెసర్ ప్రీతి అంబరీష్ పర్వేకర్ శుక్రవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో వెల్లడించారు. అంతరిక్ష శాస్త్రం, రక్షణ సాంకేతిక పరిజ్ఞానాలలో ఉద్భవిస్తున్న ధోరణులు, ఆవిష్కణలు, సహకార అవకాశాలను చర్చించడానికి నిపుణులు, పరిశోధకులు, విద్యావేత్తలను ఒకచోట చేర్చడం లక్ష్యంగా పెట్టుకున్నట్టు ప్రొఫెసర్ ప్రీతి వివరించారు.ఐఐటీ హైదరాబాదులోని డీఆర్ డీవో-పరిశ్రమ-విద్యా సంస్థ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ (డీఐఏ సీవోఈ) డైరెక్టర్ డాక్టర్ జి. రామగురు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరవుతారని తెలియజేశారు. ఈ సెమినార్ ప్రారంభోత్సవంలో గీతం హైదరాబాదు అదనపు ఉప కులపతి ప్రొఫెసర్ డీ.ఎస్. రావు, గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ డైరెక్టర్, కోర్ ఇంజనీరింగ్ డీన్ ప్రొఫెసర్ వి. రామశాస్త్రి తదితరులు పాల్గొంటారని ఆమె పేర్కొన్నారు.ఈ సెమినార్ ను ఏరోస్పేస్ ఇంజనీరింగ్ విభాగాధిపతి డాక్టర్ ఎండీ. అక్తర్ ఖాన్ సమన్వయం చేస్తారని కన్వీనర్ తెలిపారు.

# పునర్ శ్రవణ ప్రాప్తిరస్తు



కాక్లియర్ ఇంప్లాంట్. అత్యంత విజయవంతమైన వైద్య ఆవిష్కరణల్లో ఒకటి. బ్రహ్మ చెవుడు గలవారికి తిరిగి వినికిడిని రప్పించటంలో.. మాటలను అర్థం చేసుకోవటానికి, చుట్టుపక్కల ప్రపంచంతో మమేకం కావటంలో ఎంతగానో తోడ్పడుతోంది. ఒకప్పటికన్నా ఇప్పుడు ఇంప్లాంట్స్ అధునాతన రూపం సంతరించుకున్నాయి. రాన్రానూ వినూత్న సాంకేతిక పరిజ్ఞానంతో అభివృద్ధి చెందుతూ వస్తున్నాయి. వీటి అమరిక అవసరమైనవారి పరిధి సైతం విస్తరిస్తోంది. ఫలితంగా ఇప్పుడు కాక్లియర్ ఇంప్లాంట్ శస్త్రచికిత్స వయసుతో నిమిత్తం లేకుండా.. శిశువుల దగ్గరి నుంచి వృద్ధుల వరకూ ఎందరికో పునర్ శ్రవణ భాగ్యాన్ని ప్రసాదిస్తోంది. దీనిపై సమగ్ర కథనం ఈవారం మీకోసం.

మనం అప్రయత్నంగా శబ్దాలను వింటుంటాం గానీ ఇదో సంక్లిష్ట ప్రక్రియ. ఇందుకోసం చెవిలో పెద్ద తతంగమే నడుస్తుంది. బయటి చెవి నుంచి వచ్చే శబ్దాలకు కర్ణభేరి స్పందించటంతో వినికిడి ప్రక్రియ మొదలవుతుంది. కర్ణభేరి కంపించగానే మధ్య చెవిలోని మూడు గొలుసు ఎముకలూ ప్రకంపిస్తాయి. వీటిల్లో చివరి ఎముక లోపలి చెవిలోని వర్తులాకార గొట్టం (కాక్లియా)తో అనుసంధానమవుతుంది. ఈ కాక్లియాలోని ద్రవంలో రోమకణాలు తేలియాడుతూ ఉంటాయి. కర్ణభేరి, గొలుసు ఎముకల కంపనాలకు ద్రవంలో సున్నితమైన అలలు లేస్తాయి. అప్పుడు రోమకణాలు ఊగటం, వీటి నుంచి విద్యుత్ ప్రచోదనాలు ఉత్పత్తి కావటం, అవి శ్రవణ నాడి ద్వారా మెదడుకు చేరుకోవటం, శబ్దాన్ని విన్న అనుభూతి కలగటం అంతా ఒక క్రమపద్ధతిలో సాగుతుంది. ఇందులో ఎక్కడ సమస్య తలెత్తినా వినికిడి లోపిస్తుంది. అయితే లోపలి చెవి సమస్యలు చికిత్సకు ఒక పట్టాన లొంగవు. ఇక్కడే కాక్లియర్ ఇంప్లాంట్ ఆదుకుంటుంది. ఇది వినికిడి సాధనాలతో ఫలితం లేనివారికి అద్భుత వరంగా పనిచేస్తుంది.

ఎలా పనిచేస్తుంది?

కాక్లియర్ ఇంప్లాంట్‌ను కొందరు వినికిడి సాధనమని భావిస్తుంటారు. వినికిడి సాధనాలు శబ్దాల తీవ్రతను మాత్రమే పెంచుతాయి. కానీ కాక్లియర్ ఇంప్లాంట్ అలా కాదు. వినికిడికి మూలమైన శ్రవణనాడిని ప్రేరేపించి, శబ్దాలు వినిపించేలా చేస్తుంది. ఇది రెండు భాగాలుగా ఉంటుంది. రిసీవర్ స్టిమ్యులేటర్ భాగాన్ని చెవి వెనకాల ఆపరేషన్ చేసి, లోపల అమరుస్తారు. దీనికి గల ఎలక్ట్రోడ్ తీగలను కర్ణభేరి కింది నుంచి, కాక్లియాలోకి ప్రవేశపెడతారు. మైక్రోఫోన్, స్పీచ్ ప్రాసెసర్, ట్రాన్స్‌మిటర్‌తో కూడిన రెండో భాగాన్నేమో చెవి వెనకాల బయట అమరుస్తారు. లోపలి, వెలుపలి భాగాలు రెండూ వీటిల్లోని అయస్కాంతం సాయంతో పట్టుకొని ఉంటాయి. వెలుపలి భాగంలోని మైక్రోఫోన్ గ్రహించిన ధ్వనులు సంకేతాలుగా మారి, లోపల అమర్చిన భాగానికి ప్రసారమవుతాయి. ఇవి విద్యుత్ ప్రచోదనాలుగా మారి, ఎలక్ట్రోడ్ తీగ ద్వారా క్లాకియాలోకి చేరతాయి. అప్పుడు శ్రవణ నాడీ కణాలు ప్రేరేపితమై ఆ సమాచారాన్ని మెదడుకు పంపిస్తాయి. వీటిని మెదడు విశ్లేషించి, ధ్వని రూపంలో వినిపిస్తుంది.

చెవి భాగంలో మత్తుతోనే

శిశువులకు, చాలామంది పిల్లలకు ఇప్పటికీ జనరల్ అనస్థీషియాతో చేసే శస్త్రచికిత్సే ప్రామాణికం. అయితే ఇప్పుడు పెద్దవారిలో కొందరికి చెవి వెనక భాగానికి మాత్రమే లోకల్‌గా మత్తు ఇచ్చి శస్త్రచికిత్స చేయటమూ సాధ్యమవుతోంది. గుండె, ఊపిరితిత్తి, కిడ్నీ, కాలేయ జబ్బుల వంటివి గలవారికి మత్తుమందుతో ముడిపడిన దుష్ప్రభావాలు తగ్గటానికి, త్వరగా కోలుకోవటానికిది ఉపయోగపడుతుంది. (మేం తొమ్మిదేళ్ల క్రితమే తొలిసారిగా లోకల్ అనస్థీషియాతో ఒకే ఊపిరితిత్తి గల వ్యక్తికి కాక్లియర్ ఇంప్లాంట్ శస్త్రచికిత్స చేశాం. ఇప్పటివరకూ జనరల్ అనస్థీషియా ఇవ్వటం కుదరని 30 మందికి ఈ పద్ధతిని అనుసరించాం. మనదేశంలో లోకల్ అనస్థీషియాతో ఇంత ఎక్కువ సంఖ్యలో కాక్లియర్ ఇంప్లాంట్ అమర్చటం మరెక్కడా లేదు. ఒకరికి ఒకేసారి రెండు చెవుల్లోనూ ఇంప్లాంట్ అమర్చాం కూడా).

ముప్పులు తక్కువే

కాక్లియర్ ఇంప్లాంట్ శస్త్రచికిత్సతో పెద్దగా ముప్పులేవీ ఉండవనే చెప్పాలి. చాలా అరుదుగా ఇన్‌ఫెక్షన్ రావొచ్చు. కొందరికి పరికరం విఫలం కావొచ్చు. శస్త్రచికిత్సకు ముందు మెదడుపొర వాపు రాకుండా న్యూమోవాక్, హిబ్ టీకాలు తీసుకోవటం తప్పనిసరి.

ఎవరికి అవసరం?

పుట్టుకతో గానీ మాటలు వచ్చిన తర్వాత గానీ వినికిడి లోపించిన పిల్లలకు, పెద్దలకు.

రెండు చెవుల్లోనూ తీవ్రమైన వినికిడిలోపం గలవారికి (ప్యూర్‌టోన్ ఆడియో పరీక్షలో సగటున 70-80 డెసిబెల్స్‌కు మించి లోపం ఉన్నవారికి).

వినికిడి సాధనాలతో అంతగా ఫలితం కనిపించనివారికి.

పదాలను 50-60%, అంతకన్నా ఎక్కువగా గుర్తించలేనివారికి.

వాక్యాలను 40-60%, అంతకన్నా ఎక్కువగా పసిగట్టలేనివారికి

రణగొణధ్వనుల మధ్య మాటలు సరిగా వినిపించనివారికి

వినికిడి సాధనాల తీవ్రతను పూర్తిస్థాయిలో పెంచినా ఫలితం లేనివారికి

శ్రవణనాడి దెబ్బతినటం వల్ల హఠాత్తుగా వినికిడిలోపం తలెత్తినా లేదా క్రమంగా పెరుగుతూ వస్తూ మందులతో ప్రయోజనం కలగనివారికి

త్వరగా అమర్చితే మరింత ప్రయోజనం

వినికిడిలోపాన్ని గుర్తిస్తే.. ముఖ్యంగా శిశువులకు, పిల్లలకు వీలైనంత త్వరగా కాక్లియర్ ఇంప్లాంట్ అమర్చితే మంచి ప్రయోజనం కనిపిస్తుంది. ప్రస్తుతం నవజాత శిశువులకు వినికిడి పరీక్ష చేయిస్తున్నందున ముందుగానే వినికిడిలోపాన్ని గుర్తించటమూ సాధ్యమవుతోంది. కొద్ది వారాల వయసులోనే సమస్య బయటపడుతోంది. తీవ్ర వినికిడిలోపం ఉన్నట్టు తేలితే 6-12 నెలల్లోనే కాక్లియర్ ఇంప్లాంట్ అమర్చాలని అంతర్జాతీయ మార్గదర్శకాలు సూచిస్తున్నాయి. మెదడుపొర వాపుతో కాక్లియా దెబ్బతింటే ఇంకాస్త ముందుగానే అమర్చాలనీ చెబుతున్నాయి. దీంతో మాటలు మామూలుగా వచ్చేలా చూసుకోవచ్చు. లేకపోతే మూగవారిగా మిగిలిపోయే ప్రమాదముంది. ఎందుకంటే మనం ఎదుటివారి మాటలను వినటం, వాటిని అనుకరించటం ద్వారానే మాట్లాడటం నేర్చుకుంటాం మరి. రెండేళ్ల వయసులోపు కాక్లియర్ ఇంప్లాంట్ సర్జరీ చేసిన పిల్లలకు మాటలు బాగా వస్తున్నట్టు అధ్యయనాలు, అనుభవాలు సూచిస్తున్నాయి. అందరిలా బడికి వెళ్లి చదువుకోవచ్చు. ఇతరులతో మాట్లాడే నైపుణ్యాలూ మెరుగవుతాయి. మాటలు రావటానికి ముందు.. అంటే 1-6 ఏళ్ల పిల్లలకు వినికిడి సాధనాలతో ప్రయోజనం కనిపించకపోతే, వీలైనంత త్వరగా కాక్లియర్ ఇంప్లాంట్ అమర్చటమే మంచిది. అనంతరం రెండేళ్ల పాటు మాటలను వినిపించి, అర్థం చేసుకోవటానికి ఇచ్చే చికిత్స (ఏవీటీ) అవసరమవుతుంది.

మాటలు వచ్చిన తర్వాత వినికిడిలోపం తలెత్తిన పిల్లలకైతే (5-6 ఏళ్ల వయసులో)- మాటలు రాకముందు వినికిడి లోపించినవారితో పోలిస్తే వీరికి కాక్లియర్ ఇంప్లాంట్‌తో మరింత ఎక్కువ ఫలితం కనిపిస్తుంది. అప్పటికే శ్రవణ సంబంధ జ్ఞాపకం ఉండటం వల్ల త్వరగా పరికరానికి అలవాటు పడతారు. 3-6 నెలల్లోపే ఫోన్‌లో మాట్లాడగలిగే స్థితికి చేరుకుంటారు. మామూలుగా నలుగురితో మాట్లాడే సామర్థ్యం త్వరగా అబ్బుతుంది.

పెద్దవారికైతే- దీర్ఘకాలంగా వినికిడి లోపిస్తే.. ముఖ్యంగా శక్తిమంతమైన డిజిటల్ వినికిడి సాధనాలు పెట్టుకున్నా శబ్దాలు వినపడనివారికి కాక్లియర్ ఇంప్లాంట్స్ ఎంతో మేలు చేస్తాయి. శబ్దాలు స్పష్టంగా వినిపించేలా చేయటం ద్వారా ఇతరుల మీద ఆధారపడటాన్ని తగ్గిస్తున్నాయి. ఆత్మ విశ్వాసం, నలుగురితో సంబంధ బాంధవ్యాలు పెరగటానికి తోడ్పడుతున్నాయి. రోజువారీ పనులు హాయిగా చేసుకోవటం, భావోద్వేగ పరంగా స్థిరంగా ఉండటం సాధ్యమవుతుంది. చెవిలో మోత గలవారికి సమస్య తగ్గుముఖం పడుతుంది. అయితే కాక్లియర్ ఇంప్లాంట్ ఫలితాలు సమయానికి శస్త్రచికిత్స చేయటం, తగిన పరికరాన్ని ఎంచుకోవటం, అమర్చిన అనంతరం తీసుకునే మాటలను అర్థం చేయించే చికిత్స మీద ఆధారపడి ఉంటాయని గుర్తుంచుకోవాలి.

# గొంతుకు తేనె హాయి



గొంతునొప్పి, గరగరతో బాధపడుతున్నారా? అయితే తేనె తాగి చూడండి. గొంతు సమస్యల కోసం ప్రాచీనకాలం నుంచీ చిట్కా వైద్యంగా దీన్ని వాడుతూ వస్తున్నారు. ఇదెలా పనిచేస్తుందో శాస్త్రీయంగానూ రుజువైంది కూడా.

తేనెలో సహజ చక్కెర ఉంటుంది. ఇది నోటిని తీపి చేయటమే కాకుండా గొంతునొప్పి, జలుబు, ఫ్లూ లక్షణాలు తగ్గటానికి తోడ్పడుతుండటం ఆశ్చర్యకరం. దీనికి కారణం తేనెటీగలు పువ్వుల నుంచి సేకరించిన మకరందమే. ఇందులో చక్కెర మాత్రమే కాదు.. తక్కువ మోతాదులో ఎంజైమ్‌లు, విటమిన్లు, ఖనిజ లవణాల వంటివీ ఉంటాయి. తేనెను తీసుకున్నప్పుడు ఇవీ ఒంట్లోకి చేరతాయి. ఇదెలా పనిచేస్తుందంటే..

వాపు తగ్గుముఖం: తేనెలో రుచికారకాలు (ఫ్లేవనాయిడ్లు) ఉంటాయి. ఇవి ఒకరకం వృక్ష రసాయనాలు. వీటిల్లో వాపును తగ్గించే గుణాలుంటాయి. అందువల్ల గొంతునొప్పి ఉన్నప్పుడు కొద్దిగా తేనె తీసుకుంటే వాపు తగ్గి, కాస్త ఉపశమనం కలుగుతుంది.

సూక్ష్మక్రిములతో పోరాటం: తేనెలోని ఫ్లేవనాయిడ్లకు బ్యాక్టీరియా, వైరస్ భరతం పట్టే గుణమూ ఉంది. ఇవి రోగనిరోధకశక్తికి దన్నుగా నిలిచి హానికారకాలతో పోరాడటానికి తోడ్పడతాయి. అలాగని ఇది మందులకు ప్రత్యామ్నాయం కాదు. గొంతునొప్పి మరీ ఎక్కువగా వేధిస్తుంటే తగు చికిత్స తీసుకోవాల్సిందే.

గొంతు సాఫీగా: తేనె చిక్కగా, జిగురుగా ఉంటుంది. ఇది గొంతు లోపలి పొర మీద పూతలా పరచుకొని రక్షణగా నిలుస్తుంది. ఫలితంగా చిరాకు, గరగర తగ్గుతాయి. తేలికగా మింగటానికి తోడ్పడుతుంది.

దగ్గు నుంచి ఉపశమనం: గొంతుకు హాయినిచ్చే గుణాలు దగ్గు తగ్గటానికీ సాయం చేస్తాయి. దుకాణాల్లో అమ్మే దగ్గు మందుల కన్నా తేనె మరింత ఎక్కువ సమర్థంగా పనిచేస్తున్నట్టు.. ముఖ్యంగా రాత్రిపూట వేధించే దగ్గు నుంచి ఉపశమనం కలిగిస్తున్నట్టు పరిశోధనలు చెబుతున్నాయి.

ఎలా తీసుకోవాలి?

ఒకట్రెండు చెంచాల తేనె నేరుగా తీసుకోవచ్చు.

గోరువెచ్చటి నీటిలో నిమ్మరసం, తేనె కలిపి అయినా తీసుకోవచ్చు.

గ్రీన్ టీ, పుదీనా టీ వంటి వాటిల్లోనైనా కలిపి తాగొచ్చు.

# చెవి గులిమి తీయాల్సిందేనా?

%గులిమి తీస్తేనే చెవులు శుభ్రంగా ఉంటాయని కొందరు భావిస్తుంటారు. ఇది నిజం కాదు. చాలామందికి దానంతటదే బయటకు వస్తుంది. చెవి మార్గంలోని ప్రత్యేక చర్మం గులిమిని బయటకు తోస్తూ, ఎప్పటికప్పుడు శుభ్రం చేస్తుంది. అందువల్ల తీయాల్సిన పనిలేదు. చెవి మార్గం ముందుభాగంలోని వెంట్రుకలు, సెబేషియస్ గ్రంథుల నుంచి వెలువడే స్రావాలతో గులిమి తయారవుతుంది. ఇది లోపలి భాగాన్ని తడిగా ఉంచుతూ, మార్గం ఎండిపోకుండా చూస్తుంది. దుమ్ము, ధూళి, బ్యాక్టీరియా, క్రిముల వంటివి లోనికి వెళ్లకుండా అడ్డుకుంటుంది. మృతకణాలు, వ్యర్థాలను తనలో కలిపేసుకుంటుంది. అంటే చెవికి సహజ రక్షణ కవచంగా నిలుస్తుందన్నమాట. కొందరికిది ఎక్కువగా తయారవ్వచ్చు. కొందరికిది చాలా జిగురుగా, మరికొందరికి గట్టిగానూ ఉండొచ్చు. ఏదేమైనా దీన్ని ప్రత్యేకించి తీయాల్సిన అవసరం లేదు. అగ్గిపుల్లలు, పిన్నీసులు, కాటన్ బడ్స్ వంటివి చెవిలో పెట్టి తిప్పితే గులిమి ఇంకా లోపలికి పోయే ప్రమాదముంది. చెవిలోని చర్మం, కర్ణభేరి దెబ్బతినొచ్చు. చెవి ఇన్‌ఫెక్షన్ కూడా తలెత్తొచ్చు. చాలాతక్కువ (5%) మందిలో గులిమి లోపల పోగవ్వచ్చు. వీరిలో 1-2% మందికి గట్టి పడి, చెవి మార్గం నిండిపోవచ్చు. ఇలాంటివారికే గులిమి తీయాల్సి వస్తుంది. అదీ ఈఎన్‌టీ నిపుణులతోనే తీయించుకోవాలి. వీరికి ముందుగా వారం పాటు రోజుకు మూడు సార్ల చొప్పున చెవిలో చుక్కల మందు లేదా గోరువెచ్చగా చేసి చల్లార్చిన ఆలివ్ నూనె వంటివి వేస్తారు. గులిమి మెత్తబడ్డాక మైక్రోస్కోపిక్ వ్యాక్యూమ్ సక్షన్‌తో జాగ్రత్తగా బయటకు తీస్తారు. కొన్నిచోట్ల చెవిలోకి సిరంజితో నీటిని బలంగా పంపించి, గులిమి బయటకు వచ్చేలా చేస్తుంటారు. ఇది సురక్షితం కాదు. దీంతో కొన్నిసార్లు కర్ణభేరి దెబ్బతినొచ్చు. అప్పటికే కర్ణభేరికి రంధ్రం ఉన్నట్టయితే హానికారకాలు లోపలి చెవికి చేరుకొని ఇన్‌ఫెక్షన్, నొప్పి, చీము కారటం వంటివి తలెత్తే ప్రమాదమూ ఉంటుంది.



# పన్ను తీసేస్తే కంటికి దెబ్బా?

పళ్లు తొలగిస్తే కళ్లు దెబ్బతింటాయనీ, చూపు తగ్గుతుందనీ చాలామంది నమ్ముతుంటారు. నాడులకు, మెదడుకు నష్టం కలుగుతుందని భావిస్తుంటారు. ఇది పూర్తిగా అపోహే. పంటికి, కంటికి ఎలాంటి సంబంధమూ లేదు. కింది పళ్లు కావొచ్చు, పై పళ్లు కావొచ్చు.. వేటిని తొలగించినా కళ్లకు గానీ ఇతర అవయవాలకు గానీ ఎలాంటి నష్టమూ కలగదు. పిల్లల్లో దంతాల అమరికను సరిచేయటానికి క్లిప్స్ వేసే సమయంలో ఎగుడు దిగుడుగా ఉన్నవాటిని కొన్నిసార్లు తొలగిస్తుంటారు కూడా. వీరిలో ఎవరికీ చూపు తగ్గిన ఉదంతాలు లేవు. కంటికి ఇబ్బంది కలిగినట్టు ఎక్కడా రిపోర్టు కాలేదు. పళ్లు, కళ్లు, ముఖంలోని నాడులు అన్నీ దగ్గరదగ్గరగా ఉండటం వల్ల పన్ను తీసేస్తే చూపు దెబ్బతింటుందనే అపోహ మొదలై ఉండొచ్చు. నిజానికి చూపును నియంత్రించే దృశ్యనాడి.. దంతాలకు, దవడలకు వెళ్లే నాడులు చాలా దూరంలో ఉంటాయి. ఇవి రెండూ పరస్పరం సమాచారమేమీ ఇచ్చిపుచ్చుకోవు. దంతాలను తొలగించినా వీటికి వచ్చిన ఇబ్బందేమీ లేదు. ఇక రక్తనాళాల విషయానికి వస్తే- నోరు, ముఖంలోని రక్తనాళాలు.. కంటి రక్తనాళాలు రెండూ వేటికవే ప్రత్యేకం. దంత చికిత్సలతో కొన్నిసార్లు ముఖం చుట్టూ ఉబ్బినా కళ్లకు రక్తాన్ని ప్రసారం చేసే నాళాలకు ఎలాంటి ఆటంకం కలగదు. అందువల్ల చూపునకు ఎలాంటి ప్రమాదమూ వాటిల్లదు. పళ్లకు, కళ్లకు మధ్య గాలిగదులు (సైనస్) ఉంటాయి. ఒకవేళ పన్ను తొలగించినప్పుడు ఏదైనా ఇన్‌ఫెక్షన్ తలెత్తితే అది తీవ్రమై గాలిగదులకు చేరుకోవచ్చు. అయినా కూడా అదేమీ కంటి కుహరానికి చేరుకోదు. ఇది చాలా పగడ్బందీగా, సురక్షితంగా ఉంటుంది. కాబట్టి ఎలాంటి ఇబ్బందీ ఉండదు. ఒకవేళ జ్ఞానదంతాలను తొలగించేటప్పుడు మత్తుమందు ఇచ్చే క్రమంలో సూది ఎప్పుడైనా నాడులకు తగిలితే తాత్కాలికంగా ముఖం మొద్దుబారినట్టు అనిపించొచ్చు. దీని మూలంగా కళ్లకు ఇబ్బంది కలుగుతున్నట్టు రుజువు కాలేదు. నిజానికి పళ్లు తొలగించుకోవాలని ఎవరూ కోరుకోరు. కానీ అవసరమైనప్పుడు తప్పదు. లేనిపోని అపోహలతో ఆలస్యం చేస్తే దంత ఇన్‌ఫెక్షన్ తీవ్రమై, చీము పట్టి చిగుళ్లు దెబ్బతినే ప్రమాదముందని గుర్తించాలి. ఏవైనా సందేహాలుంటే దంత వైద్యులను సంప్రదించి నివృత్తి చేసుకోవాలే తప్ప అపోహలతో వెనకా ముందూ ఆడుతూ తాత్సారం చేయరాదు.



# రూ.148 లక్షల కోట్లు గత అయిదేళ్లలో పెరిగిన మదుపర్ల సంపద



మనదేశంలో గత 30 ఏళ్లలో ఎన్నడూ లేనంత అధికంగా సంపద సృష్టి 2020-25లో జరిగినట్లు మోతీలాల్ ఓస్వాల్ 30వ వార్షిక 'వెల్త్ క్రియేషన్ స్టడీ' వెల్లడించింది. స్టాక్‌మార్కెట్లో నమోదైన కంపెనీల్లో, 100 అత్యుత్తమ కంపెనీలే రూ.148 లక్షల కోట్ల సంపదను సృష్టించినట్లు పేర్కొంది. ఈ నివేదిక ప్రకారం..

అత్యధికంగా, అత్యంత వేగంగా, స్థిరంగా సంపద సృష్టించిన కంపెనీల్లో భారతీ ఎయిర్‌టెల్, బీఎస్ఈ, హెచ్ఏఎల్ (హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్) అగ్రస్థానంలో ఉన్నాయి.

వివిధ వ్యాపార రంగాలను పరిశీలిస్తే ఆర్థిక సేవల్లో నిమగ్నమైన సంస్థలు అధికంగా సంపద సృష్టించాయి.

తదుపరి స్థానాల్లో పరిశ్రమలు, కేపిటల్ మార్కెట్స్, టెక్నాలజీ, యుటిలిటీస్ విభాగాల కంపెనీలున్నాయి.

ప్రభుత్వ రంగ సంస్థలు మళ్లీ వెలుగులోకి వస్తున్నాయి. ముఖ్యంగా రక్షణ, ఇంధన, యుటిలిటీస్ విభాగాల్లోని ప్రభుత్వ రంగ సంస్థలు మెరుగైన పనితీరు ప్రదర్శిస్తూ సంపద సృష్టిస్తున్నాయి.

### గత 20 ఏళ్లలో ఏటా 17%

ప్రపంచ వ్యాప్తంగా సంపద సృష్టి పెరుగుతోంది. మనదేశంలోనూ అదే జరుగుతోంది. మనదేశంలో స్టాక్‌మార్కెట్లో నమోదైన కంపెనీల విలువ (మార్కెట్ కేపిటలైజేషన్) గత 20 ఏళ్లలో ఏటా 17% చొప్పున పెరగడం గమనార్హం. ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా చూస్తే, భారత్ నాలుగో అతిపెద్ద ఈక్విటీ మార్కెట్‌గా ఉంది. ఎన్ని అవాంతరాలు, అడ్డంకులు వచ్చినా దీర్ఘకాలంలో ఈక్విటీ మార్కెట్లు పెరుగుతూనే ఉన్నాయి. లలలలలల

### భారీ అవకాశాలు ముందున్నాయ్

ఈ అంచనాలపై మోతీలాల్ ఓస్వాల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ ఛైర్మన్ రామ్‌దేవ్ అగర్వాల్ స్పందిస్తూ, మనదేశంలో సంపద ఎంతగానో విస్తరించే తరుణంలో మనం ఉన్నామని, మల్టీ ట్రిలియన్ డాలర్ (పలు లక్షల కోట్ల డాలర్ల) అవకాశాలు పెట్టుబడిదార్లకు లభిస్తాయని తెలిపారు. నాణ్యమైన వ్యాపార సంస్థల షేర్లపై పెట్టుబడి పెడితే, దీర్ఘకాలంలో సంపద సృష్టికి అవకాశం కలుగుతుందని అన్నారు. మార్కెట్ హెచ్చుతగ్గులకు కంగారు పడకుండా.. నాణ్యమైన కంపెనీల షేర్లను ఎంచుకోవడం ముఖ్యమని వివరించారు.


### ఈ నివేదిక ప్రకారం భవిష్యత్తులో సంపద సృష్టికి అనుకూలంగా కనిపిస్తున్న కంపెనీలు

ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్ (ఇండిగో), ఐషర్ మోటార్స్, హీరో మోటోకార్ప్, ఎంఅండ్ఎం, మారుతీ సుజుకీ, ఏయూ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్, ఎస్‌బీఐ, పాలీక్యాబ్ ఇండియా, కమిన్స్ ఇండియా, ఎల్ అండ్ టీ, వారీ ఎనర్జీస్, బీఎస్ఈ, హెచ్‌డీఎఫ్‌సీ ఏఎంసీ, మోతీలాల్ ఓస్వాల్ ఫైనాన్షియల్ సర్వీసెస్, ఎంసీఎక్స్, నువామా వెల్త్, ప్రుడెన్షియల్ కార్పొరేషన్, బ్లూస్టార్, ఎటర్నల్ ఇండియా, బజాజ్ ఫైనాన్స్, చోళమండలం ఇన్వెస్ట్‌మెంట్ అండ్ ఫైనాన్స్, గ్లోబల్ హెల్త్, నారాయణ హృదయాలయ, ఐసీఐసీఐ లాంబార్డ్, పీబీ ఫిన్‌టెక్, గోద్రేజ్ ప్రాపర్టీస్, లోధా డెవలపర్స్, భారతీ ఎయిర్‌టెల్.

### జీడీపీ గత 17 ఏళ్లలో 4 లక్షల కోట్ల డాలర్లకు

మన స్థూల జాతీయోత్పత్తి (జీడీపీ) గత 17 సంవత్సరాల్లో లక్ష కోట్ల డాలర్ల (సుమారు రూ.90 లక్షల కోట్ల) నుంచి 4 లక్షల కోట్ల డాలర్ల (సుమారు రూ.360 లక్షల కోట్ల)కు విస్తరించింది. వచ్చే 17 ఏళ్లలో... అంటే 2042 నాటికి 16 లక్షల కోట్ల డాలర్ల (సుమారు రూ.1440 లక్షల కోట్ల)కు చేరుకునే అవకాశం ఉన్నట్లు ఈ నివేదిక అంచనా వేసింది.

# అమ్మానాన్నలకు ఆరోగ్య బీమా



ఉన్నత చదువులు, ఉద్యోగాల కోసం యువత దూరప్రాంతాల్లో స్థిరపడటం ఈ రోజుల్లో సాధారణమే. ఇలా దూరంగా ఉన్నప్పుడు తల్లిదండ్రుల ఆరోగ్యం, వారికి ఏదైనా అత్యవసర వైద్య చికిత్స అవసరమైతే ఎలా అనే ఆందోళన పిల్లల్లో ఉంటుంది. తల్లిదండ్రుల కోసం ఆరోగ్య బీమా తీసుకోవడం ద్వారా వారి ఆరోగ్యానికి ఒక భరోసా కల్పించేందుకు వీలుంది. అంతేకాకుండా మీ పొదుపు మొత్తమూ వైద్య ఖర్చులకు చెల్లించాల్సిన అవసరం లేకుండా చూసుకోవచ్చు. ఇలా అమ్మానాన్నల కోసం ఒక పాలసీని తీసుకోవాలని భావించినప్పుడు కొన్ని ముఖ్యమైన విషయాలను గుర్తుంచుకోవాలి.

### తగినంత బీమా

వయసు మీద పడుతున్నకొద్దీ అనారోగ్య సమస్యలు వచ్చే అవకాశం పెరుగుతుంది. దీనికి తోడు వైద్య ఖర్చులు విపరీతంగా పెరుగుతున్నాయి. కాబట్టి, వైద్యపరమైన అత్యవసర పరిస్థితుల్లో ఆర్థిక ఇబ్బందులు రాకుండా ఉండాలంటే సమగ్రమైన పాలసీని, తగినంత బీమా మొత్తంతో తీసుకోవాలి. ఈ రోజు సరిపోతుంది అనిపించిన మొత్తం, కొన్నేళ్ల తర్వాత సరిపోదు. అందుకే, ద్రవ్యోల్బణాన్ని దృష్టిలో ఉంచుకొని, కనీసం రెండు మూడేళ్లకోసారి బీమా మొత్తాన్ని సరిచూసుకోవాలి. ఇప్పుడు చాలా పాలసీలు రీస్టోర్ ప్రయోజనంతో పాలసీలను అందిస్తున్నాయి. ఇలాంటి వాటికి కాస్త ప్రీమియం అధికంగా ఉంటుంది. అవసరాన్ని బట్టి, దీన్ని పరిశీలించుకోవచ్చు.

### ప్రత్యేకంగా..

కంపెనీలు అందించే పాలసీల్లో తల్లిదండ్రులకూ ఆరోగ్య బీమా ఉంటుంది. ఇది మంచిదే. కానీ, పూర్తిగా దీనిపైనే ఆధారపడకూడదు. వీరికి సొంతంగా ఒక పాలసీ తీసుకోవడమే ఉత్తమం. కొన్నిసార్లు ఉద్యోగం మారినప్పుడు మీరు చేరే కొత్త సంస్థ తల్లిదండ్రులకు పాలసీ అందించకపోవచ్చు. అలాంటప్పుడు ఇబ్బంది వస్తుంది. కొత్తగా పాలసీ తీసుకోవాలన్నా బీమా సంస్థ అంగీకరించకపోవచ్చు. కాబట్టి, తల్లిదండ్రులకు వీలైనంత వరకూ సొంత పాలసీని తీసుకోవడమే మంచిది. ఫ్యామిలీ ఫ్లోటర్ పాలసీలో భాగంగా తల్లిదండ్రులను, అత్తామామలను చేర్చుకునే పాలసీలు అందుబాటులో ఉన్నాయి. వీటిని పరిశీలించవచ్చు.

### నెట్‌వర్క్ ఆసుపత్రులు..

మీ ఇంటికి దగ్గరలో ఉన్న ఆసుపత్రులు మీ కంపెనీ నెట్‌వర్క్‌లో ఉన్నాయా లేదా చూసుకోవాలి. ఉన్న కంపెనీ నుంచే పాలసీ తీసుకోవడం మేలు. దీనివల్ల ఆసుపత్రిలో చేరినప్పుడు నగదు రహిత చికిత్సకు అవకాశం ఉంటుంది. కొన్నిసార్లు ఇంటి వద్దే ఉండి, చికిత్స తీసుకోవాల్సిన అవసరం రావచ్చు. మీరు తీసుకునే పాలసీ ఇంటి వద్ద చికిత్సకూ అనుమతించాలి.

### రైడర్లతో..

అనుబంధ పాలసీలను ఎంచుకోవడం ద్వారా అదనపు భరోసా లభిస్తుంది. ముఖ్యంగా ముందుస్తు వ్యాధులకు పాలసీ తీసుకున్న రోజు నుంచే రక్షణ లభించడం, టాపప్ పాలసీల్లాంటివి ఎంచుకోవాలి.

# విమానం రద్దయిందా?

ఇటీవలి కాలంలో దేశవ్యాప్తంగా వేలాది విమానాలు రద్దవ్వడం, ప్రయాణికులు విమానాశ్రయాల్లో వేచి చూడటం మనం చూశాం. ఇలా విమానాలు రద్దయినప్పుడు టికెట్ డబ్బులు వెనక్కి వస్తాయా? అసలు మనకున్న హక్కులేంటి? అనే సందేహాలు చాలామందిలో ఉన్నాయి. కేవలం టికెట్ డబ్బులు వెనక్కి తీసుకోవడమే కాకుండా, అదనంగా నష్టపరిహారం పొందే వీలూ ఉంది. ఈ నేపథ్యంలో విమాన ప్రయాణికులు తెలుసుకోవాల్సిన నిబంధనలేమిటో చూద్దాం..




భారతీయ పౌర విమానయాన నియంత్రణ సంస్థ (డీజీసీఏ) నిబంధనల ప్రకారం.. విమానయాన సంస్థ ముందస్తు సమాచారం లేకుండా కేవలం మీ ప్రయాణానికి 24 గంటల కంటే తక్కువ సమయంలో విమానం రద్దయినట్లు ప్రకటిస్తే.. కచ్చితంగా ప్రత్యామ్నాయ విమానాన్ని ఏర్పాటు చేయాలి. లేదా టికెట్ డబ్బును మొత్తం వాపసు ఇవ్వాలి. ఒకవేళ విమానయాన సంస్థ మీకు ముందస్తు సమాచారం ఇవ్వకుండా లేదా సరైన ప్రత్యామ్నాయం చూపించకపోతే.. టికెట్ డబ్బులతోపాటు, అదనంగా పరిహారం పొందే హక్కు మీకుంది.

మీ విమానం రద్దయినప్పుడు లేదా ఆలస్యమైనప్పుడు ప్రత్యామ్నాయ విమానం కోసం విమానాశ్రయంలో ఎదురుచూడాల్సి వస్తే.. మీకు ఉచితంగా ఆహారం, పానీయాలు అందించాలి. ఒకవేళ రాత్రిపూట వేచి ఉండాల్సి వస్తే వసతి సదుపాయం కల్పించాల్సిన బాధ్యత విమానయాన సంస్థదే.

చాలా సందర్భాల్లో విమానయాన సంస్థలు సాంకేతిక కారణాల వల్ల లేదా నిర్వహణ సమస్యల వల్ల విమానం రద్దయ్యిందని చెబుతుంటాయి. అందుకే, పరిహారం ఇవ్వడం సాధ్యం కాదని అంటాయి. కానీ, వినియోగదారుల కోర్టుల తీర్పుల ప్రకారం.. పైలెట్ల కొరత లేదా సంస్థ అంతర్గత లోపాలను అసాధారణ పరిస్థితులు, ప్రకృతి వైపరీత్యాలు వంటి కారణాలుగా పరిగణించలేం. సంస్థ లోపం వల్ల విమానం రద్దయితే, కచ్చితంగా పరిహారం కోరాలి.

చాలా క్రెడిట్ కార్డుల్లో టికెట్ బుక్ చేసుకునేటప్పుడే 'ట్రిప్ క్యాన్సిలేషన్ కవర్' ఉంటుంది. విమాన ప్రయాణంలో అంతరాయం కలిగినప్పుడు కార్డు రకాన్ని బట్టి రూ.25,000

నుంచి రూ.1 కోటి వరకూ బీమా రక్షణ కల్పిస్తున్నాయి.

మీరు టికెట్ కొనుగోలు చేసినప్పుడు వాడిన కార్డు బ్యాంకును సంప్రదిస్తే, ఈ కవర్ గురించి పూర్తి వివరాలు తెలుస్తాయి.

ప్రయాణ బీమా ఉంటే: మీకు ప్రయాణ బీమా ఉంటే.. విమానం రద్దయిన సందర్భాల్లో పరిహారం లభిస్తుంది. వసతి, భోజనం, ఇతర ఖర్చులనూ ఈ బీమా పాలసీ చెల్లిస్తుంది. దీన్ని తీసుకునేటప్పుడు ముందుగానే అన్ని నిబంధనలు తెలుసుకొని, ఎంచుకోండి. ప్రయాణం

6-7 గంటల ఆలస్యానికి కొన్ని బీమా సంస్థలు పరిహారం ఇవ్వడం లేదు.

### ఏం చేయాలి?

ముందుగా విమానయాన సంస్థ నోడల్ ఆఫీసర్‌కు లేదా కస్టమర్ కేర్‌కు మెయిల్ చేయండి. అందులో డీజీసీఏ నిబంధనలను ప్రస్తావిస్తూ పరిహారం కోరండి.

సంస్థ స్పందిచకపోతే కేంద్ర పౌర విమానయాన మంత్రిత్వ శాఖకు చెందిన ఎయిర్‌సేవా యాప్ లేదా పోర్టల్‌లో ఫిర్యాదు చేయండి. ఇది ఫిర్యాదుల పరిష్కారానికి సమర్థంగా పనిచేస్తుంది.

అప్పటికీ న్యాయం జరగకపోతే వినియోగదారుల కమిషన్‌ను ఆశ్రయించవచ్చు. డీజీసీఏ ఇచ్చే పరిహారం కేవలం నామమాత్రమే. విమాన రద్దు వల్ల మీ వ్యాపార ఒప్పందాలు రద్దయినా, వాయిదా పడినా, మానసిక వేదనకు గురైనా అదనపు పరిహారం కోసం వినియోగదారుల కోర్టులో కేసు వేయొచ్చు. ఇప్పుడు ఈ-దాఖిల్ ద్వారా ఆన్‌లైన్లోనే ఫిర్యాదు చేయవచ్చు.

మీ ప్రయాణం పూర్తయ్యే వరకూ టికెట్, బోర్డింగ్ పాస్, విమానయాన సంస్థ పంపిన సందేశాలను భద్రపరచుకోండి. అవే మీ న్యాయపోరాటానికి బలమైన సాక్ష్యాలు. మీ హక్కులను అడిగి తెలుసుకోవడంలో వెనుకాడవద్దు.

# సరైన బ్యాంకును ఎంచుకోండి

### పొదుపు ఖాతా

తొలిసారి ఉద్యోగంలో చేరినప్పుడు లేదా ఇంటికి దగ్గరగా ఉందని ఏదో ఒక బ్యాంకులో పొదుపు ఖాతా తీసుకుంటాం. డిజిటల్ బ్యాంకింగ్, మారుతున్న వడ్డీ రేట్ల నేపథ్యంలో మనం ఏ బ్యాంకును ఎంచుకుంటున్నాం అనే విషయంపై కాస్త శ్రద్ధ పెట్టడం ఇప్పుడు చాలా అవసరం. ముఖ్యంగా మీ బ్యాంకు ఖాతాలో ఎక్కువ మొత్తంలో నగదు నిల్వ ఉంచే అలవాటు ఉంటే, ఇది మరింత కీలకం అవుతుంది. మీ డబ్బుకు భద్రత ఉండాలి, అదే సమయంలో కొంత రాబడిని అందించేలా ఈ ఖాతా ఉండాలి.

పొదుపు ఖాతా ముఖ్య ఉద్దేశం ఎప్పుడు కావాలంటే అప్పుడు నగదును తీసుకునేందుకు వీలుండటం. కరెంటు బిల్లు కట్టడం, కిరణా సరకులు కొనడం, రోజువారీ ఖర్చులు చేయడంలాంటివి. కాబట్టి, మూడు నెలలకు సరిపోయే ఖర్చుల డబ్బును మాత్రమే అందులో ఉంచాలి. అంతకుమించి ఎక్కువ డబ్బును సేవింగ్స్ ఖాతాలో ఉంచడం వల్ల పెద్దగా లాభం ఉండదు. ఈ ఖాతాపై బ్యాంకులు ఇచ్చే వడ్డీ కేవలం 2.5శాతమే. కొన్ని బ్యాంకులు ఇంకా తక్కువగానూ ఇస్తున్నాయి.

వడ్డీ రేట్లతోపాటు బ్యాంకు విధించే ఛార్జీల గురించీ తెలుసుకోవాలి. కనీస బ్యాలెన్స్ లేకపోతే వేసే జరిమానాలు, ఏటీఎం ఛార్జీలు దీర్ఘకాలంలో భారమవుతాయి. మీ బ్యాంకు ఆన్‌లైన్, మొబైల్ బ్యాంకింగ్‌ను సులభంగా నిర్వహించేలా ఉడాలి. వినియోగదారుల సేవలు బాగుండాలి. చిన్న పనులకూ ఇబ్బంది పెట్టే బ్యాంకును ప్రధాన ఖాతా తీసుకునేందుకు ఎంచుకోవద్దు.

ఎక్కువ డబ్బును ఖాళీగా ఈ ఖాతాలో ఉంచొద్దు. ఉదాహరణకు మీ దగ్గర రూ.10లక్షల నుంచి రూ.50లక్షల వరకూ ఉంటే, దానిని పొదుపు ఖాతాలో ఉంచినప్పుడు మీరు చాలా నష్టపోతారు. ఆ డబ్బును వేరేచోట పెట్టుబడి పెడితే వచ్చే అధిక లాభాన్ని మీరు కోల్పోతున్నారని అర్థం. ఇలాంటప్పుడు అవసరానికి మించి ఉన్న డబ్బును ఫెక్లీ డిపాజిట్ ఖాతాలోకి మళ్లించడం మేలు.

మీ డబ్బుకు అధిక రాబడి, భద్రత కావాలనుకున్నప్పుడు ఫిక్స్‌డ్ డిపాజిట్లు ఉత్తమం. రాబోయే కొద్ది రోజుల్లో స్కూలు ఫీజులు చెల్లించడానికి, ఇల్లు నిర్మాణానికో దాచిన డబ్బును మంచి బ్యాంకులో ఎఫ్‌డీ చేయడం మంచిది. ఇప్పుడు కాస్త వడ్డీ రేట్లు తగ్గుతున్నాయి. కాబట్టి, ప్రత్యామ్నాయంగా డెట్ ఫండ్లను ఎంచుకోవచ్చు. అత్యవసరం అయితే ఇందులో నుంచి డబ్బు తీసుకోవడమూ సులభమే. లిక్విడ్ లేదా అల్ట్రా షార్ట్ టర్మ్ ఫండ్లు పెద్ద మొత్తంలో డబ్బును స్వల్పకాలానికి దాచుకునేందుకు ఉపయోగపడతాయి.

చాలామంది కొత్తగా బ్యాంకు ఖాతా ప్రారంభించేప్పుడు బ్యాంకులు ఇచ్చే 'వెల్కమ్ ఆఫర్లు' లేదా చిన్న వడ్డీ రేట్ల తేడాలనే చూస్తుంటారు. కానీ, అంతకన్నా ముందు ఆ బ్యాంకు ఎంత సురక్షితమైనది అనేది చూడాలి. మీ కష్టార్జితం, అత్యవసర నిధి ఉంచే బ్యాంకు ఎప్పుడూ నమ్మదగినదిగా ఉండాలి. ప్రభుత్వ రంగ బ్యాంకులు, పెద్ద ప్రైవేటు బ్యాంకులు సాధారణంగా ఆర్థికంగా బలంగా ఉంటాయి. వాటిలో నష్టభయమూ తక్కువ.



కొత్తగా వచ్చిన చిన్న బ్యాంకులు ఎక్కువ వడ్డీ ఇస్తుంటాయి. కానీ, మీ ప్రధాన ఖాతా ఎప్పుడూ పెద్ద బ్యాంకులో ఉండటమే శ్రేయస్కరం.



# ఆ ఒప్పందం రద్దు వెనక రో-కో?

భారత్‌లో ఐసీసీ టోర్నీలకు సంబంధించి మీడియా హక్కుల ఒప్పందం నుంచి జియో హాట్‌స్టార్ సంస్థ తప్పుకోవడం ఇటీవల చర్చనీయాంశం అయింది. భారత్‌లో క్రికెట్ మ్యాచ్‌ల ప్రసారం కోసం సంస్థలు ఎగబడటమే చూస్తుంటాం. కానీ ఇలా మధ్యలో ప్రసారదారు ఒప్పందం నుంచి తప్పుకోవడం అందరినీ ఆశ్చర్యానికి గురిచేసింది. ఇందులో పరోక్షంగా విరాట్ కోహ్లీ ( రోహిత్ శర్మల పాత్ర ఉందనే చర్చ జరుగుతోందిప్పుడు. మరి ఈ ఒప్పందం రద్దుకు, వారికి ఉన్న సంబంధమేంటి?

ప్రపంచంలో క్రికెట్‌కు అత్యధిక ఆదరణ ఉన్న దేశం భారత్ అని కొత్తగా చెప్పాల్సిన పని లేదు. ఇక్కడ క్రికెట్ మ్యాచ్‌లకు సంబంధించి ప్రసార హక్కుల కోసం ఎప్పుడూ విపరీతమైన పోటీ ఉంటుంది. ప్రపంచంలో ఐసీసీ (%×జజ%) ఈవెంట్లు ఎక్కడ జరిగినా భారత్‌లో వీక్షణలు భారీగానే ఉంటాయి. ఆ ఒప్పందాల విలువ ఎప్పటికప్పుడు పెరుగుతూ ఉంటుంది కూడా. గత ఏడాది జియో హాట్‌స్టార్ సైతం భారత్‌లో ఐసీసీ ఈవెంట్ల మీడియా హక్కుల కోసం మూడేళ్ల కాలానికి ఏకంగా 3 బిలియన్ డాలర్లు (సుమారు రూ.27 వేల కోట్లు) చెల్లించేలా అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ)తో ఒప్పందం చేసుకుంది. కానీ ఏడాదిన్నర తిరిగేసరికే ఆ ఒప్పందం నుంచి తప్పుకోవాలని జియో హాట్‌స్టార్ నిర్ణయించుకోవడం ఐసీసీకి పెద్ద షాక్.

దీంతో 2026-29 కాలానికి గాను ఐసీసీ కొత్తగా బిడ్డింగ్ ప్రక్రియను నిర్వహించబోతున్నట్లు వార్తలు వస్తున్నాయి. 2024-27 కాలానికి చేరుకున్న ఒప్పందంతో పోలిస్తే.. కొత్త ఒప్పందం విలువ తక్కువ కావడం గమనార్హం. ఈసారి 2.4 బిలియన్ డాలర్ల (సుమారు రూ.21.6 వేల కోట్లు) ఆదాయాన్ని అంచనా వేస్తోంది ఐసీసీ. జియో హాట్‌స్టార్ అర్ధంతరంగా ఒప్పందం రద్దు చేసుకోవడానికి, వచ్చే మూడేళ్లకు మీడియా హక్కుల విలువ తగ్గడానికి కోహ్లీ, రోహిత్ టెస్టులు, టీ20ల నుంచి రిటైరవడం ఓ కారణమనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

**వాళ్లు లేక స్టేడియాలు వెలవెల!**

గత ఏడాది టీ20 ప్రపంచకప్ విజయానంతరం రోహిత్, కోహ్లీ ఒకేసారి పొట్టి క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించారు. భారత్ కప్పు గెలవడం, అందులో రో-కో భాగం కావడంతో ఆదరణ పరంగా సూపర్‌హిట్ అయింది. ఈ టోర్నీలో టీమ్‌ఇండియా మ్యాచ్‌లకు వ్యూయర్‌షిప్ భారీగా వచ్చింది. కానీ ఆ టోర్నీతో రో-కో రిటైరవడంతో టీ20 జట్టుకు ఆకర్షణ తగ్గిపోయింది. తర్వాత భారత టీ20 జట్టు సిరీస్‌ల మీద సిరీస్‌లు గెలుస్తోంది. కానీ రో-కో ఉండగా అభిమానుల్లో ఉన్న ఉత్సాహం ఇప్పుడు లేదన్నది వాస్తవం. టీ20 మ్యాచ్‌లు అంటే ఎవరు ఆడినా స్టేడియాలు నిండుతాయి కానీ.. రోహిత్, కోహ్లీ ఆడుతుంటే స్టేడియాల్లో ఉండే సందడి వేరు. ఈ ఏడాది వీళ్లిద్దరూ టెస్టులకు కూడా గుడ్‌బై చెప్పారు. వీళ్లిద్దరూ రిటైరయ్యాక భారత టెస్టు జట్టు మ్యాచ్‌లు ఆడుతుంటే స్టేడియాలు జనాల్లేక వెలవెలబోతున్నాయి. టెస్టులపై అంతకంతకూ ఉత్సాహం తగ్గుతున్నప్పటికీ.. రో-కోలను చూడడానికి స్టేడియానికి అభిమానులు వచ్చేవారు. కానీ వారు రిటైరయ్యాక టెస్టులపై విముఖత ఇంకా పెరిగిపోయింది. వెస్టిండీస్‌తో సిరీస్ సందర్భంగా వెయ్యి మంది కూడా స్టేడియంలో లేని పరిస్థితి చూశాం. దక్షిణాఫ్రికాతో సిరీస్‌కు టికెట్ల ధరలు బాగా తగ్గించి అభిమానులను రప్పించే ప్రయత్నం చేశారు. కానీ అంతకంతకూ పడిపోతున్న టీవీ వ్యూయర్‌షిప్‌ను మాత్రం పెంచలేకపోతున్నారు.

**ఆశించిన ఆదాయం వస్తుందనే అంచనాలు లేవు!**

వచ్చే ఫిబ్రవరి, మార్చి నెలల్లో భారత్ టీ20 ప్రపంచకప్‌నకు ఆతిథ్యమివ్వబోతోంది. అయినా జియో హాట్‌స్టార్ మీడియా హక్కుల ఒప్పందం నుంచి తప్పుకోవడం వెనక రో-కో ఎఫెక్ట్ ఉందంటున్నారు విశ్లేషకులు. జియో హాట్‌స్టార్ ఓటీటీకి మామూలుగానే నష్టాలు వస్తున్నాయి. ఇటు చూస్తే ఐసీసీ ఈవెంట్ల మీడియా హక్కుల కోసం భారీగా డబ్బులు చెల్లించాలి. కానీ మ్యాచ్‌ల ప్రసారం ద్వారా ఆశించిన ఆదాయం వస్తుందనే అంచనాలు లేవు. రో-కో ప్రస్తుతం వన్డేల్లో మాత్రమే కొనసాగుతున్నారు. వాళ్లు ఆడిన మ్యాచ్‌లకు వీక్షణలు ఎక్కువ ఉంటున్నాయి. అందుకు తగ్గట్లే ప్రకటనల ఆదాయమూ ఉంటోంది. సొంత గడ్డపై జరగనున్న టీ20 ప్రపంచకప్‌లో వీళ్లిద్దరూ ఉంటే ఆ కళే వేరుగా ఉండేది. కానీ రో-కో లేని టోర్నీకి వీక్షణలు, ప్రకటనల ఆదాయం ఆశించిన స్థాయిలో ఉండకపోవచ్చని.. తాము పెడుతున్న భారీ పెట్టుబడికి తగ్గ లాభం రాదనే అంచనాతోనే జియో హాట్‌స్టార్ తప్పుకొందని ట్రేడ్ పండితులు అంటున్నారు. ఈ పరిణామం తర్వాత రో-కో 2027 వన్డే ప్రపంచకప్ వరకు కొనసాగాలనే డిమాండ్ మరింత ఊపందుకుంటుందనడంలో సందేహం లేదు. ఆలోపే వాళ్లిద్దరూ రిటైరైతే మాత్రం ప్రపంచకప్ కళ తప్పడం ఖాయం. వ్యూయర్‌షిప్ కూడా తగ్గిపోతుంది. అందుకే అభిమానులతో పాటు ప్రసారదారులు, స్పాన్సర్లు కూడా ఈ దిగ్గజాలిద్దరూ ఆ మెగా టోర్నీలో ఆడాలని గట్టిగా డిమాండ్ చేసే అవకాశాలున్నాయి.




# 21 ఏళ్ల భారత రికార్డ్ బ్రేక్.. టీమ్‌ఇండియా భారీ స్కోర్.. యూఏఈ లక్ష్యం 434

అండర్-19 ఆసియా కప్ 2025లో భాగంగా దుబాయ్ వేదికగా టీమ్‌ఇండియా, యూఏఈ తలపడ్డాయి. టాస్ గెలిచిన యూఏఈ మొదట బౌలింగ్ ఎంచుకుంది. దీంతో భారత జట్టు తొలుత బ్యాటింగ్‌కు దిగింది. నిర్ణీత 50 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 433 భారీ స్కోర్ సాధించింది. అండర్ 19 విభాగంలో టీమ్‌ఇండియాకు ఇదే అత్యధిక స్కోర్. ఇంతకు ముందు 2004లో భారతజట్టు 425 పరుగులు చేసింది. దీంతో 21 ఏళ్ల రికార్డ్ బ్రేక్ అయింది.

ప్రస్తుత మ్యాచ్‌లో ఓపెనర్ వైభవ్ సూర్యవంశీ సంచలన ఇన్నింగ్స్ ఆడాడు. అతడు 55 బంతుల్లోనే సెంచరీ పూర్తి చేసుకున్నాడు. ఓవరాల్‌గా వైభవ్.. 95 బంతుల్లో 171 పరుగులు చేసి పెవిలియన్‌కు చేరాడు. అతడు తన ఇన్నింగ్స్‌లో ఏకంగా 14 సిక్స్‌లు, 9 ఫోర్లు బాదడం విశేషం. అరోన్ జార్జితో (69బీ 73 బంతుల్లో 7 ఫోర్లు, 1 సిక్స్) కలసి అతడు రెండో వికెట్‌కు 146 బంతుల్లో రికార్డు స్థాయిలో 212 పరుగులు జత చేశాడు.

అరోన్ పెవిలియన్‌కు చేరిన తర్వాత విహాన్ మల్హోత్ర (69బీ 55 బంతుల్లోబీ 7 ఫోర్లు 1 సిక్స్) క్రీజులోకి వచ్చాడు. అతడితో కలిసి వైభవ్ మూడో వికెట్‌కు 34 బంతుల్లో 45 పరుగులు జత చేసి ఔటయ్యాడు. వేదాంత్ త్రివేది (38బీ 34 బంతుల్లో, 3 ఫోర్లు) ఫర్వాలేదనిపించాడు. మరో ఓపెనర్, కెప్టెన్ ఆయుష్ మాత్రే (4బీ11 బంతుల్లో, 1 ఫోర్) బ్యాటింగ్‌లో విఫలమయ్యాడు. చివర్లో అభిజ్ఞాన్ కుందు (32బీ 17 బంతుల్లో, 3 ఫోర్లు, 1 సిక్స్), కాన్సిక్ చౌహాన్ (28బీ 12 బంతుల్లో, 1 ఫోర్, 3 సిక్స్‌లు) వేగంగా పరుగులు చేశారు. ఖిలాన్ పటేల్ 5 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. యూఏఈ బౌలర్లలో ఉద్దిశ్ సురి, యుగ్ శర్మ 2, షలోమ్ డిసౌజ, యాయిన్ రాయ్ తలో వికెట్ తీసుకున్నారు.

# వినేశ్ ఫొగాట్ యూటర్న్.. రిటైర్మెంట్ నుంచి వెనక్కి

స్టార్ రెజ్లర్ వినేశ్ ఫొగాట్ యూటర్న్ తీసుకున్నారు. రిటైర్మెంట్‌ను వెనక్కి తీసుకుంటున్నట్లు శుక్రవారం ప్రకటించారు. ఒలింపిక్ కలను నెరవేర్చుకునేందుకు మళ్లీ రెజ్లింగ్ రింగ్‌లోకి అడుగుపెట్టాలనుకుంటున్నట్లు చెప్పారు (. 2028లో లాస్‌ఏంజెలెస్ ఒలింపిక్స్‌లో పోటీ పడేందుకు సిద్ధమవుతున్నట్లు పేర్కొన్నారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా ఆమె పోస్టు పెట్టారు.


2024లో పారిస్ ఒలింపిక్స్ మహిళల 50 కేజీల విభాగంలో ఫైనల్‌కు చేరిన వినేశ్ ( రజతం ఖాయం చేసింది. కానీ రెండోరోజు బరువు చూసే సమయానికి 100 గ్రాములు అదనంగా ఉండటంతో ఆమెపై అనర్హత వేటు పడిన సంగతి తెలిసిందే. ఈ బాధతోనే రెజ్లింగ్‌కు రిటైర్‌మెంట్ ప్రకటించిన సంగతి తెలిసిందే. తర్వాత రాజకీయాల్లోకి వచ్చిన ఆమె.. హరియాణా అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసి, జులానా నియోజకవర్గం నుంచి విజయం సాధించారు. మరోవైపు, ఈ జులైలో ఆమె ఒక బాబుకు జన్మనిచ్చారు. ఈ విషయాన్ని కూడా ఆమె పోస్టులో పేర్కొన్నారు. "ఈసారి నేను ఒంటరిగా ప్రయాణించడం లేదు. నా టీమ్‌లో ఇప్పుడు నా కుమారుడు ఉన్నాడు. వాడే నాకు అసలైన ప్రేరణ. నా లాస్‌ఏంజెలెస్ ఒలింపిక్స్ ప్రయాణంలో వాడు నా చిట్టి చీర్‌లీడర్'' అని రాసుకొచ్చారు.



**"ఈసారి నేను ఒంటరిగా ప్రయాణించడం లేదు. నా టీమ్‌లో ఇప్పుడు నా కుమారుడు ఉన్నాడు. వాడే నాకు అసలైన ప్రేరణ. నా లాస్‌ఏంజెలెస్ ఒలింపిక్స్ ప్రయాణంలో వాడు నా చిట్టి చీర్‌లీడర్" అని రాసుకొచ్చారు.**

వినేశ్ ఇప్పటికి పలుమార్లు ఒలింపిక్స్‌లో పోటీ పడ్డారు. 2016లో జరిగిన ఒలింపిక్స్‌తో ఆమె ఎంట్రీ ఇచ్చారు. అయితే అప్పట్లో మోకాలి గాయంతో క్వార్టర్స్ నుంచి వైదొలగాల్సి వచ్చింది. 2021లో భారీ అంచనాలతో టోక్యో ఒలింపిక్స్‌లోకి అడుగుపెట్టినప్పటికీ.. అక్కడా క్వార్టర్స్‌లోనే అనూహ్యంగా ఓటమి చవిచూశారు. 2024లో త్రుటిలో పతకం చేజార్చుకున్న సంగతి తెలిసిందే.

# నితీశ్‌కుమార్ రెడ్డి హ్యాట్రిక్.. అయినా ఆంధ్రాకు తప్పని ఓటమి




ఇంటర్నెట్ డెస్క్: ఫామ్ కోల్పోయి ప్రస్తుతం టీమ్‌ఇండియాకు దూరమైన ఆల్‌రౌండర్ నితీశ్‌కుమార్ రెడ్డి సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో మాత్రం బంతితో మెరిశాడు. ఆంధ్ర తరఫున బరిలోకి దిగిన అతడు మధ్యప్రదేశ్‌తో జరిగిన మ్యాచ్‌లో హ్యాట్రిక్ వికెట్లు తీసుకున్నాడు. తొలుత హర్ష్ గవాలిని 5 పరుగుల వద్ద క్లీన్ బౌల్డ్ చేశాడు. తరువాత వరుస బంతుల్లో హర్‌ప్రీత్ సింగ్, రజత్ పాటీదార్‌ను ఔట్ చేశాడు. అంతకుముందు ఆంధ్రా జట్టు 19.1 ఓవర్లలో 112కు ఆలౌటైంది. శిఖర్ భరత్ (39బీ 31 బంతుల్లో, 4 ఫోర్లు, 2 సిక్స్‌లు), నితీశ్‌కుమార్ రెడ్డి (25బీ 27 బంతుల్లో, 3 ఫోర్లు) మాత్రమే చెప్పుకోదగ్గ స్కోర్లు చేశారు. మిగతా బ్యాటర్లంతా చేతులెత్తేశారు.

113 పరుగుల విజయలక్ష్యంతో బరిలోకి దిగిన మధ్యప్రదేశ్ జట్టు 17.3 ఓవర్లలోనే ఆరు వికెట్లు కోల్పోయి విజయం సాధించింది. రిషభ్ చౌహాన్ (47బీ 43 బంతుల్లో, 6 ఫోర్లు), రాహుల్ బథమ్ (35లిబీ 32 బంతుల్లో, 3 ఫోర్లు) రాణించారు. వెంకటేశ్ అయ్యర్ (22బీ 18 బంతుల్లో, 2 ఫోర్లు) ఫర్వాలేదనిపించాడు. కెప్టెన్ రజత్ పాటీదార్ డకౌటయ్యాడు. ఆంధ్రా బౌలర్లలో నితీశ్ కుమార్ రెడ్డి 3, కేవీ శశికాంత్, సత్యనారాయణ రాజు తలో వికెట్ తమ ఖాతాలో వేసుకున్నారు. ఈ మ్యాచ్‌లో ఆంధ్రాపై మధ్యప్రదేశ్ 4 వికెట్ల తేడాతో గెలిచింది.

# ‘అఖండ 2’ నిర్మాణ సంస్థకు ఊరట

అఖండ 2’ నిర్మాణ సంస్థ 14 రీల్స్ ప్లస్ కు తెలంగాణ హైకోర్టు డివిజన్ బెంచ్‌లో ఊరట దక్కింది. సింగిల్ బెంచ్ ఇచ్చిన ఉత్తర్వులపై డివిజన్ బెంచ్ స్టే విధించింది. సింగిల్ బెంచ్ ఉత్తర్వులపై ఈ నెల 14 వరకూ డివిజన్ బెంచ్ స్టే ఇస్తూ.. తదుపరి విచారణను ఈ నెల 15కు వాయిదా వేసింది. బాలకృష్ణ కథానాయకుడిగా బోయపాటి శ్రీను దర్శకత్వంలో రూపొందిన చిత్రం ‘అఖండ2: తాండవం’. తెలంగాణలో ఈ మూవీ టికెట్ ధరల పెంపు, ముందస్తు ప్రీమియర్‌లపై గురువారం హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. దీన్ని విచారించిన కోర్టు ప్రీమియర్ రద్దుతో పాటు, టికెట్ ధరలను పెంచకూడదంటూ ఆదేశాలు జారీ చేసింది. దీనిపై చిత్ర నిర్మాణ సంస్థ డివిజన్‌కు అప్పీల్ చేసుకుంది.



# ‘అఖండ 2’ రిలీజ్.. థియేటర్‌ల వద్ద అభిమానుల సందడి..

## మూడో భాగం కూడా ఖరారు

బాలకృష్ణ సినిమా వచ్చిందంటే థియేటర్‌లలో పండగ వాతావరణం నెలకొంటుంది. ఆయన హీరోగా బోయపాటి శ్రీను దర్శకత్వంలో తెరకెక్కిన ‘అఖండ2: తాండవం’ 2) నేడు ప్రేక్షకుల ముందుకువచ్చి అలరిస్తోంది. వీరిద్దరి కాంబినేషన్‌లో వచ్చిన ‘అఖండ’కు సీక్వెల్‌గా రూపొందిన ఈ సినిమాలో బాలకృష్ణ తన నటనతో ఆకట్టుకుంటున్నారు. థియేటర్‌ల వద్ద అభిమానులు సందడి చేస్తున్నారు. ప్రస్తుతం ఆ వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. దీంతో సోషల్ మీడియాలో ‘అఖండ 2’ హ్యాష్‌ట్యాగ్ ట్రెండ్ అవుతోంది. మరోవైపు ఈ సినిమా చివర్లో ‘అఖండ 3’ 3) కూడా ఉన్నట్లు చిత్రబృందం హింట్ ఇచ్చింది. ‘జై అఖండ’ పేరుతో మూడో భాగం రానున్నట్లు టైటిల్స్ వేయడంతో ఫ్యాన్స్ ఖుష్ అవుతున్నారు.



# ఇది ఒత్తిడి కాదు.. గౌరవం

“తన కల చాలా పెద్దది.. సాధించలేనిదని భావించే ప్రతి అమ్మాయితో నేను మాట్లాడాలని అనుకుంటున్నా” అంటోంది కథానాయిక అలియా భట్. త్వరలో ‘ఆల్ఫా’ చిత్రంతో తెరపై యాక్షన్ హంగామాను మొదలు పెట్టడానికి సిద్ధమవుతోంది భామ. నటనతోనే కాకుండా.. అవకాశం వచ్చినప్పుడల్లా అంతర్జాతీయ వేదికలపై మెరుస్తూ సినీప్రియుల్ని ఆకర్షిస్తుంది. తాజాగా రెడ్ సీ ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో సందడి చేసింది అలియా. ఈ సందర్భంగా తన కెరీర్ గురించి కొన్ని ఆసక్తికర విషయాల్ని పంచుకుంది.

“అంతర్జాతీయ వేదికపై భారతదేశానికి ప్రాతినిధ్యం వహించడం ఏ నటికైనా గొప్ప బాధ్యత. నా దృష్టిలో ఇది ఒత్తిడి కాదు.. గౌరవం, గర్వం. మెట్‌గాలా, కేన్స్ లాంటి మరే ఇతర అంతర్జాతీయ కార్యక్రమం అయినా వేదికపై ఎంత గొప్పగా కనిపించినా.. ఆ తర్వాత అది సాధారణమవుతుంది. గ్లామర్, మంచి లుక్, రాత్రి తరచుగా పైజామాలో పిజ్జా తినడంతోనే ముగుస్తుంది(నవ్వుతూ)”.

అది నిర్ణయించేది ప్రేక్షకులే

రాహా మా జీవితంలోకి వచ్చాక చాలా మార్పులు వచ్చాయి. ప్రస్తుతం ఆమె ‘అమ్మా ఎక్కడికి వెళ్తున్నావు..? ఎప్పుడు వస్తావు’ అని అడిగేంత వయసులో ఉంది. అందుకే రోజూ నా ప్రయాణం చాలా భావోద్వేగంగా మారుతుంది. ఇక చిత్రపరిశ్రమ విషయానికొస్తే.. బంధుప్రీతి గురించి ఎప్పుడూ మాట్లాడుతూనే ఉంటారు. కానీ ఇక్కడ ఎవరు ఉండాలి.. ఎవరు వెళ్లాలో నిర్ణయించేది ప్రేక్షకులే. నేను ఇప్పుడు తల్లి అయినప్పటికీ... ప్రపంచాన్ని చుట్టి వచ్చినప్పటికీ.. విజయాలు సాధించినా.. నన్ను నేను ఓ విషయంలో కోల్పోకూడదనుకుంటా. ఏం జరిగినా.. ఎప్పుడూ నేర్చుకుంటూనే ఉండాలనుకుంటున్నా”.



అలియా భట్

# ఖాళీ లేదు.. ఖాతా జీరో

## ఈ ఏడాది తెరపై కనిపించని కథానాయకులు

## 2026లో వరుస సినిమాలతో సందడి..




చిత్రసీమను కళకళలాడించడంలో యువ హీరోలే కీలకంగా నిలుస్తుంటారు. తీరికనే పదానికి తమ డైరీల్లో చోటే లేదన్నట్లు బాక్సాఫీస్ బరిలో సందడి చేస్తుంటారు. ఏడాదికి ఒకటికి రెండు సినిమాలతో సినీప్రియులకు వినోదం వడ్డిస్తుంటారు. కానీ, ఈ 2025లో చాలా మంది కుర్ర స్టార్ల డైరీల్లో విడుదల మాటే కనిపించలేదు. కొందరు కథల ఎంపికలో ఆచితూచి వ్యవహరించడం.. మరికొందరు చిత్రీకరణలతో బిజీగా ఉన్నా అనుకున్న సమయానికి సినిమాలు పూర్తి కాకపోవడం.. ఇలా రకరకాల కారణాలతో ఈ ఏడాది తెరపై కనిపించలేదు. అంతేకాదు వీళ్లతో పాటు కొందరు అగ్రతారలూ ఒక్క విడుదల లేకుండానే ఈ 2025కి వీడ్కోలు పలకనున్నారు. మరి ఈ ఏడాది తెరపై దర్శనమివ్వని ఆ తారలెవరు? 2026లో బాక్సాఫీస్ బరిలో వాళ్ల సందడి ఎలా ఉండనుంది?

ఏడాదికి ఒకటికి రెండు చిత్రాలతో బాక్సాఫీస్ బరిలో జోరు చూపించే హీరోల్లో నిఖిల్, సాయిదుర్గా తేజ్, అడివి శేష్, వరుణ్ తేజ్ తదితరులు ముందు వరుసలో ఉంటారు. వీళ్ల సినీ ప్రయాణంలో విరామాలు చాలా తక్కువనే చెప్పొచ్చు. కానీ, 2025లో వీళ్ల నుంచి ఒక్క చిత్రం బయటకు రాలేదు. అలాగని ఈ హీరోలంతా ఏడాదంతా ఖాళీగానూ లేరు. వరుస సినిమాలతో సెట్స్‌పై బిజీగానే గడిపారు. అవన్నీ వచ్చే ఏడాదిలోనే వరుసగా ప్రేక్షకుల్ని పలకరించనున్నాయి.

‘కార్తికేయ 2’తో జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చుకున్నారు కథానాయకుడు నిఖిల్. ఆయన గతేడాది ‘అప్పుడో ఇప్పుడో ఎప్పుడో’ సినిమాతో ప్రేక్షకుల్ని పలకరించగా.. ఈ ఏడాది ఒక్క చిత్రాన్ని బయటకు తీసుకు రాలేకపోయారు. అలాగని ఆయన చేతిలో సినిమాలు లేక కాదు. ఈ ఏడాదంతా తను ‘స్వయంభూ’, ‘ది ఇండియా హౌస్’ చిత్రాలతో సెట్స్‌పై తీరిక లేకుండానే గడిపారు. నిజానికి వీటిలో ‘స్వయంభూ’ ఈపాటికే తెరపైకి రావాల్సి ఉండగా.. రకరకాల కారణాల వల్ల ఆలస్యమైంది. ప్రస్తుతం నిర్మాణానంతర పనుల్లో ఉన్న ఈ పీరియాడిక్ యాక్షన్ డ్రామా వచ్చే ఏడాది ఫిబ్రవరిలో తెరపైకి వచ్చే అవకాశముంది. ఇక చిత్రీకరణ దశలో ఉన్న మరో సినిమా ‘ది ఇండియా హౌస్’ వచ్చే ఏడాది చివర్లో ప్రేక్షకుల్ని పలకరించనున్నట్లు తెలుస్తోంది.

2022లో ‘మేజర్’, ‘హిట్: ది సెకండ్ కేస్’ చిత్రాలతో వరుస విజయాలందుకున్న అడివి శేష్.. ఆ తర్వాత 2023, 2024 సంవత్సరాల్ని ఒక్క విడుదల లేకుండానే ముగించారు. ఈ ఏడాది తన నుంచి ‘డెకాయిట్: ఎ లవ్‌స్టోరీ’ విడుదల కావాల్సి ఉండగా.. చిత్రీకరణ ఆలస్యమవ్వడం వల్ల అది వచ్చే ఏడాది మార్చి 19కి వాయిదా పడింది. ఇక ఆయన నటిస్తున్న మరో సినిమా ‘జీ2’ కూడా వచ్చే ఏడాది ప్రథమార్ధంలోనే తెరపైకి రానుంది. విజయవంతమైన ‘గూఢచారి’ సినిమాకి కొనసాగింపుగా రూపొందుతున్న ఈ చిత్రం మే 1న థియేటర్లలోకి రానున్నట్లు ఇప్పటికే ప్రకటించారు.

‘విరూపాక్ష’, ‘బ్రో’ చిత్రాలతో 2023లో వరుస విజయాలు ఖాతాలో వేసుకున్న సాయి దుర్గా తేజ్.. గతేడాది ఒక్క సినిమాని విడుదల చేయలేదు. గత కొన్ని నెలలుగా చిత్రీకరణ దశలో ఉన్న తన ‘సంబరాల ఏటి గట్టు’ చిత్రం దసరాకి విడుదల కావాల్సినప్పటికీ.. చిత్రీకరణ ఆలస్యమవ్వడం వల్ల వాయిదా పడింది. దీన్నిప్పుడు వచ్చే ఏడాది వేసవికి తెరపైకి తీసుకొచ్చేందుకు ఆ చిత్ర నిర్మాతలు సన్నాహాలు చేస్తున్నారు. ‘ఆపరేషన్ వాలెంటైన్’, ‘మట్కా’ చిత్రాలతో గతేడాది వరుసగా చేదు ఫలితాలు అందుకున్నారు వరుణ్ తేజ్. దీంతో కథల ఎంపికలో జాగ్రత్త పడ్డ ఆయన.. ఆచితూచి దర్శకుడు మేర్లపాక గాంధీ కథకు ఓకే చెప్పారు. వరుణ్ 15వ సినిమాగా ఈ ఏడాది ఆరంభంలో సెట్స్‌పైకి వెళ్లిన ఈ హారర్ కామెడీ ఎంటర్‌టైనర్ 2026 ప్రథమార్ధంలో థియేటర్లలోకి రానుంది.

‘మిస్ శెట్టి మిస్టర్ పొలిశెట్టి’ విజయం తర్వాత నవీన్ పొలిశెట్టి వెంటనే ‘అనగనగా ఒక రాజు’ చిత్రాన్ని ప్రకటించారు. కానీ, తను అనుకోకుండా రోడ్డు ప్రమాదానికి గురి కావడం వల్ల గతేడాది చిత్రీకరణ ప్రారంభించలేకపోయారు. ఎట్టకేలకు ఇది ఈ సంవత్సరం ఆరంభంలో సెట్స్‌పైకి వెళ్లినప్పటికీ.. వచ్చే ఏడాది సంక్రాంతికి ప్రేక్షకుల ముందుకు రానుంది

గత కొన్నేళ్లుగా వరుస పరాజయాలతో సతమతమవుతున్నారు హీరోలు నాగశౌర్య, అఖిల్ అక్కినేని. అందుకే కాస్త విరామం తీసుకుని కథల ఎంపికపై దృష్టి సారించారు ఈ ఇద్దరూ. దీంతో ఈ ఏడాది వీళ్ల నుంచి ఒక్క చిత్రం బయటకు రాలేదు. ప్రస్తుతం అఖిల్ నటిస్తున్న ‘లెనిన్’, నాగశౌర్య చేస్తున్న ‘బ్యాడ్‌బాయ్ కార్తీక్’ సినిమాలు ముగింపు దశలోనే ఉన్నాయి.

‘ఉప్పెన’తో హీరోగా తొలి అడుగులోనే భారీ విజయాన్ని ఖాతాలో వేసుకున్నారు వైష్ణవ్ తేజ్. కానీ, ఆ తర్వాత వరుస సినిమాలు చేసినా ఆస్థాయిలో మరో విజయాన్ని అందుకోలేకపోయారు. దీంతో 2023 తర్వాత ఆయన నుంచి మరో చిత్రమేదీ బయటకు రాలేదు.

ఈ అగ్ర హీరోలు కనిపించలేదు!

తెలుగు అగ్ర కథానాయకుడు చిరంజీవి వెండితెరపై కనిపించి రెండేళ్లు పూర్తయింది. నిజానికి ఆయన ‘భోళా శంకర్’ విడుదలైన వెంటనే ‘విశ్వంభర’ను పట్టాలెక్కించినప్పటికీ.. విజువల్ ఎఫెక్ట్ పనులు ఆలస్యం వల్ల పలుమార్లు వాయిదా పడి ఆఖరికి అది వచ్చే ఏడాది వేసవికి వెళ్లిపోయింది. ఇక చిరు ఈ ఏడాది ‘మన శంకరవరప్రసాద్ గారు’ చిత్రాన్ని పట్టాలెక్కించినప్పటికీ.. అది సంక్రాంతి బరిలో నిలవనున్నట్లు ముందే ప్రకటించారు. చిరు త్వరలో బాబీ దర్శకత్వంలో కొత్త సినిమాకి శ్రీకారం చుట్టనున్నారు. అన్నీ అనుకున్నట్లు జరిగితే దాన్ని కూడా వచ్చే ఏడాదే తెరపై చూసే అవకాశం లేకపోలేదని వార్తలు వినిపిస్తున్నాయి. ఇదే జరిగితే చిరు వచ్చే సంవత్సరం ముచ్చటగా మూడు చిత్రాలతో పలకరించినట్లవుతుంది.

గతేడాది సంక్రాంతికి ‘గుంటూరు కారం’తో ప్రేక్షకుల్ని పలకరించారు కథానాయకుడు మహేశ్‌బాబు. ఆ తర్వాత నుంచి ఆయన పూర్తిగా ‘వారణాసి’పైనే దృష్టి సారించారు. దర్శకుడు రాజమౌళి రూపొందిస్తున్న ఈ సినిమా ఈ ఏడాది ఆరంభంలో చిత్రీకరణ ప్రారంభించుకుంది. 2026 చివరి నాటికి చిత్రీకరణ పూర్తి చేసుకుని 2027 వేసవికి రానుంది. గతేడాది చివర్లో ‘పుష్ప 2’తో భారీ విజయాన్ని ఖాతాలో వేసుకున్నారు అల్లు అర్జున్. ప్రస్తుతం ఆయన అట్లీ దర్శకత్వంలో ఓ సినిమా పట్టాలెక్కించినప్పటికీ.. అది పూర్తయ్యి, తెరపైకి రావడానికి 2027 వరకు వేచి చూడక తప్పదనే సంకేతాలందుతున్నాయి.

‘కల్కి 2898ఏడీ’ సినిమా తర్వాత హీరో ప్రభాస్ నుంచి మరో చిత్రమేదీ తెరపైకి తీసుకురాలేదు.

‘ది రాజాసాబ్’తో ఈ ఏడాది తెరపై సందడి చేస్తారని భావించినప్పటికీ.. విజువల్ ఎఫెక్ట్స్ పనుల ఆలస్యం వల్ల వచ్చే సంక్రాంతికి వాయిదా పడింది. ఇక తను నటిస్తున్న మరో సినిమా ‘ఫౌజీ’ వచ్చే ఏడాది ద్వితీయార్ధంలో ప్రేక్షకుల్ని పలకరించనుంది. అయితే ప్రభాస్ నుంచి ఈ ఏడాది ఒక్క సినిమా బయటకు రాకున్నా.. తను ‘కన్నప్ప’లో అతిథి పాత్రలో మెరవడం, ‘బాహుబలి’ చిత్రాలు ‘బాహుబలి ది ఎపిక్’ పేరుతో ఒక్క భాగంగా థియేటర్లలో సందడి చేయడం ప్రేక్షకులకు కిక్ ఇచ్చింది.

Printed,Published and Owned by Kesaram Penta Reddy on behalf of Sri Muktheswara Publications, Printed and Published from Sri Muktheswara Publications, Plot No.31, Road No.5, Mallikarjunanagar Colony, Sagar Ring Road Bairamalguda,Hyderabad - 500079, Telangana. Tel: 040-24044446, Fax: 040-24054446, Cell: 9440265569 Email: bharathasakti@gmail.com, RNI No. APTEL/2006/17880, Editor: Kesaram Penta Reddy